# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 4 | జనవరి 2026 | వెల : రూ.15

స్వతంత్ర జీవనానికి సంపద పంపిణీ ఉద్యమం

జనవరి 26 : ప్రజా రిపబ్లిక్ దినోత్సవం

సంపద పన్ను, వారసత్వ పన్నులతో సంక్షేమ రాజ్యం

ఇది సకాలపు సబబేనా..?

ఆర్థిక అసమానతలు తగ్గించడమే పరమావధి

సంపద కేంద్రీకరణ రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధం

సంపదల పంపిణీ అసమానతల అగాథం

అసమానతల భారతం

కార్పొరేట్ దురాశ వల్లే అసమానతలు

పన్ను విధానాల్లో మార్పే విరుగుడు

సంపద పన్ను శిక్ష కాదు, సంపద సృష్టే!

సంపద పంపిణీ నినాదం.. వర్గ పోరాట ప్రాథమిక రూపం

ప్రజా ఉద్యమమైతే సంపద పంపిణీ సాధ్యమే

అవధులు లేని అసమానతలు

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అసమానతల భారత్ ?

ప్రాసంగికం అవుతున్న గ్రాంసీ

రాజ్యాంగ శాసనసభలో పీఠికపై చర్చ

మాటలకు లోతూ, చూపులకు వైశాల్యమూ సంతరించే రచన

ఆర్వీ రామారావు వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర

జనవరి - 2026 పేజీలు : 54

# దారి దీపం

సంపుటి : 4 - సంచిక : 4 మాసపత్రిక


డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. స్వతంత్ర జీవనానికి సంపద పంపిణీ ఉద్యమం - సంపాదకీయం 3
2. జనవరి 26 : ప్రజా రిపబ్లిక్ దినోత్సవం - డి.వి.వి.యస్.వర్మ 4
3. సంపద పన్ను, వారసత్వ పన్నులతో సంక్షేమ రాజ్యం - ప్రభాత్ పట్నాయక్ 6
4. ఇది సకాలపు సబబేనా..? - రాహుల్‌కుమార్ 8
5. ఆర్థిక అసమానతలు తగ్గించడమే పరమావధి - కె.రామచంద్రమూర్తి 10
6. సంపద కేంద్రీకరణ రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధం - ఆర్వీ రామారావు 12
7. సంపదల పంపిణీ అసమానతల అగాధం - తెలకపల్లి రవి 14
8. అసమానతల భారతం -వి.రాంభూపాల్ 17
9. కార్పొరేట్ దురాశ వల్లే అసమానతలు - ఎ.నర్సింహారెడ్డి 19
10. పన్ను విధానాల్లో మార్పే విరుగుడు - ప్రొఫెసర్ లుకాస్ ఛాన్సల్ 21
11. సంపద పన్ను శిక్ష కాదు, సంపద సృష్టి! - ఆకుల అమరయ్య 23
12. సంపద పంపిణీ నినాదం.. వర్గ పోరాట ప్రాథమిక రూపం - ఎం.కోటేశ్వరరావు 26
13. ప్రజా ఉద్యమమైతే సంపద పంపిణీ సాధ్యమే - డాక్టర్ సీ.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి 29
14. అవధులు లేని అసమానతలు - ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ 32
15. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అసమానతల భారత్ ? - సి.రామచంద్రయ్య 33
16. ప్రాసంగికం అవుతున్న గ్రాంసీ - కొప్పర్తి వెంకటరమణమూర్తి 34
17. రాజ్యాంగ శాసనసభలో పీఠికపై చర్చ - డా.ఎ.బి.సాయిప్రసాద్ 37
18. మాటలకు లోతూ, చూపులకు వైశాల్యమూ సంతరించే రచన - కల్లూరి భాస్కరం 40
19. ఆర్వీ రామారావు వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర - తాడి ప్రకాష్ 48
20. ప్రజా రిపబ్లిక్ ఉద్యమ సభలు ఛాయా చిత్రాలు.. వార్తలు 51
21. కార్టూన్స్ 53
22. కొత్త పుస్తకాల స్వీకారం 54




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

## దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM



# స్వతంత్ర జీవనానికి సంపద పంపిణీ ఉద్యమం

కొత్త సంవత్సరం వచ్చింది కాని కొత్త జీవితం రాలేదు. కొత్త సంవత్సరం కాలమానం మాత్రమే, మన జీవితాలను మార్చే శక్తి దానికి లేదు. దానికి మనమే కొత్త దారులు వేసుకోవాలి. కొత్త ఆకాంక్షలను, కొత్త నినాదాలను మనమే రూపొందించుకోవాలి. రాజ్యాంగ పీఠిక మనకు దారి చూపిస్తుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించే హామీని మనం ఆచరణలో సాధించాలి. ఈ లక్ష్యాలను సాకారం చెయ్యడానికి రూపుదిద్దుకున్నదే 'ప్రజా రిపబ్లిక్ ఉద్యమం'. మన సమాజంలో పుట్టుకతో కులపరమైన, మతపరమైన, లింగపరమైన వివక్ష వుంది. వివక్ష లేని సమాజం ఒక దీర్ఘ కాలిక లక్ష్యం. అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలు కల్పించడం సాధ్యం. దీనివల్ల వివక్ష లేని సమాజానికి తొలి అడుగులు పడతాయి. అలాగే ఆర్థిక న్యాయం అంటే సంపదలో అసమానతలను తొలగించడం దీర్ఘకాల లక్ష్యం. తక్షణం పోగుపడ్డ సంపదను వివిధ పన్నుల ద్వారా సేకరించి శ్రమ జీవులకు పంపిణీ చెయ్యడం సాధ్యం. సంపద సృష్టించే వారికి సంపదలో వాటా అన్న భావన విస్తరిస్తే సమ సమాజ లక్ష్యానికి తొలి అడుగులు పడతాయి.

రాజకీయ న్యాయంలో, ఓటు హక్కులో సమానత్వం వుంది. కాని, అత్యధిక సంఖ్యలో ఓటర్లుగా వున్న శ్రమజీవులు సామాన్యులు. రాజకీయ పరిభాషలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలు అత్యధిక సంఖ్యాకులుగా వున్నారు. కాని, ఎన్నికలు కుబేరుల ఆటగా మార్చడంతో వారికి భాగస్వామ్యం లేదు. ఈ తరగతుల వారంతా ఏకం కాగలిగితే రాజ్యాధికారంలో కీలక పాత్రధారులవుతారు. అలాంటి చైతన్యాన్ని వారికి అందించాలి. ఈ అవగాహనతో 'ప్రజా రిపబ్లిక్ ఉద్యమం' ప్రారంభమైంది.

ప్రస్తుత రాజకీయంలో హిందుత్వ ఉన్మాద శక్తులు, కార్పొరేట్ శక్తుల జమిలి పాలన సాగుతున్నది. కార్పొరేట్ల అండతో పాలకులు ధన రాజకీయం చేస్తున్నారు. పాలకుల అండతో కార్పొరేట్లు దేశ సంపదను స్వంతం చేసుకుంటున్నారు. ఒక శాతం కార్పొరేట్ల దగ్గర 46 శాతం సంపద, పది శాతం దగ్గర 78 శాతం సంపద లక్షల కోట్లలో పోగుపడింది. సంపద సృష్టించిన శ్రమ జీవులు నిరుపేదలుగా వున్నారు. జనాభాలో సగం మంది దగ్గర కేవలం ఆరు శాతం సంపద మాత్రమే వుంది. కార్పొరేట్ వర్గాలు పారిశ్రామిక, వాణిజ్య రంగాలనే కాదు. ప్రకృతి సంపదల మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు.

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో చొరబడి సమాజంలోని అన్ని రంగాలలో నుంచి శ్రమజీవులని, సామాన్యులని కొల్లగొడుతున్నారు. ఈ నేపథ్యంలో సంపద పున: పంపిణీ నినాదానికి ఎంతో ప్రాధాన్యత వుంది. దీని కోసం వివిధ రకాల పన్నులతో కార్పొరేట్ రంగాన్ని కట్టడి చెయ్యాలి. శ్రమ జీవుల సంక్షేమానికి నిధులు సమకూర్చాలి.

ప్రస్తుత ప్రభుత్వం 35 శాతం వున్న కార్పొరేట్ పన్నును 22 శాతానికి తగ్గించింది. సంపద పన్ను, వారసత్వ పన్నులను రద్దు చేసింది. కార్పొరేట్ టాక్స్ మరో మూడు శాతం, సంపద పన్నును 3-5 శాతం, వారసత్వ పన్నును 33 శాతం విధిస్తే దాదాపు 20 లక్షల కోట్లు అదనపు ఆదాయం వస్తుందని ప్రముఖ ఆర్థిక వేత్తలు, సంపద పంపిణీ ఆవశ్యకత మీద పనిచేస్తున్న జాతీయ అంతర్జాతీయ సంస్థలు ప్రకటిస్తున్నాయి.

ఈ పన్ను సొమ్ముతో జాతీయ సంక్షేమ నిధిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి.

ఈ సంక్షేమ నిధి నుంచి శ్రమ జీవులు, సామాన్యుల కుటుంబాలకు జాతీయ బోనస్‌ను అందించాలి.

హక్కుగా మంచి ప్రమాణాల విద్య, వైద్యం, నివాస వసతి ఆహార బాధ్యత, ఉపాధికి చర్యలు తీసుకోవాలి.

రైతులకు రుణమాఫీని ప్రకటించాలి. పంటలకు చట్టబద్ధంగా లాభసాటి ధరలు కల్పించాలి.

యువతకు ఉచితంగా నైపుణ్యాలు, ఉపాధి హామీ గ్యారంటీ చెయ్యాలి.

వేతన జీవుల ఆదాయ పన్ను పరిమితిని తగినంతగా పెంచాలి.

సంపద పంపిణీ నినాదంలో ప్రజా ఉద్యమం విస్తరిస్తే ఈ హక్కుల సాధనతోపాటు దేశ రాజకీయం మారుతుంది. ఇది ప్రజల ఉద్యమం. ఎక్కడికక్కడ ఆసక్తిగల మిత్రులు ఈ ఉద్యమ విస్తరణకు చొరవ తీసుకుంటే అదే ప్రజా ఉద్యమం అవుతుంది. ❑

**- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

# జనవరి 26 : ప్రజా రిపబ్లిక్ దినోత్సవం



- డి.వి.వి.యస్.వర్మ,
దారిదీపం సంపాదకులు

**జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నాడు రాజ్యాంగ పీఠికను మనం జ్ఞప్తికి తెచ్చుకోవాలి. "భారత ప్రజలమైన మనము"తో ప్రారంభమై "రాజ్యాంగాన్ని మనము మనకు సమర్పించుకుంటున్నాము"తో ముగుస్తుంది. ఈ రాజ్యాంగం మన దేశ ప్రజలందరిది. మనందరి సొత్తు. ప్రభుత్వాలు రిపబ్లిక్ దినోత్సవాన్ని లాంఛనంగా ప్రజల భాగస్వామ్యం లేకుండా నిర్వహిస్తున్నాయి. పాలకులే రాజ్యాంగ భక్షకులైనప్పుడు ప్రజలే దానికి రక్షకులు కావాలి. అందువల్ల అన్ని పౌర సంస్థలు, శ్రమజీవుల సంస్థలు, కుల, మత, లింగ వివక్షకు గురవుతున్న తరగతుల సంస్థలు ఐక్యంగా "ప్రజల రిపబ్లిక్ దినోత్సవం"గా జరుపుకోవాలి.**

రాజ్యాంగం రచన కోసం 1946 డిసెంబరు 9న ఏర్పడిన రాజ్యాంగ సభ ముసాయిదా రచనా కమిటీకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్మన్‌గా సారథ్యం వహించారు. రాజ్యాంగ ముసాయిదాకు తుది రూపం ఇవ్వడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది. 1949 నవంబరు 26న ఆమోదించిన రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది. భారతదేశం వివిధ ప్రాంతాలు, భాషలు, వివిధ మతాలు, వేల సంఖ్యలో కులాల దేశం. దేశ ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగ రూపకల్పన చేయడం అంత తేలిక కాదు. ప్రత్యక్షంగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే లోక్‌సభతోపాటు రాష్ట్రాల శాసనసభలకు ప్రాతినిధ్యం కల్పించే రాజ్యసభను ఏర్పాటుచేశారు. యూనియన్ - రాష్ట్రాల మధ్య స్పష్టమైన అధికార విభజన చేశారు.

మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా దేశ పౌరులందరికీ ప్రాథమిక హక్కులను కల్పించే లౌకిక రాజ్యాంగాన్ని తెచ్చారు. అందరికీ ఓటు హక్కుతో అధికారంలో సమానత్వాన్ని కల్పించారు. ఇలా దేశంలో భిన్నత్వాన్ని కాపాడుతూ ఏకత్వాన్ని, సమానత్వాన్ని సాధించే రాజ్యాంగ రచన చేశారు. రాజ్యాంగ లక్ష్యాలను, విలువలను స్పష్టంగా, సంక్షిప్తంగా క్రోడీకరించి ఒక అద్భుతమైన పీఠికను రూపొందించారు.

భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించాలని పీఠిక ప్రకటించింది. ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అందించే హామీని ఇచ్చింది. దేశ సమైక్యతకు ప్రజల మధ్య సౌభ్రాతృత్వం సాధించాలని చెప్పింది. వీటిని రాజ్యాంగంలో పౌరులకు ప్రాథమిక హక్కులుగా - ప్రభుత్వాల కర్తవ్యాలను నిర్దేశించే ఆదేశిక సూత్రాలుగా పొందుపరిచారు. "రాజ్యాంగం ఎంత మంచిదైనా అది అమలు చేయాల్సిన వారు చెడ్డవారైతే అది చెరుపు చేస్తుంది" నవంబరు 26న రాజ్యాంగ సభ ముగింపు సమావేశంలో డాక్టర్ అంబేడ్కర్ చేసిన హెచ్చరికను మనం గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం మనం అలాంటి స్థితిలో వున్నాం. రాజ్యాంగబద్ధ పాలనకు చెరుపు చేసే వారు పాలకులయ్యారు.

గత పదేళ్లకు పైగా ప్రధాని మోదీ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నది. పీఠికలోని సామ్యవాద, లౌకిక పదాలను తొలగించాని రచ్చ చేస్తున్నారు. మహా కుంభమేళాలో సాధు బృందాల ముసుగుతో "హిందూ రాష్ట్ర" మత రాజ్యాంగ ముసాయిదాను ముందుకు తెచ్చారు. మోదీ ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చి ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని తన గుప్పిటిలోకి తెచ్చుకుంది. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించవలసిన భారత ఎన్నికల సంస్థను స్వాధీనం చేసుకుంది. బీహార్ ఎన్నికల్లో గెలిచింది బీజేపీ కూటమి కాదు, గెలిపించింది ఎన్నికల కమిషన్ అన్నది సత్యదూరం కాదు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం సీబీఐ, ఈడీలను వాడుకోవడం ప్రతి రోజూ చూస్తున్నదే.

రాజ్యాంగం దేశ ప్రజలను ఐక్యం చేసే పద్ధతులను రూపొందిస్తే దానికి విరుద్ధంగా ఓట్ల కోసం కుల, మత, ప్రాంతీయ, భాషా పరమైన విద్వేషాల చుట్టూ విభజన రాజకీయం సాగిస్తున్నారు. ఇప్పుడు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న రెండు శక్తులు వున్నాయి. ఒకటి దేశాన్ని పాలిస్తున్న బీజేపీ, సంఘ పరివారం. మరొకటి దేశ సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ శక్తులు. ఇవి రెండూ పెనవేసుకుని వున్నాయి. పరస్పర సహకారంతో, ఆదాన ప్రదానాలతో ఒకరు అధికారాన్ని మరొకరు దేశ సంపదను చేజిక్కించుకుంటున్నారు.

మోదీకి వున్న జనాకర్షణ ఆయన పరిపాలన దక్షత నుంచి వచ్చింది కాదు. ఆయన పాలన ఒక వైఫల్యాల పుట్ట. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ బాదుడు, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, మేకిన్ ఇండియా, స్మార్ట్ సిటీలు, రైతుల ఆదాయం రెట్టింపు వగైరాలన్నీ దీనికి అద్దం పడతాయి. 230 లక్షల కోట్లకుపైగా అప్పుల

చెయ్యడం, అదానీ, అంబానీలను ప్రపంచంలో అత్యధిక సంపన్నులను చెయ్యడం, కార్పొరేట్ శక్తులకు రుణమాఫీలు, రాయితీలుగా 20 లక్షల కోట్ల ప్రజల సొమ్మును దానం చెయ్యడమే ఆయన సాధించిన విజయాలు.

మోదీ తనను తాను హిందూ జాతీయవాదిగా ప్రకటించుకున్నారు. మెజారిటీ మత జాతీయవాద ఉన్మాదాన్ని ప్రేరేపించడానికి హిందుత్వను, హిందూ మతానికి జత చేసి రాజకీయం చేస్తున్నారు. "హిందుత్వ" హిందూ మతం ఒకటి కాదు. హిందుత్వలో మతం లేదు. అది కేవలం "మత రాజకీయం" మాత్రమే. కాని హిందూ మతం ఒక విశ్వాసం. దానికంటూ తనదైన ఒక ప్రత్యేక రాజకీయం లేదు. కాని మోదీ, సంఘ పరివారం ఈ రెంటినీ కలగాపులగం చేసి ఓట్ల కోసం మతపరంగా ప్రజలను విభజించి విద్వేషాన్ని ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. ఇందులోనే మోదీ జనాకర్షణ శక్తి దాగి వుంది. దీనికితోడుగా ఎన్నికలకు అపారమైన నిధులను అందించగల కార్పొరేట్ శక్తుల మిత్రగణాన్ని పెంచి పోషిస్తున్నారు. దీనికి "గోదీ" మీడియా బాకాలు ఊదుతున్నాయి. మరో పక్క స్వతంత్రం రాజ్యాంగ సంస్థలు తలలు వంచుతున్నాయి.

మోదీ జనాకర్షణ సాధన వెనుక ఇన్ని శక్తులున్నాయి. అది ఒక కృత్రిమ సృష్టి నుంచి, ఒక ఉన్మాదం నుంచి పుట్టుకొచ్చిన జనాకర్షణ. యువత, మధ్యతరగతి వర్గాలు ఈ ఆకర్షణకు లోనవుతున్నారు. వారిలో హిందుత్వకు, హిందూమతానికి వున్న తేడాని గుర్తించలేని భావజాల గందరగోళం వుంది. మత స్వేచ్ఛ అందరికీ వుండాలి. కాని మనం వేసే ఓటు లక్ష్యం వేరు. దానిని కుల, మతాలకు అతీతంగా మంచి పాలన కోసం వినియోగించాలి అన్న చైతన్యాన్ని "ప్రజా రిపబ్లిక్ ఉద్యమం" తన ప్రచారంలో భాగం చెయ్యాలి. మరొక అంశం హిందువులకు ఒక దేశం వుండాలని సంఘ పరివారం చేస్తున్న ప్రచారానికి కొందరు లోనౌతున్నారు. ఏ మత రాజ్యంలోనైనా రాజ్యాంగం వుండదు. నామమాత్రంగా వున్నా దాని స్థానాన్ని మత గ్రంథాలు ఆక్రమిస్తాయి. కుంభ మేళాలో ప్రకటించిన "హిందూ రాష్ట్ర" రాజ్యాంగం ప్రకారం హిందువులకు మాత్రమే ఓటు హక్కు, గురుకుల విద్యార్థులైన సనాతనులకు మాత్రమే పోటీ చేసే హక్కు వుంటుందని, దీనికి మనుధర్మ శాస్త్రం, కౌటిల్యుని అర్థశాస్త్రం ఆధారాలని చేసిన ప్రకటన దీనికి అద్దం పడుతుంది. మతరాజ్యంలో పౌరులందరూ సమానం అన్న ప్రజాస్వామ్యం వుండదు. వివక్ష, విద్వేషం రాజ్యం చేస్తాయి. పౌర హక్కులు, స్వేచ్ఛ మృగ్యం అవుతాయన్న స్పృహను పౌరసమాజానికి కలిగించాలి.

మనదేశంలో రకరకాల శ్రమజీవులే అత్యధిక సంఖ్యలో ఓటర్లుగా వున్నారు. రాజకీయ పరిభాషలో వారు షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, ఇతర వెనుకబడిన కులాలు, మైనారిటీలు ఇతర పేదల రూపంలో కనిపిస్తారు. పాలక పార్టీల వాగ్దానాల చుట్టూ తిరుగుతూ "లబ్ధిదారుల భావన"తో వున్నారు. కాని రాజ్యాంగం ప్రకారం వారు హక్కు దారులు. రాజ్యాంగం అందరికీ జీవించే హక్కును, ప్రాథమిక హక్కుగా ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం "గౌరవప్రదమైన జీవితం" ప్రజల ప్రాథమిక హక్కు. అంటే నివాస వసతి, ఆహార భద్రత, వైద్య సేవలు, పిల్లలకు చదువు పాలకుల దయాదాక్షిణ్యాల మీద కాకుండా పొందడం రాజ్యాంగ హక్కు. ఇది జరగాలంటే మోదీ పాలనలతో కుమ్మక్కైన కార్పొరేట్లు దేశాన్ని దోచుకుని పోగు చేసుకున్న సంపదను పునఃపంపిణీ చెయ్యాలి. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు సంపద కేంద్రీకరణ జరగకూడదని, సహజ వనరులు ప్రైవేటుపరం కాకూడదని ప్రకటించింది. అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించే లక్ష్యాన్ని ప్రకటించింది. ప్రముఖ ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం వివిధ పన్నుల ద్వారా ఏటా 15 లక్షల కోట్లు శ్రమ జీవుల సంక్షేమానికి సమకూరతాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు. మన ఓటుతోనే అధికారం-మన పన్నుల డబ్బుతోనే పరిపాలన నడుస్తుంది. మన కుటుంబ అవసరాలకు కొనుగోలు చేసే ప్రతి వస్తువు మీద జీఎస్టీ పేరుతో పన్ను కడుతున్నాం. 2024- 25 సంవత్సరంలో జీఎస్టీ వసూళ్లు 20 లక్షల కోట్ల ఎనిమిది వేల రూపాయలు. ఇందులో 50 శాతంగా వున్న పేదలు 64 శాతం పన్నులు కడుతున్నారని "ఆక్స్ ఫామ్" సంస్థ అంచనా వేసింది. అంటే 2024-25లో 50 శాతంగా వున్న పేదలు 14 లక్షల కోట్లకుపైగా పన్నులు చెల్లిస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు ఇచ్చే సబ్సిడీలు - రాయితీలు 4-5 లక్షల కోట్లకు మించడం లేదు. బడ్జెట్‌లో పేదలు కట్టే పన్నులలో తగిన వాటా శ్రమజీవులు పొందాలి. సంపద పునః పంపిణీ - బడ్జెట్ లో తగిన వాటా ద్వారా వచ్చే సొమ్మును "సామాన్యుల సంక్షేమ నిధిగా" ప్రకటించాలి. ఈ సంక్షేమ నిధి నుండి శ్రమజీవుల, వివక్ష తరగతుల కుటుంబాలకు "వార్షిక బోనస్"ను అందించడంతోపాటు అందరికీ హక్కుగా ఉచితంగా మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలతోపాటు ఉపాధి, ఆహార భద్రత, నివాస వసతి హక్కుగా కల్పించాలి. రైతుల పంటలకు చట్టబద్ధత గల లాభసాటి మద్దతు ధర, యువతకు నైపుణ్యాల శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. "సంపద పునః పంపిణీ-బడ్జెట్‌లో వాటా" నినాదం అత్యధికులను జీవితాలను మారుస్తుంది. అది అంది నినాదంగా ప్రజా ఉద్యమ రూపం ధరిస్తే మోదీ హిందుత్వని-దాని కుమ్మక్కుదారులైన కార్పొరేట్లను ఓడించగల శక్తి అవుతుంది. ఇలాంటి ఉద్యమ నినాదాలతో జనవరి 26న "ప్రజా రిపబ్లిక్ ఉద్యమ దినోత్సవాన్ని" అర్థవంతంగా నిర్వహించుకోవాలి. ❑

# సంపద పన్ను, వారసత్వ పన్నులతో సంక్షేమ రాజ్యం



- ప్రభాత్ పట్నాయక్

పెట్టుబడిదారుడు తన వారసుడికి సంపదను తన తదనంతరం కట్టబెట్టగలగడం అనేది ఆ వ్యవస్థ మనుగడకు అత్యంత కీలకం అని తరచూ భావిస్తూ వుంటారు. అటువంటి దానికి అవకాశం గనుక లేకపోయినట్లైతే పెట్టుబడిదారుడు ముందుకు పోవడానికి ప్రోత్సహించే అంశం వేరే ఏదీ ఉండదని, అప్పుడు ఆ వ్యవస్థ తన చురుకుదనాన్ని కోల్పోతుందని వారు అనుకుంటారు. ఇంతకన్నా అవాస్తవికమైనది మరొకటి ఉండదు. నిజానికి బూర్జువా వర్గం ఆస్తి హక్కును కలిగివుండడాన్ని సమర్థించుకోవడానికి చేసే వాదనలకు వారసత్వం ద్వారా ఆస్తి సంక్రమించడం అనేది విరుద్ధం. పెట్టుబడిదారులకు కొన్ని అరుదైన లక్షణాలు ఉంటాయని, వాటిని వినియోగించగలిగితేనే దేశం సంపద్వంతం అవుతుందని, అందువలన ఆ లక్షణాలను వినియోగించుకోవడానికి వీలుగా పెట్టుబడిదారులకు తగిన ప్రతిఫలం ముట్టాలని పెట్టుబడిదారీ ఆస్తి హక్కును సమర్థించేవారు చెప్తారు. ఆ 'అరుదైన లక్షణాలు' ఏమిటో స్పష్టంగా చెప్పే విషయంలో మాత్రం ఈ సమర్థకుల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఉత్పత్తి జరిగే క్రమాన్ని పర్యవేక్షించడంలో ఆ ప్రత్యేక లక్షణం ఉంటుందని అనుకుందా మా అంటే ఆ పనిని జీతానికి పని చేసే సూపర్‌వైజర్లు చేస్తారు. అందుకు గాను వారికి జీతాలు ముడతాయే తప్ప లాభాలలో వాటా ఏమీ దక్కదు (ఆ కంపెనీలో వారికి షేర్ల రూపంలో కొంత ఆస్తి ఉంటేనే తప్ప). 'పరిశ్రమలను నడిపేది పెట్టుబడిదారులు కాదు, ఆ పని వ్యవస్థీకృత సాంకేతికత ద్వారా జరుగుతుంది' అని జాన్ కెన్నెత్ గాల్బ్రియత్ అన్నారు. పెట్టుబడిదారులకు వుండే 'వేటాడే జంతు ప్రవృత్తి' (యానిమల్ స్పిరిట్స్) గురించి కీన్స్ ప్రస్తావించాడు. పోనీ, అదే వారి ప్రత్యేక, అరుదైన లక్షణం అని అనుకుందామా అంటే ఆ లక్షణం ఎంత మొత్తాన్ని పెట్టు బడిగా పెడతాడో దానిని నిర్ణయిస్తుంది తప్ప అసలు ఆ పెట్టుబ డిదారుడికి ఆ సంపద ఎలా వచ్చిందో, అది ఆస్తి ఏవిధంగా అయిందో వివరించదు. పెట్టుబడి పెట్టడం ద్వారా పెట్టుబడిదారుడు రిస్క్ తీసుకుంటాడు గనుక అతనికి ఆ ప్రతిఫలం ముట్టాల్సిందే అని వాదించే వారున్నారు. కాని నిజానికి రిస్క్ తీసుకునేది పెట్టుబడిదారుడు కాదు. బ్యాంకుల ద్వారా పోగుబడిన ఇతరుల సొమ్ము ఆ పెట్టుబడిదారుల దగ్గరకు చేరుతుంది. దానిని అతడు పెట్టుబడి పెడతాడు. ఆ వెంచర్ గనుక దెబ్బ తింటే దాని పర్యవసానం అనుభవించేది ఆ ఇతరులే. అయితే ఈమధ్య కాలంలో ప్రభు త్వాలు ఆ బ్యాంకులను ఆదుకోడానికి నిధులు వెచ్చిస్తున్నాయి. అలా వెచ్చించడం అంటే ఆ రిస్క్ ప్రభుత్వం తీసుకుంటోందని భావించాలి. అంటే సమాజమే ఆ రిస్క్ తీసుకుంటున్నట్టు అవుతుంది తప్ప పెట్టుబడిదారుడు కాదు. అంటే రిస్క్ తీసుకునే గుణం పెట్టుబడిదారుడికి లేదు.

పెట్టుబడిదారుడు తన ఆదాయాన్ని ఊరికే ఖర్చు చేసేయకుండా పొదుపు చేసి కూడబెట్టి దానిని పెట్టుబడిగా పెడతాడు. ఆ విధంగా ఖర్చు చేయకుండా త్యాగం చేశాడు గనుక అతగాడికి ప్రతిఫలం ముట్టాల్సిందే అని కొందరు వాదిస్తారు. త్యాగం అంటే ఏమిటి? అన్న తాత్విక చర్చలోకి పోనవసరం లేకుండానే ఆ వాదనను తిప్పికొట్టవచ్చు. పెట్టుబడి నుండి పొదుపు వస్తుంది తప్ప పొదుపు నుంచి పెట్టుబడి రాదు. పరిశ్రమల్లో అంత వరకూ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోకుండా ఉన్న సందర్భాల్లో ఆ సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకోవడానికి అదనంగా పెట్టుబడి పెడతారు. ఆ పెట్టుబడి చలామణీ అయ్యే క్రమంలో పొదుపుకు కావలసిన ధనం సమకూరుతుంది. ధరలు పెరిగి కార్మికుల నిజ వేతనాలు పడిపోయినపుడు అలా చౌకగా కార్మికుల శ్రమను పొందగలిగినందు వలన పెట్టుబడిదారుల వద్ద పొదుపుకు ధనం సమకూరుతుంది. అనేకమంది అనేక కారణాల రీత్యా పొదుపు చేస్తారు. అలా చేయడమే 'త్యాగం' అయినట్టు పరిగణించడం, అందుకు వారికి ప్రతిఫలం ముట్టాలని అనడం పెట్టుబడిదారీ వ్యవస్థ నడిచే విధానానికి సరిపడని వాదన.

పెట్టుబడిదారులు ధైర్యశాలురని, అందుచేత కొత్త కొత్త ప్రక్రియలను ప్రవేశ పెట్టగలరని, అటువంటి 'ధైర్యం' కొద్ది మందికే ఉంటుందని, అందుకే వారికి తగిన ప్రతిఫలాన్ని ముట్టజెప్పాలని మరొక వాదన. అయితే, ఎటువంటి కొత్త ప్రక్రియనూ ప్రవేశపెట్టకుండా సాధారణ పునరుత్పత్తినే కొనసాగించినా కూడా పెట్టుబడిదారుడి వద్ద ఉండే ఆస్తి లాభాలను తెచ్చి పెడుతూనే వుంటుంది. అందుచేత ఈ వాదన కూడా చెల్లదు. అయితే, పెట్టుబడిదారుడికి ఆస్తి ఎలా సమకూరిందన్నది కాని, లాభం ఎందుకివ్వాలన్నది కాని ప్రస్తుత చర్చనీయాంశం కాదు. పెట్టుబడిదారులకు కొన్ని అరుదైన

లక్షణాలు ఉంటాయని, అందువలన వారి వద్ద ఆస్తి పోగుపడడం గాని, వారికి లాభం చేకూరడం గాని సమర్థనీయమేనన్న వాదనలు సరైనవే అని మాట వరసకు అనుకుందాం. అటువంటి ప్రత్యేక లక్షణాలు ఏవీ లేకున్నా వారి వారసులకు ఈ ఆస్తి వారసత్వంగా సమకూరడాన్ని ఏ విధంగా సమర్ధిస్తారు ? అట్లా సమర్ధించడం ద్వారా పెట్టుబడిదారుడికి ప్రత్యేక లక్షణాలు వుంటాయన్న వాదనను పరోక్షంగా తిరస్కరించినట్టు అవుతుంది కదా ? కనుక వారసత్వం ద్వారా ఆస్తి సమకూరడం అనేది పెట్టుబడిదారుడు ఆస్తి కలిగి వుండడాన్ని సమర్ధించే వాదనలను పూర్వపక్షం చేస్తుంది. ఒక వాదన ఇంకా ఉండిపోయింది. పెట్టుబడిదారుడికి గనుక ఆస్తిని తన వారసులకు బదలాయించే హక్కు లేకపోతే అతగాడు తన ప్రత్యేక లక్షణాలను ప్రదర్శించడానికి ప్రోత్సాహకం అంటూ (ఇన్సెంటివ్) ఏదీ ఉండదు కదా అన్నదే ఆ వాదన. అయితే ఈ వాదన నిజానికి వారసత్వాన్ని సమర్ధించేదిగా కాక, పెట్టుబడిదారుడి బ్లాక్‌మెయిల్‌ను సమర్ధించేదిగా ఉంది. 'వారసత్వ హక్కును గనుక అంగీకరించకపోతే నా ప్రత్యేక లక్షణాలను బైటపెట్టను' అని పెట్టుబడిదారుడు సమాజాన్ని బెదిరించినట్టు ఉంది ఈ వాదన. నైతికంగా ఈ వాదన సమర్ధనీయం కాదు. పైగా ఇది తర్కానికి నిలిచేది కాదు.

వారసత్వ హక్కు లేనట్లయితే సమాజంలో సృజనాత్మకత లేకుండా పోతుందా ? చొరవ లేకుండా పోతుందా ? నూతన ఆవిష్కరణలు లేకుండా పోతాయా ? నాకు వారసత్వ హక్కు లేకుండా పోయిందని ఒకడు తన చొరవను, సృజనను ప్రదర్శించడం మానుకుంటే, అతనికి బదులు ఆ లక్షణాలను ప్రదర్శించే మరోవ్యక్తి ముందుకు వస్తాడు-అతగాడికి ఎటువంటి వారసత్వమూ సంక్రమించకపోయినా సరే (మార్కెట్‌లో పోటీ ఉంటుంది కదా). అందుచేత బూర్జువా తర్కం ప్రకారం చూసినా, వారసత్వ హక్కుకు ఎటువంటి తార్కిక సమర్ధనా లేదు. అందుచేతనే, పెట్టుబడిదారులకు పూర్తిగా అనుగుణంగా ఉండే ప్రస్తుత నయా ఉదారవాద శకంలో కూడా అనేక పెట్టుబడిదారీ దేశాల్లో వారసత్వ పన్ను చాలా ఎక్కువ శాతంలో విధిస్తున్నారు. జపాన్‌లో వారసత్వ పన్ను 50శాతం. అమెరికాలో కూడా 40శాతం ఉంది. చాలా యూరోపియన్ దేశాలలో 40శాతం వరకూ ఉంది. ఈ పన్నును ఎగ్గొట్టేవాళ్ళు ఎక్కువగానే ఉన్నప్పటికీ, వారసత్వ పన్ను ఉండాలనే సూత్రాన్ని మాత్రం విస్తృతంగానే ఆమోదిస్తున్నారు.

మన దేశంలో మాత్రం ఒక వైపు ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నా, సంపద పన్ను గాని, వారసత్వ పన్ను గాని ఉన్నట్టు గట్టిగా చెప్పుకోడానికి లేదు. ఈ విషయమై పబ్లిక్‌లో ఎటువంటి చర్చ కూడా జరగడంలేదు. రాజ్యాంగం మనకు సమాన అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చినా, చాలా మంది దృష్టిలో సమాన అవకాశాలు అనేవి ఆచరణలో సాధ్యంకాని ఒక కలగానే ఉంది. అందుచేత ఆ విషయాన్ని విడిచిపెట్టి తమ దుర్భర పరిస్థితుల నుండి ఎంతో కొంత ఊరట కలిగించే సహాయ చర్యలనే వారు కోరుకుంటున్నారు.

ప్రజాస్వామ్యం మనగలగాలి అంటే సమాన అవకాశాలు ఉండి తీరాలి (ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండగా సాధ్యం కాదు). సమాన అవకాశాలు కల్పించే వైపుగా అడుగు పడాలంటే సంపదలో ఉన్న అసమానతలను తగ్గించడం, వారసత్వం ద్వారా సంపద సంక్రమించే సూత్రాన్ని రద్దు చేయడం మొదటి మెట్టు అవుతుంది. దీనివలన ఒనగూడేదేమిటో కొన్ని అంకెల ద్వారా వివరించవచ్చు. 2019లో మన దేశంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న సంపద విలువ సుమారు రూ.945 లక్షల కోట్లు అని అంచనా వేశారు. ఇందులో అత్యంత సంపన్నులు ఒక శాతం మంది వద్ద 42.5 శాతం సంపద ఉంది. అంటే అది సుమారు రూ.40 లక్షల కోట్లు. దీని మీద కనీసం 2 శాతం సంపద పన్ను విధించినా దానివలన రూ.8 లక్షల కోట్లు వస్తుంది. (ఎలిజబెత్ వారెన్ అమెరికా అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న కాలంలో ఆమె 5 శాతం సంపద పన్ను విధిస్తానని తన ప్రణాళికలో ప్రకటించింది. తర్వాత బెర్నీ శాండర్స్ సంపద ఎక్కువ ఉన్నకొద్దీ పన్ను రేటు ఎక్కువ ఉండే విధంగా 1 నుండి 8 శాతం వరకూ సంపద పన్ను విధించాలని ప్రతిపాదించాడు.) ఇక వారసత్వ పన్ను సంగతి చూద్దాం. అత్యంత సంపన్నులు ఒక్క శాతం మందిలో ప్రతీ ఏటా 5 శాతం మందికి వారసత్వంగా ఆస్తి వస్తుంది (అంటే అత్యంత సంపన్నుల్లో ప్రతీ 100 మందిలో ఏడాదికి అయిదుగురు తమ వారసులకు ఆస్తులు అప్పజెప్తున్నారు అనుకుందాం). అంటే రూ.400 లక్షల కోట్లలో 5 శాతం అవుతుంది. అది రూ.20 లక్షల కోట్లు. దానిలో మూడో వంతు వారసత్వ పన్నుగా నిర్ణయిస్తే రూ.6.67 లక్షల కోట్ల చొప్పున ప్రతి ఏటా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. జనాభాలో కేవలం ఒక్క శాతంగా ఉన్న అత్యంత సంపన్నులపై ఈ పన్నులు విధిస్తే ప్రభుత్వానికి ఏటా రూ.14.67 లక్షల కోట్లు వస్తాయి. ఇది మన జిడిపిలో 7 శాతం.

## మన దేశం సంక్షేమ రాజ్యంగా ఉండాలంటే..

- (1) అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో చౌకగా ఆహారాన్ని పొందగలిగే హక్కు
- (2) అందరికీ ఉపాధి ఏడాది పొడవునా పొందే హక్కు
- (3) అందరికీ ఉచిత వైద్యసేవలు పొందే ఆరోగ్య హక్కు
- (4) అందరికీ ఉచితంగా యూనివర్సిటీ స్థాయి దాకా


(మిగతా 12వ పేజీలో)

# ఇది సకాలపు సబబేనా..?



- రాహుల్‌కుమార్,
ఆంధ్రజ్యోతి సంపాదకులు

జిలుగు వెలుగుల భారత్ గురించి మనం వినని రోజంటూ ఉండదు. ఉరుకులు పరుగులు తీస్తున్న మన ఆర్థిక వ్యవస్థ గురించి, క్రమం తప్పకుండా ఐదేళ్లకొకసారి శాంతియుతంగా ప్రభుత్వాలను మార్చుకుంటున్న మన ప్రజాస్వామ్యం ఘనత గురించి ఇంటా బయటా చాలా ప్రశంసలూ వినపడతాయి. ప్రశంసలన్నిటిని వట్టి ప్రచారాలుగా, అతిశయోక్తులుగా కొట్టేయటం తేలిక! విశ్లేషించటమే కష్టం! వాస్తవాలనూ ప్రశంసలనూ తక్కెడలో పెట్టి ఒకదానికొకటి సరిగ్గా తూగుతున్నాయా? లేదా? అని బేరీజు వేసుకుంటే దిద్దుబాట్ల అవసరాలు కనపడతాయి. వాటికి సంసిద్ధతను వ్యక్తం చేయటమే ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా సాహసంతో కూడిన పని! ఆరోగ్యకరమైన, నిర్మాణాత్మక విమర్శలు చేయటానికి ప్రజాస్వామ్యాల్లో కూడా ఏటికి ఎదురీదాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భావ ప్రకటనా స్వేచ్ఛకు తిరుగులేదన్న దేశంగా పేరొందిన అమెరికాలో కూడా దానికి వ్యతిరేక వాతావరణం విజృంభిస్తోంది. వ్యక్తుల సామాజిక మాధ్యమాల ఖాతాలను జల్లెడపట్టి ప్రభుత్వ వ్యతిరేక, అనుకూల భావాల వారీగా చిట్టాలను రూపొందిస్తున్నారు. అమెరికా విధానాలను ఎప్పుడో ఒకప్పుడు విమర్శించిన వారు, ఇప్పటికీ వాటితో ఏకీభావం లేని వారు సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో తలకిందులైపోతున్నారు !




అక్కడ సంగతి సరే.. మరిక్కడ సంగతేంటని ప్రశ్నించుకుంటే సంతృప్తికరమైన జవాబు లభించదు. రాజకీయాలనూ, ఆర్థిక విషయాలనూ నిర్మొహమాటంగా చర్చించటం అరుదైపోతోంది. రాజకీయంగా మావైపో, ఆవలివైపో అన్న ధోరణే ప్రబలిపోతోంది. దీనికి భిన్నంగా సమస్యలను సామాజిక, ఆర్థిక, న్యాయ దృష్టితో అంచనా వేయటం, మెరుగైన ముందడుగులు సూచించటం ఎవరైనా చేస్తే సకాలపు సబబుగా భావించాల్సి వస్తోంది.

రాజకీయ, ఆర్థిక విశ్లేషణలో ఇప్పటికే గణనీయంగా కృషి చేసిన ఇద్దరు అధ్యాపకులు అతుల్ కోహ్లీ, కాంతా మురళి 'డెమొక్రసీ అండ్ ఇనీక్వాలిటీ ఇన్ ఇండియా' అన్న తమ తాజా రచనతో ఆ పనిని సమర్థంగా చేశారు. స్వాతంత్ర్యం సాధించిన నాటి నుంచి ఇప్పటి వరకూ భారత్ చాలా కష్టతరమైన ప్రయాణాన్నే చేసింది. సాధించిన గణనీయ విజయాలూ ఉన్నాయి. గట్టిగా ఆశించినా చేరుకోలేని గమ్యాలూ ఉన్నాయి. మత తత్వంతో మొదటికే మోసం వస్తోన్న ప్రమాదాలూ నెలకొంటున్నాయి. వీటి వెనకున్న రాజకీయాలనూ, వాటితో ప్రభావితమవుతోన్న ఆర్థికరంగాన్ని మనం లోతుగా అర్థం చేసుకోవటమే అసలు సమస్య. దేనినైనా ఏ దృక్పథంతో అర్థం చేసుకోవాలన్నది ఎప్పుడూ చిక్కు సమస్యగానే ఉంటుంది. మత దృక్పథంతో ప్రపంచాన్ని చూడటం ఒక రకంగా తేలికైన పని! కష్టాలకూ, నష్టాలకూ, అర్థాలకూ, అనర్థాలకూ, అసమానతలకూ, అదృష్టాలకూ, దురదృష్టాలకూ, అధోగతులకూ, పురోగతులకూ.. ఒక సకలాతీత శక్తినే కారణంగా భావిస్తే, అన్నిటిలోనూ యథాతథ స్థితిని ఆమోదిస్తూ కాలాన్ని వెళ్లదీయొచ్చు. కానీ కాలమే మనిషిని ఆ తరహా ఆలోచనల్లో నిలువనీయటం లేదు. పాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించే ప్రజాస్వామ్య రాజకీయాలు, ఆర్థిక అసమానతలను ఒక పరిమితిలో ఉంచాలనే ఆధునిక దృక్పథాలు బలపడుతోన్న ప్రపంచంలో.. ఎక్కడి పరిస్థితులనైనా వాటికి అనుగుణంగానే విశ్లేషించాలన్న వివేచనే పదును తేలుతోంది.

ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచటానికి తోడ్పడాల్సిన రాజకీయాల్లో కుల, మత అస్తిత్వాల ప్రాధాన్యం పెరగటం, ఆర్థిక అసమానతలు ఏ దేశంలో లేనంతగా పెట్రేగటం భారత్‌కు పెనుసవాళ్లుగా మారాయి. ఆర్థిక ప్రగతికి ప్రభుత్వ విధానాలు దోహదం చేసి.. పరిశ్రమలు, సంస్థల ఏర్పాటులో ప్రభుత్వం క్రియాశీలక పాత్ర పోషించి.. అవసరమైన చోట స్వయంగా స్థాపించి.. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకూ హేతుబద్ధంగా

అందేలా కృషి చేయాలన్న లక్ష్యం 1980ల వరకూ దేశంలో ఎంతోకొంత ఉండేది. ఆ తర్వాత నుంచీ ప్రభుత్వాలు క్రమేపీ ఆ పాత్ర నుంచి తప్పుకొని ఆర్థికాభివృద్ధిని సాధించే లక్ష్యం ప్రైవేటు పరిశ్రమాధిపతులదిగా, వ్యాపారవేత్తలదిగా మాత్రమే భావించటంతో కీలక మార్పులు రావటం మొదలయ్యాయి.

పరిశ్రమలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించటం, వాటికి వనరులను కేటాయించటం, పన్ను రాయితీలు ఇవ్వటం, వాటిల్లో పెట్టుబడులకు ఆహ్వానాలు పలకటం.. ప్రభుత్వాలకు ఏకైక ప్రాధాన్యంగా మారింది. దాని ఫలితంగా ఆర్థికాభివృద్ధి పెరిగింది. అందులో సందేహం లేదు. పెరిగిన సంపదకు అనుగుణంగా ఆదాయ పంపిణీలో న్యాయమూ జరిగి ఉంటే మన రాజకీయాలు కుల, మతతత్వాలకు దూరంగా ఉండేవి.

ఆర్థికాభివృద్ధి సాధనను ప్రధానంగా పరిశ్రమాధిపతులకూ, వ్యాపారవేత్తలకూ వదిలివేస్తూ వారికి అన్ని విధాలుగా అండదండలు అందించటంతోపాటు వారు సమకూర్చే నిధులతో.. విరాళాలతో మాత్రమే పార్టీలను నడిపే పరిస్థితి రావటంతో రాజకీయ రంగంలో ప్రజలను సమీకరించే పద్ధతులే మారిపోయాయి. ఆర్థిక అంశాల ఆధారంగా ప్రజలను ఆకర్షించలేని నిస్సహాయ స్థితిలోకి పార్టీలు పడిపోయాయి.

అన్నింటా పైవర్గాలపై ఆధారపడిన పార్టీలకు కింది, మధ్య తరగతి వర్గాల ఓట్లను వదులుకునే పరిస్థితి మాత్రం లేదు. సోషలిజం, సంక్షేమ రాజ్య భావనలను 1980ల నుంచి అన్ని పార్టీలూ వదులుకున్నాయి. నినాదప్రాయంగా అప్పుడప్పుడూ వాడిన విధానాల్లో, ఆచరణలో వాటిని పూర్తిగా పక్కనపెట్టారు.

1980లో ఇందిరాగాంధీ రెండోసారి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మొదలైన సంపూర్ణ వ్యాపారానుకూల విధానాలను 1991లో విపరీతంగా సరళీకృతం చేశారు. వీటి అమల్లో పార్టీల పరంగా తేడాలు లేకపోయినా ఎన్నికల ద్వారానే అధికారంలోకి రావాలి కాబట్టి జనసమీకరణకు కొన్ని పార్టీలు కులం వైపు మొగ్గితే, బీజేపీ పూర్తిగా మతంవైపు మొగ్గింది. మండల్–మసీదు రాజకీయాలకు పూర్వ రంగం అట్లా ఏర్పడిందే ! కాంగ్రెస్ మాత్రం ఎటు వైపూ నిర్దిష్టంగా దూకలేని అశక్తతతో అవకాశ వాదంతో వ్యవహరించింది. ఇందిరాగాంధీ నాయకత్వంలో వ్యక్తిపూజ పెరిగి, వ్యవస్థాపరంగా కాంగ్రెస్ క్షీణించటంతో సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కోల్పోయింది. కుల అస్తిత్వాల ఆధారంగా వచ్చిన పార్టీలు కొన్నిచోట్ల అధికారాన్ని సాధించినా స్థిరత్వంతో కూడిన రాజకీయాలను నడపటంలో విఫలమయ్యాయి. ప్రాంతీయ అస్తిత్వాలపై ఆధారపడిన పార్టీలు మాత్రమే కొంత ఉనికిని కాపాడుకుంటు న్నాయి. ఇక హిందూ ఆధిక్యత, ముస్లిం వ్యతిరేకత రాజకీయాల్లో ప్రధానంగా మారిపోయాయి. ఈ ధోరణికి వ్యతిరేకమైన గళాలన్నీ తీవ్రమైన అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. రాజకీయరంగాన వ్యక్తి పూజను సహజంగా పరిగణించటం మామూలైపోతోంది. అధికార కేంద్రీకరణ పెరిగి, రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమతుల్యత బలహీన పడుతోంది. పౌరసమాజం, న్యాయవ్యవస్థ, ప్రసార మాధ్యమాలు కూడా ఒడిదుడుకులకూ, ఒత్తిళ్లకూ లోనవుతున్నాయి. గతంలో కొనసాగిన సుల్తానుల, పాదుషాల పాలనంతా బానిసత్వానికి చిహ్నంగానూ, క్రూరత్వా నికి ప్రతీకగానూ పరిగణించే ప్రచారం ఊపందుకుని అదే నిజమైన చరిత్ర అన్నట్లుగా ప్రజలు నమ్మే పరిస్థితి వచ్చేసింది. సంపద, ఆదాయ అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో అసంతృప్తులు, అభద్రతలు ఎక్కువగానే ఉంటాయి. స్థూలంగా చూస్తే ఆర్థికాభివృద్ధి బాగానే కనపడుతుంది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంకెలు ఆశాజనకంగానే ఉంటాయి. బిలియనీర్ల సంఖ్యలోనూ ఏటేటా మంచి ఎదుగుదలే నమోదవుతోంది. కానీ, మన ఆర్థికాభివృద్ధికి ఎక్కువ ఉద్యోగ కల్పనకు దారితీయని తత్వమే ఎక్కువ. అధిక జనాభా ఉన్న దేశంలో ఇదెన్నో సమస్యలకు కారణమవుతుంది.

మన అభివృద్ధి నమూనా ఎక్కువ పెట్టుబడులను కోరుతుంది. తక్కువ శ్రామికులను ఇముడ్చుకుంటుంది. 1000 కోట్ల పెట్టుబడితో 1000 ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించలేని ఉదాహరణలను ఎన్నైనా చెప్పుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కంపెనీలతో కుదుర్చుకునే అవగాహనా ఒప్పందాలను పరిశీలిస్తే దీన్ని తేలికగానే గ్రహించొచ్చు.

చైనా, దక్షిణకొరియా, తైవాన్, హాంగ్‌కాంగ్, సింగపూర్‌ల్లో ఒకప్పుడు సాధించిన అభివృద్ధి దీనికి భిన్నం. అవన్నీ అభివృద్ధి పథంలో దూసుకుపోయే క్రమంలో ఎక్కువ మందికి ఉపాధిని కల్పించే అభివృద్ధి నమూనాను ఎంచుకున్నాయి. ఉద్యోగాలను ఎక్కువగా కల్పించలేని అభివృద్ధే ఒక తీవ్ర సమస్య అయితే.. దానికి తోడు ఆదాయ, సంపదల్లో నెలకొంటున్న అసాధారణ అసమానతలు.. విద్వేష భావజాలాలకు ప్రజలను తేలికగా ఆకర్షితులయ్యేలా చేస్తున్నాయి.

నిజానికి విద్వేష భావజాలాలు వ్యాపారాభివృద్ధికి విఘాతంగా ఉంటాయి. కానీ వాటిని వ్యతిరేకించలేని స్థితిలోనే వ్యాపార, పారిశ్రామిక వర్గం ఉందని, పన్నుల్లో రాయితీలు, వనరుల కేటాయింపుపరంగా ప్రభుత్వాలు అందిస్తోన్న అండదండల వల్ల.. తమ ఆస్తుల పరిరక్షణ, లాభాలు సజావుగా కొనసాగుతూ ఉండటం వల్ల.. ఆ భావజాలాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తోందన్న వ్యాఖ్యలే ఎక్కువ వినపడుతు న్నాయి. ఆర్థికాభివృద్ధి పుంజుకుంటున్న దశలో అసమానతలు సహజమన్న వాదనను ప్రభుత్వం కూడా బలంగా విశ్వసించటం వల్ల దాన్ని ఒక సమస్యగా పరిగణించటం లేదు. అందుకే అధికారిక నివేదికల్లో వాటికి స్థానం దక్కటంలేదు. గణాంకాలను పైపైన చూసినా పరిస్థితిలో తీవ్రత అర్థమవుతుంది. ఆదాయ, సంపదల్లో ఎగువ ఒక శాతం **(మిగతా 15వ పేజీలో)**

# సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడమే పరమావధి



- కొండుభట్ల రామచంద్రమూర్తి,
సకలం సంపాదకులు

'ఇండియా ఈజ్ నాట్ పూర్. ఇండియన్స్ ఆర్ పూర్' అనేవారు మాజీ రక్షణ మంత్రి కృష్ణమీనన్. భారత్ పేదదేశం కాదని, భారతీయులు పేదవారని ఆయన అభిప్రాయం. నిజమే. భారత దేశంలో వనరులకు కొదవలేదు. ఆ వనరులను సద్వినియోగం చేసుకొని, సంపద పెంచుకునే శక్తియుక్తులు మనకు లేవు. సంపదను లేని వారికి పంచే ఔదార్యం లేదు. సంపద పెరిగినా ప్రజలు దరిద్రంతో అలమటించవలసిందే. ప్రజలు సంతోషంగా ఉండాలంటే ఆర్థిక అసమానతలు తొలగిపోవాలి. లేదా కనీసం తగ్గిపోవాలి. అందుకు విరుద్ధంగా దేశంలో సంపద పెరుగుతున్న కొద్దీ ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. దేశంలో నానాటికీ పెరుగుతున్న అసమానతలను తగ్గించేందుకు ఆర్థిక నిపుణులు అనేక సలహాలు ఇస్తున్నారు. అసమానతలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో పెరుగుదలకూ, ప్రజల ఆత్మ విశ్వాసానికి, పేదరికం నిర్మూలనకు గొడ్డలిపెట్టు వంటివని హెచ్చరిస్తున్నారు. సంపన్నుల ఆస్తులపైన పన్ను పెంచాలని, వారి వారసత్వ పన్ను పెరగాలని సూచిస్తున్నారు. ఆ విధంగా వచ్చిన ఆదాయాన్ని పేదరికం నిర్మూలన కార్యక్రమాలపైన ఖర్చు చేయాలని అంటున్నారు. విద్య, ఆరోగ్యం ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని, తినడానికి తిండి అందరికీ ఉండాలని ఆర్థిక శాస్త్రవేత్తలు కోరుతున్నారు. భూసంస్కరణలు అమలు జరగాలని, ఉపాధి కల్పనలో కులాలకు, వర్గాలకు, లింగభేదాలకూ అతీతంగా అవకాశాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని చెబుతున్నారు.

మన ప్రభుత్వాలు అనుసరిస్తున్న లోపభూయిష్టమైన ఆర్థిక విధానాల కారణంగా సంపన్నులు అతి సంపన్నులు అవుతున్నారు. పేదవారు నిరుపేదలవుతున్నారు. మన దేశంలో ఆదాయ వివరాలు సమర్పిస్తున్న వారి సంఖ్య అతి స్వల్పంగా పెరుగుతోంది. కానీ కోటి రూపాయలకు మించి ఆదాయం ప్రకటించిన వారి సంఖ్య అతి వేగంగా పెరుగుతోంది. అధిక ఆదాయ వర్గాలు పెరగడం, లావాదేవీల వెల్లడి మరింత మెరుగవుతున్నట్టు ఆదాయపు పన్ను శాఖ ఈపోర్టల్ వెల్లడిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో తొమ్మిది కోట్ల మంది తమ ఆదాయ వివరాలను సమర్పించారు. అంతకుముందు సంవత్సరం ఇదే కాలంలో దాఖలైన మొత్తం రిటర్నుల సంఖ్య 8.92 అంటే ఆదాయం పన్ను వివరాలు దాఖలు చేసే వారి సంఖ్య 1.22 శాతం మాత్రమే పెరిగింది. అయితే ఇదే కాలంలో (2025-26 ఏప్రిల్-డిసెంబరు) కోటి రూపాయలకు పైగా ఆదాయం ప్రకటించిన వారి సంఖ్య 3,17,088 నుంచి 3,85,752 మందికి చేరింది. అంటే 21.85 శాతం పెరిగింది. ఒక కోటి నుంచి అయిదు కోట్ల రూపాలయ ఆదాయం చూపించిన వారి సంఖ్య 21 శాతం, 5 కోట్ల నుంచి 10 కోట్ల ఆదాయం చూపించినవారి సంఖ్య 29.7 శాతం, రూ.10 కోట్లకు పైగా ఆదాయం చూపించిన వారి సంఖ్య 28.3 శాతం దూసుకుపోవడం పరిశీలకులకు ఆశ్చర్యం కలిగిస్తున్నది.

మరో విశేషం ఏమంటే కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న జీఎస్టీ పన్నుల్లో 64 శాతం జనాభాలో దిగువన ఉన్న 50 శాతం మంది నుంచి వస్తోంది. ఎగువున ఉన్న పది శాతం జనాభా నుంచి వచ్చేది జీఎస్టీ ఆదాయంలో నాలుగు శాతమే. అదే సంపద గురించి చెప్పుకోవాలంటే ఎగువున ఉన్న అయిదు శాతం మందికి మొత్తం భారతదేశ సంపదలో 60 శాతానికి పైగానే ఉంటుంది. అదే విధంగా జీఎస్టీ ఆదాయంలో 60 శాతానికి పైగా భాగాన్ని అందించే సర్వీసు రంగం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో బాగా అభివృద్ధి చెందింది.

1980లలో ఆంతరంగికంగా, అంతర్జాతీయంగా ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు పరచడం వల్ల దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. అప్పటి నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరించింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ దేశం ఆర్థికంగా ముడు శాతం వంతున పెరిగింది. ఆ తర్వాత, ముఖ్యంగా 1991 నుంచి, భారత ఆర్థిక వ్యవస్థ సగటున 6 నుంచి 8 శాతం వృద్ధి చెందింది. కాని ఫలితాలు ప్రజలందరికీ సమానంగా అందలేదు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. 1995-96 ప్రాంతంలో ఎన్నికలకు ముందు ఆయన ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా నేనూ, ఆంధ్రప్రభ మాజీ సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వరరావు రాజ్‌భవన్‌లో ఆయనను కలుసుకునే వాళ్ళం. మాతో దాపరికం లేకుండా, చనువుగా మాట్లాడేవారు. 'మూర్తి గారూ, కింది వాళ్లకు ఆర్థిక సంస్కరణల ఫలితాలు అందడం లేదయ్యా. వేరీజ్ ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్ ? వేరీజ్ హ్యూమన్ ఫేస్?' అంటూ నన్ను అడిగేవారు ఆగ్రహం, ఆవేదన కలిసిన స్వరంతో (ఆ పరిస్థితికి నేను బాధ్యుడినైనట్టు). మన్మోహన్ సింగ్ అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని ఆయన ప్రధానిగా ఉండగానూ, ఆ

పదవి నుంచి వైదొలగిన అనంతరమూ బాధపడేవారు. దేశం ఆర్థిక రంగంలో అభివృద్ధి సాధిస్తోందని, జీడీపీ రేటు పెరుగుతున్నదని, జపాన్‌ను అధిగమించి నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని చెప్పుకుంటున్నాం. మరి కొన్ని సంవత్సరాలకు జర్మనీని అధిగమించి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని చెప్పుకుంటున్నాం. అంబానీలూ, అదానీలూ తమ సంపద పెంచుకుంటున్నారు. కానీ దిగువన ఉన్నవారు మరింత కిందికి దిగజారిపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జనాభాలో ఎగువన ఉన్న పది శాతం మంది 75 శాతం సంపదకు యజమానులు. అడుగున ఉన్న సగం మందికి రెండు శాతానికి మించి సంపద లేదు.

అంతర్జాతీయ ఆర్థిక ప్రవీణులు చెప్పేదాని ప్రకారం ఆర్థిక అసమానతలను అధిగమించాలంటే విద్య, ఆరోగ్యం, ఆహారంపైన ఇతోధికంగా ఖర్చు చేయాలి. సమాజంలో ఉన్న ప్రతి వారికీ ఆరోగ్యం, విద్య అందుబాటులో ఉండాలి. విద్య మీద మన ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నది జీడీపీలో4.0987 శాతం మాత్రమే. అమెరికా ప్రభుత్వం 12.65 శాతం ఖర్చు చేస్తోంది. ప్రైవేటు రంగానికి పట్టం కట్టడానికి మన రాజకీయ నాయకులు పోటీ పడుతున్నారు. పీపీపీ (ప్రైవేటు పబ్లిక్ పార్టిసిపేషన్) ఒక్కటే అభివృద్ధికి తారక మంత్రమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపదేశం చెబుతున్నారు. ప్రభుత్వ రంగంలో నెలకొల్పవలసిన పది మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించారు. ఆరోగ్య రంగం నుంచి ప్రభుత్వాలు వైదొలిగి ప్రైవేటు ఆసుపత్రుల దయాదాక్షిణ్యాలకు పేద ప్రజలను వదిలివేస్తున్నాయి. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వాలు తలసరి చేస్తున్న ఖర్చు లెక్కన ప్రపంచంలో మొత్తం 186 దేశాలలో భారత్ స్థానం 170. 'ఆరోగ్యశ్రీ' వంటి అభ్యుదయ పథకాలను సైతం ప్రభుత్వాలు అటక ఎక్కిస్తున్నాయి. మన దేశ పరిస్థితి ఈ విధంగా ఉంటే మన నాయకులు విశ్వ గురు అంటూ బిరుదులు ఇచ్చుకుంటున్నారు. ప్రపంచం మన వైపు సందేశం కోసం ఎదురు చూస్తున్నదని చెబుతున్నారు. మన దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగినా అందుకు తగినంతగా ఉపాధి కల్పన జరగడం లేదు. ఇప్పటికీ పని చేసే వయస్సు ఉన్న వారిలో సగం మందికి పైగా వ్యవసాయ రంగం (జీడీపీలో మాత్రం ఈ రంగం వాటా 15శాతం మాత్రమే)లో ఉండటం, వారికి తగిన ఆదాయం లేకపోవడం ఈ దుస్థితికి ప్రధాన కారణం. మిగిలిన యాభై శాతంలో సగం మంది సర్వీసు రంగంలో తక్కువ వేతనాలకు పని చేస్తున్నారు.

ఆర్థికాభివృద్ధిలో సైతం కులం, వర్గం, భాష, ప్రాంతం ప్రభావం ఉంది. ఈ అంశాలు ప్రపంచీకరణ అనంతరం కూడా పని చేస్తున్నాయి. తూర్పు, ఉత్తర భారతాలలో పెట్టుబడిదారీ వర్గాలు తక్కువ. దళితులూ, వెనకబడిన వర్గాల వారూ లేనట్టే లెక్క. కార్పొరేట్ల వ్యవహార తీరులో సైతం లింగ వివక్ష స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి క్రమంలో కలుపుకొనిపోయే ధోరణి (ఇంక్లూజివ్ యాటిట్యూడ్) లేదు. ఎక్స్‌క్లూజివ్ యాటిట్యూడ్ అధికంగా కనిపిస్తున్నది. అభివృద్ధి క్రమంలోనే కాదు అభివృద్ధి ఫలాలు అందుకోవడంలోను ఇదే ధోరణి పని చేస్తున్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చొరవ తీసుకొని సంక్షేమ పథకాలను అమలు చేయాలి. రెండు రూపాయలకు కిలో బియ్యం అవిభక్త కాంగ్రెస్‌లో ఎన్‌టి రామారావు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం. ఇంజనీరింగ్ అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు. రైతుబంధు తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకం. మహాత్మాగాంధీ ఎన్‌ఆర్‌జీఏ (మన్ రేగా) యోజన సోనియాగాంధీ పూనికతో మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన నిరుపేదల కోసం ఉద్దేశించిన సంక్షేమ చర్య. ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలను ఇతోధికంగా అమలు చేస్తూ, అభివృద్ధి క్రమంలో అట్టడుగు వర్గాలకు లబ్ధి చేకూరే విధంగా పథకాలను రూపొందించాలి. పేద వారిపైన పన్నుల భారం తగ్గించి ధనవంతులపైన పెంచాలి. సంపన్నుల రాబడ పైనా, వారసత్వ హక్కుపైన అధికంగా పన్నులు వసూలు చేయడం ద్వారా సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చుకోవాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అసమానతలను తగ్గించేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలి. ❑

## సంపద పన్ను, వారసత్వ పన్నులతో..

**(7వ పేజీ తరువాయి)** విద్య పొందే హక్కు,

- (5) వృద్ధాప్యంలో, అంగవైకల్యంలో జీవించడానికి అవసరమైన మోతాదులో పెన్షన్ పొందే హక్కు ఉండాలి.

ఈ అయిదు హక్కులూ అమలు కావాలంటే ప్రస్తుత జిడిపిలో 10 శాతం అదనం గా వనరులు అవసరమౌతాయి. ఈ అదనపు 10 శాతాన్ని ప్రభుత్వం ఖర్చు చేయగలి గితే, అలా ఖర్చయిన మొత్తం నుండి వివిధ పన్నుల రూపంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వా లకు కనీసం 15 శాతం అదనంగా తిరిగి వస్తుంది. ఆ 15 శాతాన్ని మినహాయించి తక్కిన 85 శాతాన్ని అదనపు పన్నుల రూపంలో వసూలు చేస్తే చాలు. పైన తెలిపిన లెక్కల ప్రకారం సంపద పన్ను, వారసత్వ పన్ను వసూలు చేస్తే వచ్చే మొత్తం అందుకు సరిపోతుంది. అంటే, కేవలం ఒక్క శాతం జనాభాగా ఉన్న అత్యంత సంపన్నులపై రెండే రెండు రకాల పన్నులను విధిస్తే మన దేశాన్ని సంక్షేమ రాజ్యంగా మార్చవచ్చు. మనది పేద దేశమని, ప్రజలు అనుభవించే దుర్భర పరిస్థితులను మార్చడానికి కావలసిన ఆర్థిక వనరులు లేవని ఎవరైనా అంటే అది శుద్ధ తప్పు. ❑

# సంపద కేంద్రీకరణ రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధం

- ఆర్వీ రామారావు,
విశాలాంధ్ర సంపాదకులు



**భారత రాజ్యాంగం సర్వ సమగ్రమైందంటాం. కాని, రాజ్యాంగ రచన జరుగుతున్న సమయంలో మన లక్ష్యాలన్నింటిని వెంటనే సాధించే అవకాశం లేదు. అందుకని భవిష్యత్తులో సాధించి తీరవలసిన లక్ష్యాలను రాజ్యాంగ నిర్మాతలు ఆదేశిక సూత్రాలలో చేర్చారు. ప్రభుత్వాలు క్రమంగా ఈ లక్ష్యాలను సాధించాలన్నది రాజ్యాంగ నిర్మాతల అభిమతం. ఈ లక్ష్యాలలో కొన్నింటిని గత 76 ఏళ్ల కాలంలో సాధించాం. ఇంకా కొన్ని సాధించవలసి ఉంది. అందులో సంపద కొంత మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చూడడం. కానీ ఈ విషయంలో మనం లక్ష్య సాధన దిశలో కాకుండా సరిగ్గా ఆ లక్ష్యానికి విరుద్ధమైన దిశలో ప్రయాణిస్తున్నాం.**



రాజ్యాంగంలో 36 నుంచి 51 అధికరణాలలో ఆదేశిక సూత్రాలు ఉన్నాయి. వాటిలో 39వ అధికరణం "ప్రజలకు సరిపడినంత జీవనాధారం, వనరులు సమానంగా పంపిణీ చేయాలని.. సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చూడాలని.. సమాన పనికి సమాన వేతనం ఉండాలి" అని నిర్దేశించారు. దీనితోపాటు పనిచేయడానికి హక్కు కల్పించాలని, విద్యావకాశాలు కల్పించాలని, ఉద్యోగ కల్పనలో ప్రభుత్వాలు సహకరించాలని, వృద్ధాప్యంలో, అనారోగ్యం ఎదురైనప్పుడు, నిస్సహాయ స్థితిలో పడిపోయిన వారికి రాజ్యవ్యవస్థ ఆదుకోవాలని 41వ అధికరణం నిర్దేశిస్తోంది. 43వ అధికరణం బతకడానికి సరిపోయిన వేతనం అందేట్టు చూడాలని, పని పరిస్థితులు మానవీయంగా ఉండాలని, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలని నిర్దేశిస్తోంది. ప్రజల పోషకాహార విలువలను పెంచాలని, ప్రజారోగ్యాన్ని మెరుగు పరచాలని, మత్తు కలిగించే పదార్థాలను నిషేధించాలని 47వ అధికరణం ఆదేశిస్తోంది.

విచిత్రం ఏమిటంటే రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు గడిచినా ఈ లక్ష్య సాధనకు సుదూర స్వప్నంగానే మిగిలి పోయింది. ఈ కారణంగానే సంపద కేంద్రీకరణను నిరోధించడంలో విఫలమయ్యాం. సంపద సృష్టి క్రమంగా పెరుగుతూ వస్తున్నా అది కొద్ది మంది గుప్పెట్లోకే చేరుతోంది. కూడినోడికే కూడుతుంది కుంటి లక్ష్మి అన్న సామెత మన ప్రస్థాన క్రమంలో రుజువైంది. సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతం కావడానికి వ్యవస్థాపరమైన కారణాలు చాలా ఉన్నాయి. చారిత్రక కారణాలూ తక్కువేం కాదు. ఈ లోపాలకు ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణం. దీనితో సమాన అవకాశాలు దక్కకుండా పోయాయి. విద్య, ఆరోగ్య పరిరక్షణావకాశాలు సైతం కలిగిన వారికే పరిమితం అయ్యాయి. సాంకేతికత కూడా శ్రమించే వారికి కాకుండా పెట్టుబడి పెట్టగలిగిన వారికే తోడ్పడే విధంగా తయారైంది. సంపద వారసత్వంగా దక్కే అవకాశం ఉండడం అంతరాలను పెంచింది. శ్రమించే వారికి క్రమంగా రక్షణ కరవు అవుతూ వచ్చింది. కుల వ్యవస్థ సైతం సంపన్నులు మరింత సంపన్నులు కావడానికే దోహదం చేసింది. ప్రభుత్వ పన్నుల విధానాలు సంపన్నులకు అనుకూలంగా మారిపోయాయి.

మన దేశంలో ఆదాయ వ్యత్యాసాలు అపారం. అవి పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. జనాభాలో 10 శాతం మంది దగ్గర 60 శాతం సంపద పోగు పడింది. మరింత లోతుగా చూస్తే జనాభాలో ఒక్క శాతం మంది దగ్గరే 40 శాతం సంపద ఉంది. దీనివల్ల 50 శాతం జనాభా ఆదాయం

సంపన్నుల ఆదాయంలో 15 శాతం మాత్రమే ఉంది. జనాభాలో 50 శాతం మంది ఆదాయంకన్నా అత్యంత సంపన్నులైన ఒక్క శాతం మంది 75 రెట్లు ఎక్కువ సంపాదిస్తున్నారు. సంపదలో వ్యత్యాసాలు అన్ని వర్గాల ప్రజలను కుంగదీస్తున్నాయి. దీనికి కుల, మత తేడాలు, స్త్రీ పురుష భేదాలూ లేవు. అధికాదాయం మీద పట్టు సాధించిన జనాభాలోని ఒక్క శాతం మంది ఆదాయం అత్యంత వేగంగా పెరిగిపోతోంది. బ్రిటిష్ వలసవాదుల ఏలుబడిలోను ఈ వ్యత్యాసాలు ఇంత విపరీతంగా లేవు.

ఆర్థిక సంస్కరణలు 1991లో ప్రారంభం అయ్యాయనుకుంటాం. కానీ 1980ల మధ్యలోనే ఆర్థిక సంస్కరణల ఛాయలు కనిపించడం మొదలైంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మొత్తం పరిభాషే సంపన్నులకు అనుకూలంగా మారింది. ఆర్థిక సంస్కరణలు అంటున్నారు. కాని అవి సంస్కరణలు కావు. సంస్కరణ అంటే ఉన్న స్థితి నుంచి మెరుగుపరచడానికి తోడ్పడాలి. కాని, ఈ భావన తలకిందులై సంపత్తి ఉన్న వారిని మరింత సంపన్నులను చేయడానికే తోడ్పడేవి సంస్కరణలు కానే కావు. కనీస అవసరాలైన విద్య, ఆరోగ్య పరిరక్షణ అధికాదాయం వున్న వారికే అందుబాటులోకి వచ్చాయి. పేదల కోసం వివిధ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయలేదని కాదు. కాని, వాటి ప్రభావం అత్యల్పం. ఆరోగ్య సదుపాయాలు సమానంగా అందనందు వల్ల ఓ మోస్తరు బతక గలిగిన వారు పేదరికంలోకి జారుకునే దుస్థితి వచ్చింది. ప్రధానమంత్రి జనధన్ యోజన వంటి అందమైన పథకాల నినాదాలు వినసొంపుగానే ఉంటాయి. ఆచరణ మాత్రం నాసి రకంగానే ఉంటుంది. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటివి నీరస పడిపయాయి. మోదీ హయాంలో ఈ పథకానికి వీలైనంత తక్కువ నిధులు కేటాయించారు. ఇప్పుడు ఆ పథకం స్వరూపమే మారిపోయింది. నైపుణ్యాభివృద్ధి పథకం ఉన్నా దాన్ని వినియోగించుకుంటున్న వారు తక్కువ. ఈ పథకంలో చేరిన వారు మధ్యలోనే విరమించుకుంటున్నారు. మేక్ ఇన్ ఇండియా వంటివి కనీసం నినాదప్రాయంగా కూడా మిగలలేదు.

1950ల నుంచి 1980ల దాకా ఆదాయాల్లో వ్యత్యాసాలు కాస్త తగ్గినట్టు కనిపించినా ఇప్పుడున్న వ్యత్యాసాలు మితిమీరి పోయాయి. 1980 నుంచి ఆదాయాల్లో వ్యత్యాసాలు ఎంతగా పెరిగాయంటే  వలస పాలన రోజులే బాగుండేవి అనుకొక తప్పని స్థితిలో పడిపోయాం. సంపదపై పన్ను మొత్తం దేశమంతటికీ వర్తించేది. ఈ పన్నును 2016 ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయడం లేదు. 2016-17 కేంద్ర బడ్జెట్‌లో అరుణ్ జైట్లీ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ఈ పన్ను రద్దయింది. సంపత్తి ఉన్న వారిని చల్లగా చూడడం కోసమే ఈ పనిచేశారు. కాబట్టి వ్యత్యాసాలను తగ్గించడానికి సంపద పన్ను పెంచే అవకాశం ప్రస్తుతానికైతే లేదు.

ఆర్థిక వ్యత్యాసాలు తగ్గించడం కోసం సంపద పున:పంపిణీ ఒక మార్గం కావచ్చు. కానీ ఆ పున: పంపిణీ ఎలా జరగాలన్నదే పెద్ద ప్రశ్న. ప్రస్తుత ప్రభుత్వాల ధోరణి చూస్తుంటే సంపన్నులపై పన్నులు పెంచే మాటేమోగాని వారు తీసుకున్న రుణాలను భారీ ఎత్తున రద్దు చేస్తున్నారు. ఆ రద్దు మొత్తం లక్షల కోట్లలో ఉంటున్నది. అదే సామాన్యులు బ్యాంకుల దగ్గర రుణాలు తీసుకుంటే గోళ్లూడ గొట్టి వడ్డీతో సహా వసూలు చేస్తారు. అంటే సామాన్యులకు ఊరట కలిగించే ఆలోచనే లేదు. కుబేరుల బకాయిలను రద్దు చేయడం అంటే బలిసిన వాడికి మరింత బలవర్ధక ఆహారం అందించడం. సామాన్యుడి కడుపు ఎండ బెట్టడం. సంపన్నుల మీద అధిక పన్ను విధించడం విలోమ ఫలితాలు ఇవ్వొచ్చు. సంపద ఉన్న వారెవరూ దాన్ని ఇనప్పెట్టెలో దాచుకోరు. దాన్ని ఏదో ఒక రూపంలో ఎక్కడో ఒక చేట పెట్టుబడి పెట్టి మరిన్ని లాభాలు సంపాదించవలసిందే. సంపన్నులపై మరింత అధిక పన్ను విధించడం అంటే వారి సంపదలో కోత పెట్టడమే. కోటకు గురయ్యేవారు పెట్టుబడి పెట్టడానికి ఎందుకు ముందుకు వస్తారు ? మన దేశంలో వ్యాపారావకాశాలు లేకో, అనుకున్నన్ని లాభాలు రావడం లేదనో ఎంతోమంది పెట్టుబడిదారులు ఇతర దేశాలకు తమ పెట్టుబడులను తరలిస్తున్నారు. విదేశీ పెట్టుబడులు వచ్చి పడుతున్నాయని కొద్ది రోజులు మురిసిపోయాం. ఈ మధ్యలో విదేశీయులు ప్రత్యక్షంగా పెట్టుబడిని వెనక్కు తీసుకుంటున్నారు. దీనితో మన స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి.

విధానాల విషయంలో మనం తిరోగమన ప్రయాణమే చేస్తున్నాం. అపారంగా సంపద పోగేసుకోగలిగిన వారి సంఖ్య పదుల్లోనుంచి చేతి మీద లెక్కకట్టగలిగిన స్థాయికి చేరుకుంటోంది. ఆశ్రిత పెట్టుబడి దారీ విధానం అన్న మాటనే పునర్నిర్వచించాలేమో. ఒకరిద్దరు పెట్టుబడిదార్ల ఆదాయం కొన్ని సెకండ్లలోనే పెరిగి పోతోంది. సంపద పున:పంపిణీ అధిక పన్నులు విధించడం వల్ల సాధ్యమయ్యేది కాదు. ఇది ప్రతికూల ప్రభావం చూపొచ్చు. సంపద అమాంతం పెంచుకోవడానికి మూలం ఎక్కడుందో గ్రహించాలి. ఆ మూలాన్ని ఛేదించాలి.

జాతీయకరణను తిరగదోడే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో కాయకల్ప చికిత్సల వల్ల సంపద పంపిణీ సాధ్యమయ్యే పనే కాదు. ఉత్పత్తి సాధనాలు సంపన్నుల గుప్పెట్లో ఉన్నప్పుడు ఆదాయ వ్యత్యాసాలు తగ్గే మార్గమే లేదు. ఆదాయాల్లో వ్యత్యాసాలు తగ్గించాలంటే ముందు అవకాశాల్లో సమానత్వం ఉండాలి. సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. ప్రభుత్వ రంగం, సమానత్వం, సమాన అవకాశాలు అన్న మాటలన్నీ బూతు పదాలు అయిపోయిన చోట సంపదలో వ్యత్యాసాలు తగ్గడం దుర్లభమే. ❑

# సంపదల పంపిణీ అసమానతల అగాధం

- తెలకపల్లి రవి,
సాహిత్య ప్రస్థానం సంపాదకులు



**భా**రతదేశం జపాన్‌ను తోసిరాజని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి వచ్చేసింది. త్వరలో జర్మనీని దాటేసి మూడో స్థానంలోకి వస్తుంది. సమర్థవంతమైన ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో విశ్వగురుగా ఆవిర్భవించేందుకు రంగం సిద్ధమైపోయింది ! ప్రపంచం మొత్తం మనకేసి చూస్తున్నది.. అహోరాత్రులు మోత మోగుతున్న ఈ మాటలు ప్రజలను తికమకకు గురి చేస్తున్నాయి. మోడీ సర్కారు హడావుడికి తాళం వేసి మరింత తాళం వేయడం తప్ప కాస్తయినా విమర్శనాత్మకంగా సమాచారమిచ్చే ప్రసక్తి లేని అగ్రశ్రేణి మీడియా సాధనాలు దీన్నే రోజూ వండి వారుస్తున్నాయి. నిజంగా ఇండియా అంత అభివృద్ధి సాధించి దూసుకుపోతే మనకన్నా సంతోషించే వారు ఎవరుంటారు ?

**కానీ ఇక్కడ రెండు ప్రశ్నలు :** ఈ అభివృద్ధి ఎంత నిజం ? ఆర్థిక లెక్కల్లో కూడా నిజం కాకపోవడం ఎలా కుదురుతుంది ? ఈ ప్రశ్నలకు మరో కోణం కూడా వుంది. అభివృద్ధి అంటే ఏమిటి ? దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ అప్పారావు 110వ వర్ధంతి సంవత్సరంలో ఆ కొలబద్దలు ఎలా వర్తింపజేయాలి ?

## జీడీపీ లెక్కలు - పూర్తి నిజాలు

మొదట నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థ సంగతి. తాజా గణాంకాల ప్రకారం మొదటి అయిదు ఆర్థిక వ్యవస్థల వివరాలు ఇలా వున్నాయి :

- అమెరికా – 31.8 లక్షల కోట్ల డాలర్లు (బిలియన్లు)
- చైనా – 20.7 లక్షల కోట్ల డాలర్లు
- జర్మనీ – 5.3 లక్షల కోట్లడాలర్లు
- ఇండియా – 4.5 లక్షల కోట్ల డాలర్లు
- జపాన్ – 4.46 లక్షల కోట్ల డాలర్లు

ఇక్కడ లెక్కలు స్పష్టంగానే వున్నాయి. పైగా ఈ వివరాలు ఇచ్చేప్పుడే జీడీపీ నామకార్థపు లెక్కలు అని స్పష్టమైన సూచికతో ఇవ్వడం చూడవచ్చు. కేవలం జీడీపీని బట్టి ఒక దేశ ఆర్థిక సమర్థతను ఏ మేరకు అంచనా వేయవచ్చుననే దానిపైనా చాలా అంచనాలున్నాయి. అది ఒక కొలబద్ద మాత్రమే. అందులోనూ ఈ దేశాల మధ్య తేడాలు చాలా విపరీతంగా వున్నాయి. ఇంకా చెప్పాలంటే ఆర్థిక నిపుణులు ఇండియా ఆవిర్భవిస్తున్న నాలుగో ఆర్థికవ్యవస్థ అని మాత్రమే అనడం గమనించవచ్చు. అందులోనూ వాటి మధ్య దూరాలు చాలా ఎక్కువ. అమెరికా ఆధిపత్యం కనిపిస్తున్నా దాన్ని నిలబెట్టుకోవడానికి పచ్చిగా ఇతర దేశాల వనరులను ఆక్రమించడం కళ్ల ముందు కనిపిస్తూనే వుంది. చైనా స్థిరంగా శక్తి పెంచుకోవడం ఎవరూ కాదనలేని వాస్తవం. ఇక చైనాకు తర్వాత జర్మనీకి మధ్య నాలుగు రెట్ల తేడా వుంటే ఆ తర్వాత కాస్త దూరంలో ఇండియా వుంది. జపాన్‌కూ ఇండియాకూ మధ్య వ్యత్యాసం నాలుగు బిలియన్లు మాత్రమే. అదే సమయంలో ఇండియాలో ఉత్పత్తి రంగం ఉపాధి, ధరల ద్రవ్యోల్బణం వంటి చాలా అంశాలు ప్రోత్సాహకరంగా లేవు.

## అంతులేని అంతరాలు

దానికంటే కూడా ఆందోళన కలిగించేది ఇండియా పేదలతో నిండిన సంపన్న దేశం అన్నది ఎప్పటి నుంచో వున్న మాట. సంపదరాసులు ఒకచోట.. ఆకలి మంటలు ఒకచోట.. వంటి పాటలకు లెక్కలేదు. మరి నాలుగో ఆర్థిక వ్యవస్థ ఆ పరిస్థితిని మార్చి దేశ ప్రజాస్వామ్యానికి ఏమైనా మేలు చేస్తున్నదా? ఒకప్పుడు బ్రిటిష్ పాలకులు ఈ దేశ వనరులను కొల్లగొట్టి వలాసాధిపత్యం చేయడం స్పష్టంగా కనిపిస్తుండేది. 75 ఏళ్ల స్వాతంత్రం తర్వాత ఈ నాలుగో స్థానం జీడీపీ దేశంలో సంపద పంపిణీలో అంతులేని అంతరాలు. అంతకన్నా దారుణంగా తయారు కావడం. మేడిపండు చూడ మేలిమై వుండు అన్నట్టే మోడీ పాలనలో ఇవి అధికార విధానంగా మారిపోయాయి.

అసమానతల అధ్యయనంలో అగ్రగణ్యుడైన థామస్ పికెట్టి గతంలో ఈ మాటన్నప్పుడు పెద్ద దుమారం చెలరేగింది. కానీ వినడానికి కష్టంగా వున్నా ఆయన పరిశీలనే వాస్తవమని ఇప్పుడు అక్షరాలా రుజువవుతున్నది. 2026 అంతర్జాతీయ అసమానతల నివేదిక "ప్రస్తుత కాలం భారతీయ మహా కుబేరులకు స్వర్ణయుగంగా మారింది" అని చెబుతున్నది. 2023లోనే కొత్తగా 94 మంది భారతదేశంలో మహా కుబేరులయ్యారని 2024 హారున్ పరిశోధన కేంద్రం సంపన్నుల జాబితా చెబుతున్నది. అమెరికాను మినహాయిస్తే మరే దేశంలోనూ ఇంత సంఖ్యలో బిలీయనీర్లు లేరు. ముఖేష్ అంబానీ, గౌతం అదానీ, సజ్జన్ జిందాల్ వంటి వారు జెఫ్ బేజోస్, ఎలాన్ మస్క్ వంటి వారి సరసన చేరారు. మొత్తం ప్రపంచ సంపదలో ఏడు శాతం వారి చేతుల్లో వుంది. "బ్రిటిష్

కాలం నాటి వలస పాలన శక్తులకంటే భారత దేశ ఆధునిక బూర్జువా వర్గం నాయకత్వంలోని బిలియనీర్ రాజ్ ప్రస్తుతం అధిక అసమానతతో నడుస్తున్నది" అని నివేదిక స్పష్టం చేసింది. ఈ అధ్యయనం కోసం అనేక కోణాల్లో విషయాలు సేకరించారు. సంపదలో అగ్రభాగాన వున్న ఒక్క శాతం మంది చేతుల్లో ఎంత కేంద్రీకృతమైందో పరిశీలించారు. ఆదాయం అంటే ఆర్జనల మొత్తం, పొదుపు, మదుపు ఇతర వనరులపై వడ్డీతోపాటు సంపద (లేదా నికర సంపద) అంటే ఆయా వ్యక్తుల లేదా గ్రూపుల స్వంత ఆస్తిగా పరిగణించారు. జాతీయాదాయ లెక్కలను సంపద మొత్తం వివరాలను పన్ను పట్టికలనూ సంపన్నుల జాబితాలనూ ఆదాయాలు వినిమయం, సంపదలపై సర్వేలనూ లెక్క కట్టి మరీ ఈ వివరాలు నిగ్గు తేల్చారు.

## బ్రిటిష్ కాలంకన్నా ఘోరం

1922లో బ్రిటిష్, ఇండియా ప్రభుత్వాలు విడుదల చేసిన పట్టికలతో పోల్చి పరిశీలించారు. 1930లలో రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో అసమానతలు అత్యధికంగా నమోదైనాయి. ఆ కాలం నుంచి 1947లో దేశానికి స్వాతంత్రం వరకూ లెక్కలు తీశారు. 1922లో దేశంలో అత్యధిక సంపన్న శ్రేణిగా వున్న ఒక్క శాతం మంది చేతుల్లో 20 నుంచి 21 శాతం జాతీయ సంపద వుంది. ఈ రోజున ఇదే ఒక్కశాతం అత్యధిక సంపన్న శ్రేణి దేశ ఆదాయంలో 22.6 శాతం కలిగివున్నారు. అంటే ఇప్పుడే ఒకటిన్నర శాతం ఎక్కువగా వుందన్నమాట. 1961లో భారత ప్రభుత్వం సంపద అప్పులు ఆస్తులు వంటి వాటిపై మొదటి భారీ ఇంటింటి సర్వే నిర్వహించింది. అదే సమయంలో ఫోర్బ్స్ బిలియనీర్ సూచీ సమాచారం జోడించి పరిశోధించింది. వీటన్నిటి ద్వారా తేలిందేమంటే దేశంలో అతి సంపన్నులైన ఒక శాతం మంది చేతుల్లో జాతీయ సంపద 40.1 శాతం పోగుపడి వుంది. దేశంలో 1999లో ఒకే ఒక్క విశ్వ కుబేరుడు వుంటే 2022 నాటికి ఆ సంఖ్య 162కు చేరింది. వీరి చేతుల్లో మొత్తం సంపద 1991లో ఒక శాతం వుంటే 2022లో 25 శాతానికి చేరింది. 2014లో భారతీయ జనతా పార్టీ తొలిసారి అధికారం చేపట్టాక ఈ అసమానతలు మరీ వేగంగా పెరిగిపోతున్నట్టు కూడా అసమానతల నివేదిక గుర్తించింది.

భారత రాజ్యాంగం ఆర్థిక, సామాజిక, సమత గురించి చెబితే ఆచరణలో ఈ విధంగా సమస్త సంపదలూ కొద్ది మంది చేతుల్లో పోగు పడిపోవడం అనేక అనర్థాలకు దారి తీస్తున్నది. గత పదేళ్లలో చేపట్టిన ప్రధానమైన రాజకీయ ఆర్థిక సంస్కరణల పేరిట బడా వ్యాపార వర్గాలకూ ప్రభుత్వానికి మధ్య లాలూచీ ఇందుకు దారి తీసిందని పేర్కొంది. ఈ క్రమంలో సమాజం పైనా సర్కారుపైనా వారికి అంతులేని పట్టు పెరిగిపోయింది. ఏ నిర్ణయమైనా వీరికి లాభం చేకూర్చే విధంగా వనరులు మరింతగా అప్పగించే విధంగా తప్ప ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసే విధంగా జరగడం లేదు. సామాజిక న్యాయం అసలే కనుమరుగైపోతున్నది. కనీస అవసరాలు కరువైపోవడం ఒక వైపు పీపీపీ పేరిట అన్నిటినీ ప్రైవేటీకరించడం మరోవైపు జరిగిపోతున్నాయి. నిధుల కొరత వల్ల ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి అవుతున్నట్టు సమర్థించుకుంటూ వున్న నిధులు భూములు వనరులూ వారికే కట్టబెడుతున్నారు. ఉదాహరణకు 2014-15 నుంచి 2023-24 మధ్య కాలంలో భారీ పరిశ్రమలు సర్వీసులకు సంబంధించి 9,26,947 కోట్ల రుణాలను పారుబాకీలుగా (ఎన్‌పిఎ) ప్రకటించినట్టు ప్రభుత్వం పార్లమెంటు ప్రస్తుత సమావేశాలలోనే లోక్‌సభలో తెలియ జేసింది. కార్పొరేట్ పన్నులకు సంబంధించి 2019-20 నుంచి 2023-24 మధ్య కాలంలో 3,67,261 కోట్ల రాబడిని రద్దు చేసినట్టు ఇదే కాలానికి ఇచ్చిన రెవెన్యూ లెక్కలు చెబుతున్నాయి.

## వారికి వేల కోట్లు - వీరికి లేబర్ కోడ్లు


ఇలా ప్రభుత్వ రాయితీలతో ప్రజా వనరులతో సంపదలు పోగేసుకుంటున్న వారి నుంచి కనీసంగా ప్రభుత్వం పన్ను వసూలు చేయడం లేదు. సంపద పన్ను, ఆదాయ పున:పంపిణీ అంటే అదేదో అపరాధమైనట్టు చిత్రిస్తున్నారు. 2022-23 కాలంలో భారతదేశంలో అగ్రభాగాన వున్న 167 మంది వ్యక్తుల నికర సంపదపై కేవలం రెండు శాతం సూపర్ పన్ను విధిస్తే జాతీయ ఆదాయంలో 0.5 శాతం రాబడి పెరుగుతుందని అంచనా కట్టింది. తద్వారా ప్రభుత్వం విద్య వైద్యం వంటి కీలక సేవలు సమకూర్చేందుకు కావలసినన్ని నిధులు సమకూరు తాయి. ఆ పని చేయకపోగా శ్రామిక ప్రజానీకం జీవనోపాధిని నిర్ధాక్షిణ్యంగా హరించడం జరుగుతున్నది. కొత్త లేబర్ కోడ్‌లు వచ్చి పడ్డాయి. గ్రామీణ ఉపాధి పథకానికి కోత పెట్టి జీ రామ్‌జీ పేరిట అదే గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. బీహార్ శాసనసభ విజయం వూపులోనే ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు విడుదల చేసింది. వేతనాలు, పారిశ్రామిక సంబంధాలు, వృత్తిగత భద్రత, సామాజిక భద్రతలకు సంబంధించిన ఈ కోడ్‌లు 29 కార్మిక చట్టాలు సులభతరం చేయడమనే పేరిట తీసుకొచ్చింది. కార్మిక భద్రత అవశేషాలు ఏ మాత్రం మిగిలి వున్నా వాటికి ఎసరుపెట్టింది. అసంఘటిత రంగంలోని 90 శాతం మంది కార్మికులకు ఏ మాత్రం రక్షణ లేకుండా చేయబడుతుంది. ఈ లేబర్ కోడ్‌లు అందరికీ ఒక కనీస వేతనం వుండేలా చేస్తాయని కేంద్రం చెప్పుకుంటున్నది.

అయితే అనేక రాష్ట్రాలలో ఇప్పుడున్న కనీస వేతనాలను తగ్గించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. స్కీము వర్కర్లతో సహా లక్షోపలక్షల మంది కార్మికులు కనీస వేతనం పరిధి నుంచి మినహాయించబడతారు. లేబర్ కోడ్‌లు కార్మికులను మరింత

బానిసలుగా చేయడానికి పునాది వేస్తాయి. ఆర్థిక ఉత్పత్తికి అవసరమైన రెండు ప్రాథమిక అంశాల్లోనూ అంటే శ్రామికులు పెట్టుబడి అనే రెంటినీ దెబ్బ తీస్తాయి. ఈ రెండింటి మధ్య సమతుల్యత లేకుండా పోవడమంటే ప్రభుత్వం అన్ని నియంత్రణలు ఎత్తివేసి కార్మికులు యజమానుల దగ్గర మగ్గిపోవలసిన పరిస్థితి కల్పించడమే. సాంకేతిక పరిజ్ఞానం పెట్టుబడితో కలిసి ఉత్పత్తి క్రమంలో ఏకపక్షంగా గుమ్మరించి శ్రామికులకు భద్రత లేకుండా చేయడం జరుగుతుంది. అంటే అటు గ్రామాలలో ఇటు ఐటీతో సహా పరిశ్రమలలో ఉపాధి, భద్రత లేకపోవడం వాణిజ్య పారిశ్రామిక వర్గాల పట్టు మరింత పెంచుతుంది. ఆకాశ సౌధాలు కడుతుంటే వలస కార్మికులు బానిసలలా పనిచేయడం వంటి పరిస్థితి అన్నమాట.

**పీపీపీ ముసుగే 4 పీ**

విశాఖ ఉక్కు నుంచి ప్రభుత్వ మెడికల్ కాలేజీల వరకూ పీపీపీ అంటూ ప్రైవేటు పెత్తనానికి అప్పగిస్తూ దానికి మరో పీ కలిపి 4 పీలతో వారే పేదలను ఆదుకునే అపర దాన కర్ణులన్న భ్రమ కల్పించడం మరో నాటకం. ప్రభుత్వ పక్షపాతం వల్ల అపారంగా సంపదలు పోగేసుకుంటున్న మహా కుబేరులపై కనీసం పన్ను వేసి ఆ సొమ్మును ప్రజల కోసం ఉపయోగించడం రాజ్యాంగ ధర్మం. కానీ చిన్న పరిశ్రమల నుంచి చిల్లర వ్యాపారం వరకూ గుత్తాధిపతుల చేతుల్లోకి పోతున్నది. వ్యవసాయ సంక్షోభం, గ్రామాలలో పనులు లేకపోవడం దీనికి తోడై ఆర్థిక అసమానతలు తీవ్రం చేస్తున్నది. అంతర్జాతీయంగా అమెరికాలో ట్రంప్ దాడి వల్ల ఒక స్థాయికి చేరిన వారు అభద్రతకు గురవుతున్నారు. దేశాలు మరోసారి ప్రత్యక్ష ఆక్రమణలకూ ఆధిపత్యాలకూ గురవుతున్నాయి. సంపదల పంపిణీలో అసమానతల తొలగింపు తగ్గింపు గాక మరింత తీవ్రం చేయడానికే ఇది కారణమవడం కఠోర సత్యం. ఈ అంశాన్ని కాస్త కప్పి పుచ్చే కబుర్లు ఎవరు ఏమి చెప్పినా అంతకన్నా వంచన మరొకటి వుండదు. ❑



Tax the Rich Campaign...

# ఇది సకాలపు సబబేనా..?

**(9వ పేజీ తరువాయి)**

జనాభా వాటా ఇటీవల 42.5 శాతానికి పెరిగింది. 10 శాతం ఎగువ జనాభా వాటాని లెక్కవేస్తే అది 74.3 శాతానికి ఎదిగింది. ఇక 40 శాతం మధ్య తరగతి వాటా సంపదలో 22.9 శాతానికి దిగజారింది. కిందనున్న 50 శాతానికి దక్కింది 2.8 శాతమే. ఆదాయంలో కూడా ఈ వర్గాలను వరుసగా (21.7 శాతం, 56.1శాతం, 29.7శాతం, 14.7శాతం) చూస్తే కనపడేది అదే చిత్రం. దీనికితోడు ఆర్థికాభివృద్ధిలోను అనుకున్నంత వేగం కనపడటం లేదు. 2014-2023 మధ్య అది 5.8 శాతానికే పరిమితమైంది. 1991-2013 కాలం (6.6 శాతం)తో పోల్చితే అది తక్కువ. మరి దారిద్ర్యం తగ్గలేదా ? అంటే గణనీయంగా తగ్గింది. రోజుకు 1.90 డాలర్లతో జీవితాన్ని గడిపే ప్రజలు 1980లో 60 శాతం ఉంటే 2011 నాటికి అది 20 శాతానికి తగ్గింది. కానీ నెలకు 100 డాలర్ల ఆదాయం (దాదాపు రూ.9,000) ఉన్న వారందరూ దారిద్ర్య రేఖకు దిగువనున్నారని భావిస్తే వారి సంఖ్య 2011లో సైతం 60 శాతం ఉంటుంది. నిశిత సామాజిక పరిశీలనలో కొన్ని కఠోర వాస్తవాలు కనపడతాయి. దేశ బహుళత్వ సాంస్కృతిక వారసత్వాన్ని బలహీనంగా భావించటం.. మైనారిటీల్లో అభద్రత నెలకొనటం.. కుల, మతభావాల ఆధారంగా ప్రజలను సమీకరించటం.. విపరీత అధికార కేంద్రీకరణ, రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమతుల్యత లోపించటం.. విజృంభిస్తున్న అసమానతలు.. తక్షణం ఎదుర్కోవాల్సిన సవాళ్లుగా ఆ వాస్తవాలు మన ముందు నిలుస్తున్నాయి. రాజకీయాల్లో మార్పులతో తలెత్తిన ఈ సవాళ్లకు పరిష్కారాలు రాజకీయాల రాపిడి నుంచే రావాలి ! ❑

**(డిసెంబరు 26 ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో)**

# అసమానతల భారతం



- వి.రాంభూపాల్,
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం దూసుకుపోతుందని పాలకులు చెబుతుంటే, బ్రిటీష్ పాలన కాలం నాటికంటే ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని 'వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ రిపోర్ట్-2026 ప్రకటించింది. దేశ సంపదలో 57.7 శాతం అంటే సగానికి ఎక్కువగా కేవలం 10 శాతం మంది కుబేరుల దగ్గర పోగుబడిందని బ్లూమ్ వెంచర్స్ అనే పెట్టుబడుల సంస్థ నివేదిక తెలిపింది. 11 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోడీ పాలనలో రూపాయి విలువ చరిత్రలో కనివిని ఎరుగని పతనావస్థకు చేరుకుంది. ఆర్థిక అసమానతల్లో మన దేశం అగ్రస్థానంలో వుందని ప్రఖ్యాత ఆర్థికవేత్తలు లూకాస్ చానెల్స్, రికార్డో గోమెజ్-కారెరా, రొవాడియా మెషరీఫ్, థామస్ పికెటిలు రూపొందించిన ప్రపంచ అసమానతల నివేదిక-2026 బట్టబయలు చేసింది. 140 కోట్ల మందిలో వంద కోట్ల మంది భారతీయుల దగ్గర కొనడానికి డబ్బులు లేవని, మరో 30 కోట్ల మంది ఉన్నత మధ్య తరగతి వర్గం తమ దగ్గర వున్న కొద్దిపాటి డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతు న్నారని బ్లూమ్ వెంచర్స్ స్పష్టం చేసింది. అయినా మనది వికసిత భారత్ అని, విశ్వ గురువుగా మారబోతున్నామని ఇటు పాలకులు, అటు వారి అనుంగ మీడియా పదేపదే చెబుతున్నారంటే వారికి అబద్ధం (గోబెల్స్ సిద్ధాంతం) మీద ఎంత నమ్మకం వుందో అర్థమవుతుంది.

దేశ జనాభాలో 46 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. అయితే జాతీయ ఆదాయంలో ఈ రంగం వాటా మాత్రం ప్రస్తుతం కేవలం 15 శాతం. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా వున్న సన్న, చిన్న కారు రైతులను, వ్యవసాయ కూలీలను, వృత్తిదారులను గాలికి వదిలేసి భూస్వాముల సేవలో ప్రభుత్వాలు తరించాయి. దీని ఫలితంగా 1964లో జాతీయ ఆదాయంలో వ్యవసాయం వాటా 48 శాతం వుండగా, 2024 నాటికి 15 శాతానికి పడిపోయింది. ప్రజల కొనుగోలు శక్తి పెంచడంలో భూ పంపిణీ కీలకమైంది. ఆ దిశగా పాలకుల చర్యలు నామమాత్రమయ్యాయి. దేశంలో యువత-ఉపాధి అనే అంశంపై ప్రపంచబ్యాంకు చేసిన సర్వే ప్రకారం వ్యవసాయ దిగుబడులు ఏడేదాకేడాది తగ్గిపోతున్నా యని 68 శాతం మంది, తమ కుటుంబాన్ని పోషించుకోవ డానికి అవసరమైనంత భూమి లేదని 46 శాతం మంది, కుటుంబ అవసరాలకు సరిపడ ఆదాయం వ్యవసాయం నుండి రావడం లేదని 63 శాతం మంది, ప్రస్తుతం పొందుతున్న ఉపాధి నుండి తరలిపోవాలని భావిస్తున్నట్లు 82 శాతం మంది యువత అభిప్రాయపడినట్లు ప్రకటించింది. వ్యవసాయం అభివృద్ధి చెందకుండా దేశం అభివృద్ధి చెందదు. గ్రామీణ ప్రజల కొనుగోలు పెరిగితే పారిశ్రామిక ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా పాలకులు ఎర్ర తివాచీలు పరచి పిలవకపోయిన పెట్టుబడులు పరుగెత్తుకు వస్తాయి. కొత్త ఉద్యోగాలు వస్తాయి. ప్రజలు చెల్లించే పన్నులు పెరుగుతాయి. అప్పుడు పాలనకు అవసరమైన నిధుల కోసం ప్రపంచబ్యాంకు ముందో మరో అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ముందో దేవరించాల్సిన అవసరం పాలకులకు ఉండదు. ఇది జరగాలంటే వ్యవసాయ అభివృద్ధికి కీలకమైన భూ పంపిణీ మరియు ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలి. కేంద్ర బీజేపీకి ఇది అస్సలు ఇష్టం లేదు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మూడు నల్లచట్టాలను తెచ్చింది. ఇప్పుడు ట్రంప్‌తో వాణిజ్య చర్చలు జరుపుతుంది. వీటివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పతనావస్థకు చేరుకుంటుంది.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నాటి నుంచి ఆర్థిక వ్యత్యాసాలు బాగా పెరిగాయి. దేశంలో మూడు విభిన్న ఆర్థిక తరగతులు ఏర్పడ్డాయి. **ఒకటి సంపన్నులు ;** ఏ సరుకునైనా ఎంతటి ఖరీదైనా లెక్క చేయకుండా కొనగలిగిన అత్యున్నత తరగతి. **రెండు** ఊగిసలాటలో వున్న ఉన్నత మధ్య తరగతి. **మూడు,** మనుగడ కోసం పోరాడుతున్న కోట్లాది శ్రామిక వర్గం. మొదటి తరగతిలో 13 లేదా 14 కోట్ల మంది సంపన్నులు. వీరిని ఒక దేశంగా పరిగణిస్తే ప్రపంచ జనాభాలో 10వ దేశంగా, తలసరి ఆదాయంలో 63వ దేశంగా వుంటారు. వీరి వద్ద మాత్రమే అత్యంత కొనుగోలు శక్తి వుంది. ఈ కొద్దిమంది కొనుగోలుపైనే కీలకమైన వ్యాపార సంస్థలు ఆధారపడి ఉన్నాయి. వీరిని ఆకర్షించగలిగే వాటినే ఉత్పత్తి చేయడం, ప్రచారం చేయడం పెరిగింది. వీరి వల్ల ఖరీదైన బ్రాండ్ల అమ్మకాలు పెరిగాయి. వీటి అమ్మకాల్లో భారీగా ఆఫర్లు ఇవ్వడం కంటే, నాణ్యమైన, ఆకర్షణీయమైన ఉత్పత్తులను మెరుగుపరిచి, సంపన్నులకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న అల్ట్రా లగ్జరీ గేటెడ్ హౌసింగ్, ఖరీదైన ఫోన్లు అమ్మకాలు పెరగడం, పెళ్లిళ్లకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం ఇందుకు నిదర్శనం. 2015లో

బ్రాండెడ్ కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలు, 70 శాతంగా వుంటే 2022 నాటికి 90 శాతానికి పెరగడం ఇందులో భాగమే. జనాభాలో 10 శాతంగా ఉన్న వీరి అభివృద్ధే దేశాభివృద్ధిగా చిత్రీకరించడం కోట్ల మంది ప్రజలను విస్మరించడమే.

ఇక రెండో తరగతికి చెందిన వినియోగదారులు కష్టపడి సంపాదించిన డబ్బును ఖర్చు చేయడానికి ఊగిసలాడుతున్న వారు. నూతన ఉపాధి అవకాశాల ద్వారా కొంత సొమ్ము పోగేసుకున్నప్పటికి భవిష్యత్తు వారిని ఆందోళనకు గురిచేస్తుంది. ముఖ్యంగా ఉద్యోగ భద్రత, పిల్లల చదువులు, ఆరోగ్యం, రోజు వారీ ఖర్చులు, నివాసం, వృద్ధాప్యం ఇలా అనేక అంశాలు వీరి కొనుగోలును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. కోవిడ్ తర్వాతి పరిణామాలు వీరి జీవితాలను మరింత ఆందోళనకరంగా మార్చాయి. కోవిడ్ తర్వాత భారతదేశంలో ఆర్థిక పునరుత్తేజం k ఆకారంలో ఉందన్న దీర్ఘకాలపు అభిప్రాయాలను బ్లూ వెంచర్ నివేదిక బలపరుస్తుంది. ఇన్నేళ్లుగా దేశ పాలకులు కీర్తించిన ప్రపంచీకరణ సూత్రాలకు విరుద్ధంగా ట్రంప్ ఏకపక్షంగా సుంకాలు పెంచుతున్నాడు. అక్కడి ప్రవాస భారతీయులను వెనక్కిపంపడం, లేదా ఆర్థిక భారాలు వేస్తుండడంతో ఈ తరగతి తీవ్ర ఆందోళన చెందుతుంది. సేవా రంగం మన జాతీయ ఆదాయంలో కీలకంగా ఉంది. జీడీపీలో 54 శాతం వాటా కలిగి, 31 శాతం శ్రామిక శక్తికి ఉపాధి కలిపిస్తుంది. ఎ ఐ ముప్పుతో, చాలా తక్కువ నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు ఎక్కువ సంఖ్యలో కోల్పోయే అవకాశం ఉంది. భారతదేశ భవిష్యత్తు అభివృద్ధికి ఇదొక సవాలుగా మారుతంది.

గత 11 సంవత్సరాల మోడీ పాలనలో కార్పొరేట్లకు ప్రభుత్వ రాయితీలు, సహాయం భారీగా పెరిగి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, ప్రజా సంక్షేమ పథకాలకు కోతలు వేయడంతో దేశంలో వినియోగం మరింతగా పడిపోయింది. కొనుగోలే లేనప్పుడు పొదుపు అనేది వుండదు. మన దేశ ప్రజల ఆర్థిక పొదుపు 2000 సంవత్సరంలో 10.1 శాతం వుండగా, 2023 నాటికి 5.1 శాతానికి పడిపోయింది. మన పొరుగు ఆసియా దేశాల ప్రజలు 30 శాతం, చైనా ప్రజలు 44 శాతం పొదుపు చేస్తున్నారు. ఈ మధ్య తరగతి తమ జీవిత అవసరాల కోసం అప్పులపై ఆధారపడుతున్నారు. విద్యార్థుల నుండి ఫించన్‌దారుల వరకు రకరకాల యాప్‌లతో రుణాలు ఇచ్చే సంస్థలు పెరిగాయి. ఈ తరగతి ప్రజలు తమ ఆదాయంలో ఎక్కువ భాగం విద్య, వైద్యం, నివాసం కోసం ఖర్చు పెడుతున్నారు. సరిపడ ఆదాయం లేకపోవడం వున్న ఉద్యోగం ఉంటుందో లేదో అనే అనుమానం వీరి ఖర్చును గణనీయంగా తగ్గించి వేసింది. దేశంలో నివాస గృహాల మార్కెట్ ఐదేళ్ల కిందట 40 శాతంగా ఉండేది. అది ప్రస్తుతం 18 శాతానికి పడిపోయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు బాగా క్షీణించాయి. గత పన్నెండు సంవత్సరాల మోడీ పాలనలో పన్ను చెల్లిస్తున్న వారిలో 50 శాతం ప్రజల ఆదాయం స్తబ్ధతగా ఉంది. ఆర్థికంగా పెరుగుతున్న భారం మధ్య తరగతి ప్రజల పొదుపును దాదాపు ఖాళీ చేసింది. భారతదేశంలో కుటుంబాల నికర పొదుపు 50 సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరుకుంటోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

మూడో తరగతికి చెందిన 90 శాతం మంది శ్రమ జీవులను ప్రభుత్వాలు ఆచరణలో విస్మరిస్తున్నాయి. వీరు రోజు వారీ పని ద్వారా వచ్చే ఆదాయంతో కడుపునింపుకునే పేదలు. ఆర్థికంగానే కాక, సామాజికంగా అణచబడిన వారు. ప్రభుత్వాలు, వ్యాపార సంస్థల దృష్టిలో వీరు వినియోగదారులు కాదు. వీరికి ఎలాంటి ఉద్యోగ భద్రత లేదా ఆరోగ్య ప్రయోజనాలు అందుబాటులో లేవు. 2005లో గ్రామీణ పేదల కోసం ప్రారంభించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని పని హక్కును మోడీ ప్రభుత్వం రద్దు చేసింది. రానున్న రోజుల్లో గ్రామీణ ఉపాధి పెద్ద సమస్యగా మారనుంది. పట్టణాలకు తరలుతున్న యువతకు కనీస వేతనాలు, కార్మిక హక్కులు లేవు. వీరి శ్రమను చౌకగా యజమానులు, కమీషన్ ఏజెంట్లు దోచుకుంటున్నారు. దేశంలో 15 ఏళ్లు పైబడిన యువత 96 కోట్ల మంది వున్నారు. ఇందులో 57.8 కోట్ల మంది పనిచేయగలిగే శ్రామికులుగా వున్నారు. వీరిలో 18 కోట్ల మంది నిరుద్యోగులు, ముప్పై రెండున్నర కోట్ల మంది స్వయం ఉపాధి పొందుతున్న వారు, 11 కోట్ల మంది కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులు, 9 శాతం మంది మాత్రమే రెగ్యులర్ వేతనాలు పొందుతున్న వారు. మన పక్కన వున్న బంగ్లాదేశ్‌లో 42 శాతం మంది రెగ్యులర్ వేతనాలు పొందుతున్నారని బ్లూ వెంచర్ నివేదిక తెలిపింది. డిగ్రీ ఆపైన చదివిన వారిలో 28.7 శాతం, సెకండరీ/ హైయర్ సెంకడరీ చదివిన వారిలో 11.5 శాతం నిరుద్యోగులు వున్నారు. సంపన్నుల దగ్గర పోగైన సంపదపై పన్ను వేయడం ద్వారా ప్రభుత్వాలు ఆదాయాలు సమకూర్చుకోవాలి. ఆ నిధులతో విద్య, వైద్యం, రవాణా తదితర సేవలను ప్రజలకు అందించాలి. మోడీ కాలంలో 16 లక్షల కోట్ల రూపాయల రాయితీలు పొందిన అనేక కార్పొరేట్ కంపెనీలు తమ మిగులు సంపదను ఇతర దేశాలకు తరలించి అవి లాభపడుతూ దేశాన్ని దివాళా తీయిస్తున్నాయి. కావున దేశాభివృద్ధికి ప్రభుత్వ రంగం కీలకం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు ఆహార భద్రత, యువతకు స్థిరమైన ఉపాధి కలగడానికి ప్రభుత్వరంగం తోడ్పడుతుంది. సహజ వనరులను, దేశ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పుతున్న తీరును ప్రజలు గుర్తించకుండా వుండేందుకు మతతత్వాన్ని రెచ్చగొట్టడం పాలకుల విధానంగా వున్న నేపథ్యంలో ప్రజా ఉద్యమాల ద్వారానే దేశాభివృద్ధి సాధించగలం. ❑

# కార్పొరేట్ దురాశ వల్లే అసమానతలు

- ఎ.నర్సింహారెడ్డి,
ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు



ప్రపంచంలో అత్యంత ధనవంతులైన ఐదుగురి సంపద 2020 నుంచి రెట్టింపుకు పైగా పెరిగింది. అదే సమయంలో 4.8 బిలియన్ల (480 కోట్లు) మంది అంటే జనాభాలో 60 శాతం మంది మరింత పేదలుగా మారారు. ఈ లెక్కన చూస్తే ప్రపంచంలో ఏ ఒక్కరూ పేదరికంతో బాధపడకుండా ఉండాలంటే 229 సంవత్సరాలు పడుతుందని అంచనా వేసిన ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ప్రచురించిన నివేదికను దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా జనవరి 14న విడుదల చేశారు. 'ఈ అంతరాలను మేం గమనిస్తున్నాం. కొవిడ్, ద్రవ్యోల్బణం, యుద్ధాలు వంటి ప్రతికూల పరిణామాలతో కోట్లాది మంది ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు బిలియనీర్ల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. అసమానత అనేది యాధృచ్ఛికం కాదు. కార్పొరేట్ సంస్థలు ప్రజలందరి ప్రయోజనాలను ఫణంగా పెట్టి మరింత సంపదను తమకు అందజేయాలని కోరుకుంటున్నాయి అని ఆక్స్‌ఫామ్ తాత్కాలిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ ఓ ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి చెందిన దేశాలకు, వర్ధమాన దేశాలకు మధ్య అసమానతల వ్యత్యాసం గత పాతిక సంవత్సరాల్లో మొదటి సారిగా పెరిగింది. ప్రపంచంలోని వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తల సంపద వేగంగా రెట్టింపు అవుతుంటే, పేదరికం మాత్రం అందుకు కొన్ని వందల రెట్లు పెరుగుతోంది. ప్రపంచ జనాభాలో 28 శాతమే ఉన్నప్పటికీ సంపదలో 69 శాతం అభివృద్ధి చెందిన దేశాల వద్దే ఉంది. అలాగే బిలియనీర్ల సంపదలో కూడా 74 శాతం ఆ దేశాలదే. ఒకప్పుడు సంపద సామ్రాజ్యవాద వలసవాద దేశాలకే పరిమితమై ఉండేది. అయితే ఇప్పుడు వలసవాదం అంతరించిపోవడంతో వర్ధమాన దేశాలతో నయా వలసవాద సంబంధాలు మొదలయ్యాయి. దీంతో ఆర్థిక అసమానతలు శాశ్వతంగా అలాగే ఉండిపోయాయి. సంపన్న దేశాలకు అనుకూలంగా ఆర్థిక నిబంధనలు రూపొందాయి. బహుళజాతి కార్పొరేట్ సంస్థలు సంపదను సృష్టించి, సంపన్నులకే అందిస్తున్నాయి. ఇదిలా ఉండగా అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం అసమానతలు తిరిగి ప్రారంభమయ్యాయి. సంపన్న దేశాలలో కూడ పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతోంది. దీంతో అట్టడుగు వర్గాలు, జాతుల సమూహాలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నాయి.

**కార్పొరేట్ శక్తుల దురాశ వల్లే అసమానతలు :**

1975లో మొత్తం ప్రపంచ బహుళజాతి సంస్థల లాభాలు 4 శాతం కాగా 2020 నాటికి 18 శాతానికి పెరిగింది. కార్పొరేట్ సంస్థల దురాశ అసమానతలకు దారితీస్తోంది. అత్యంత ధనికుల చేతిలో కార్పొరేట్ యాజమాన్యాలు బందీ కావడం ఆందోళన రేకెత్తిస్తోందని ఆక్స్‌ఫామ్ తెలిపింది. అమెరికా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్‌లో అసమానతలు పెరిగాయని ఆర్థిక శక్తి కేంద్రీకరణ విచారకరమని నివేదిక వెల్లడించింది. ప్రపంచ ఆస్తుల్లో 43 శాతం ప్రపంచంలో 1 శాతం అత్యంత సంపన్న వర్గం గుప్పిట్లోనే మగ్గుతున్నాయని పేర్కొంది. అదే మాదిరి మధ్యప్రాచ్యం, ఆసియా, యూరప్ దేశాల్లోనూ ఇదే తరహా అసమానతలు వున్నాయని నివేదిక తెలిపింది. సంపన్న వర్గమైన ఒక శాతం చేతిలో 47 నుంచి 50 శాతం ఆస్తులు వున్నాయని వెల్లడించింది. ప్రపంచంలోని పది అతి పెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఏడు సంస్థల సీఈవోలు లేదా ప్రధాన వాటాదారులు బిలియనీర్లే. ఈ కంపెనీల సంపద 10.2 ట్రిలియన్ల (పది లక్షల ఇరవై వేల లక్షల కోట్లు) డాలర్లు. లాటిన్ అమెరికా, ఆఫ్రికాలోని అన్ని దేశాల స్థూల జాతీయోత్పత్తిని వీరి సంపద మించి పోయింది. వరల్డ్ బెంచ్ మార్కింగ్ అలయన్స్ సంస్థ నుండి సేకరించిన సమాచారాన్ని ఆక్స్‌ఫామ్ విశ్లేషించింది.

ప్రపంచంలో అతి పెద్ద 1600ల కంపెనీల్లో కేవలం 0.4 శాతం కంపెనీలు మాత్రమే తమ వద్ద పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు చెల్లిస్తున్నాయని ఆక్స్‌ఫామ్ విశ్లేషణలో తేలింది. అత్యంత సంపన్నులైన ఒక శాతం మంది వాటాదారులకు ప్రపంచ ఆర్థిక ఆస్తుల్లో 43 శాతం వాటాలు ఉన్నాయి. పశ్చిమాసియాలో ఇది 47 శాతంగా, ఆసియాలో 50 శాతంగా, యూరప్‌లో 47 శాతంగా వీరి వాటాలు ఉన్నాయి. 2023లో 93 బడా కార్పొరేట్ కంపెనీలు ఆర్జించిన ప్రతి 100 డాలర్లలోను 82 డాలర్లు వాటాల బై బ్యాక్, డివిడెంట్ల రూపంలో వెళ్తున్నాయి. 2023 జూన్ నాటికి ప్రపంచంలోని 146 బడా కార్పొరేట్ సంస్థలు 1.8 ట్రిలియన్ల డాలర్ల లాభాలను మూటగట్టుకున్నాయి. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ అనే సంస్థ 2023లో తెలిపిన వివరాల ప్రకారం ప్రపంచ జనాభాలో అత్యంత పేదలుగా ఉన్న 50 శాతం మంది ప్రపంచ ఆదాయంలో కేవలం 8.5 శాతం మాత్రమే పొందలిగారు.

ప్రపంచంలో అత్యధిక ప్రజలు సురక్షితము కాని, అనిశ్చిత

పరిస్థితుల్లో గంటల తరబడి పనిచేస్తున్నప్పటికీ చాలీచాలని వేతనాలతో బతుకులు నెట్టుకొస్తున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా 79.1 కోట్ల మంది కార్మికులు మెరుగైన వేతనాలు పొందలేకపోతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో కార్మిక వర్గం రెండేళ్ల కాలంలో వారి నిజ వేతనాన్ని 1.5 ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయారు. ఇది ప్రతి కార్మికునికి 25 రోజుల వేతనానికి సమానమని ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. ధనికుల సంపద, కార్మికుల వేతనాల మధ్య వ్యత్యాసం అనూహ్యంగా పెరిగిపోతుందని ఆక్స్‌ఫామ్ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రపంచంలోనే అత్యంత ధనవంతులైన ఐదుగురు ఎలాన్ మస్క్, బెర్నార్డ్ ఆర్నాల్ట్, జెఫ్ బెజోస్, లారీ ఎలిసన్, మార్క్ జుకర్‌బర్గ్ సంపద గత మూడేళ్లలో 464 బిలియన్ డాలర్లు పెరిగింది. 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్(ఓఈసీడీ)' సభ్యదేశాల్లో కార్పొరేట్ పన్ను 1980లో 48 శాతం ఉండగా ప్రస్తుతం అది 23.1 శాతానికి తగ్గింది.

## అసాధారణ స్థాయిలో భారత్‌లో అసమానతలు

అధికార బదిలీ తర్వాత కొంత మేరకు హక్కుల చైతన్యం పెరిగినా, పేద-ధనిక అంతరం వంద రెట్లు పెరిగింది. నానాటికీ పేద-ధనిక మధ్య అంతరాలు ఆసాధారణంగా విస్తరిస్తున్నాయి. భారత సమాజంలో పీడితవర్గాలు ఇప్పటికీ నాణ్యత ప్రమాణాలతో కూడిన, విద్య, వైద్యాలకు, సాంఘిక సమానతకు దూరమయ్యారు అని ఆక్స్‌ఫామ్ స్పష్టం చేసింది. దేశంలో 24.8 కోట్ల మంది పేదరికం నుండి విముక్తి పొందారని నీతి ఆయోగ్ నివేదిక పేర్కొంది. బీహార్ అట్టడుగున ఉండగా, తెలంగాణ మూడవ స్థానంలో ఉందని వెల్లడించింది. కానీ పేదరికం నిర్మూలనకు అనుసరించిన మార్గదర్శకాలు ఇప్పటికీ అసమగ్రంగానే ఉన్నాయి. యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(యుఎన్‌డిపి) దారిద్ర్య గణనలో ప్రజారోగ్యం, పౌష్టికాహారం, శిశు మరణాలు, విద్య, పాఠశాల ఎన్నేళ్లు చదివారు ? హాజరు ఎలా ఉన్నది? వంటగ్యాస్, పారిశుధ్యం, మంచినీరు, గృహవసతి, ఆస్తుల వంటి జీవన ప్రమాణాల ఆధారంగా వారు దారిద్ర్యరేఖను దాటారా ? లేదా ? అని నిర్ధారిస్తారు. నిరుద్యోగం పెరిగి, వేతనాలు తగ్గి, అసమానతలు పెరిగిపోతున్న కాలంలో పేదరికం తగ్గిందనడం హాస్యాస్పదం. 25 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారని ప్రకటించడం ద్వారా వారికి ఉచిత రేషన్, నగదు బదిలీ వంటి సంక్షేమ పథకాలు వర్తింపకుండా చేసే కుట్ర దాగి ఉందని అర్థమవుతుంది.

ప్రపంచం గడచిన నాలుగేళ్లలో చాలా పెద్ద పెద్ద సమస్యలు ఎదుర్కొంది. కరోనా మహమ్మారి వల్ల కోట్లాది కుటుంబాలు ఇంటి పెద్దలను, సంపాదనపరులను కోల్పోయి విచ్ఛిన్నమయ్యాయి. కోట్లాది మంది మరణించారు. ప్రాంతీయ స్థాయిలో అటు యూరప్‌లోనూ, ఇటు పశ్చిమాసియాలోనూ రెండు యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గడగడలాడిస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం రోజు రోజుకూ విస్తరించి కొత్త భయాలు రేకెత్తిస్తున్నది. ఈ పరిస్థితులలో జీవన వ్యయాలు ఊహించని రీతిలో పెరిగాయి. ఆరోగ్య సంరక్షణ, మనుగడ ప్రతి కుటుంబానికీ సవాలుగా మారింది. సంక్షోభం వచ్చిన ప్రతిసారీ ప్రపంచవ్యాప్తంగా పేద-ధనిక మధ్య అంతరాలు మరింత పెరుగుతున్నాయి. విచిత్రం ఏమిటంటే, అనేక సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు కళ్ళకు కడుతున్న ఆక్స్‌ఫామ్ సంస్థ జనవరి 14న తన నివేదిక ద్వారా "భారత దేశంలో అసమానతలు, అభివృద్ధి బండారం" బయటపెట్టిన రెండు రోజులకే ప్రధానమంత్రి పేదరిక నిర్మూలనపై తన ప్రచారం ప్రారంభించారు. మోడీ ప్రచారం ఆక్స్‌ఫామ్ నివేదికను తొక్కి పెట్టడం కోసమేనా అనే సందేహం కలగక మానదు. దేశంలో గుత్తాధిపత్యం పెరిగిందని, కేవలం ఐదుగురు పారిశ్రామికవేత్తల చేతుల్లో సంపద కేంద్రీకృతం అవుతున్నదని, వారే పరిశ్రమలను శాసిస్తున్నారని ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. "ప్రైవేటు ఈక్విటీ నిధులతో క్రోనీ క్యాపిటలిస్టులు (కేంద్ర ప్రభుత్వ మిత్రులైన వాణిజ్య ధనాధిపతులు) మాత్రమే సరికొత్త సంపన్నవర్గంగా ఆవిర్భవిస్తున్నారు.

ఈ దశలో చైనా దేశం పేదరికాన్ని నిర్మూలించామని ప్రకటించినప్పటికీ భారతదేశం అంత ధైర్యంగా చిత్తశుద్ధితో అలాంటి ప్రయత్నం చేయకుండా తప్పుడు ప్రచారానికే పెద్దపీట వేసింది. పైగా మతఛాందస ప్రభుత్వాన్ని వేళ్ళూనుకునేలా చేసే సంకల్పంతో మోడీ ప్రభుత్వం అంకెలు తారుమారు చేస్తూ, సరికొత్త ఎత్తుగడలతో ప్రజానీకాన్ని మభ్యపెడుతున్నది. సంపద, వనరులు కొందరికే కట్టబెట్టి, మెజారిటీ జనాన్ని ఉన్మాదంలో ముంచెత్తేందుకు ప్రయత్నిస్తున్నది. సామాన్యుల సంపదను ధనికులకు దోచిపెడుతుండగా, స్థూల జాతీయోత్పత్తుల్లో అప్పులే భారీ వాటా ఆక్రమించడం దేశ భవితకు ప్రమాదంగా మారింది. రామ మందిరం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రానున్న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పేరుతోను ఎన్నికల ప్రయోజనాలు వెతుక్కునే ప్రయత్నం చేస్తున్నది. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా తప్పుదారి పట్టించి భ్రమల్లో పెట్టడం అంటే బాహాటంగా ప్రజలను మోసగించడమే.

## ముగింపు :

ఆర్థిక వ్యవహారాల విశ్లేషకుడు సంజీవ్ చందోర్కర్ మాట్లాడుతూ 'ఆర్థిక అసమానతల మూలాలు ఆ దేశపు ప్రభుత్వం అమలు చేసే ఆర్థిక విధానాలపై ఆధారపడి ఉన్నాయి. వాటిపై సామాజిక ఆర్థికవేత్తలు **(మిగతా 22వ పేజీలో)**

# పన్ను విధానాల్లో మార్పే విరుగుడు



\- ప్రొఫెసర్ లుకాస్ ఛాన్సల్

ప్రపంచంలో ఆర్థిక అసమానతలు తగ్గడం లేదు. వివిధ దేశాలు, ధనికులు పేదలు, స్త్రీ పురుషులు, విద్య, ఆరోగ్యం.. అన్నింటిలోను అంతరాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ అసమానతలను పెంచి పోషించేలా ఉందని పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో సీనియర్ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ లుకాస్ ఛాన్సల్ పేర్కొన్నారు. భారతదేశంలోనూ అసమానతలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. అంతరాలు తగ్గక పోవడానికి కారణాలు తదితర అంశాలపై ప్రపంచవ్యాప్తంగా వివిధ విశ్వ విద్యాలయాలు, పరిశోధన సంస్థలకు చెందిన సుమారు 200 మంది ఆర్థిక శాస్త్రవేత్తలు, గణాంక నిపుణులు కలిసి 'ప్రపంచ అసమానతల నివేదిక-2026'ను రూపొందించారు. ఇనీక్వాలిటీ ల్యాబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అధ్యయనానికి లుకాస్, ప్రముఖ ఆర్థికవేత్తలు థమస్ పికెట్టి, రొవాడియా మెగ్రిఫ్, రికార్డో నాయకత్వం వహించారు. ఈ అధ్యయన సమన్వయకర్త ప్రొఫెసర్ లుకాస్ ఛాన్సల్ 'ఈనాడు ప్రత్యేక ప్రతినిధి' ఎం.ఎల్.నరసింహారెడ్డికి ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

**అసమానతలపై అధ్యయనంలో తేలిన ప్రధానాంశాలేంటి?**

ప్రపంచ జనాభాలోని మొదటి పది శాతం మంది ఆదాయం మిగిలిన 90 శాతం మంది ఆదాయంకంటే చాలా ఎక్కువగా ఉంది. దిగువన ఉన్న యాభై శాతం పేదలు మొత్తం ప్రపంచ ఆదాయంలో పది శాతంలోపే పొందుతున్నారు. సంపద మరింత కేంద్రీకృతమై ఉంది. పైన ఉన్న పది శాతం మంది మూడో వంతు ప్రపంచ సంపదను కలిగి ఉన్నారు. దిగువన ఉన్న యాభై శాతం మంది చేతిలో ఉన్న సంపద కేవలం రెండు శాతమే. మరింత లోతుగా పరిశీలిస్తే పైన ఉన్న పది శాతం మందిలో కూడా బాగా శ్రీమంతులైన 0.001 శాతం మల్టీ మిలియనీర్స్ మొత్తం ప్రజల్లో సగం మంది చేతిలో ఉన్న సంపద కంటే మూడు రెట్లు ఎక్కువగా కలిగి ఉన్నారు. వీరి వాటా స్థిరంగా పెరుగుతోంది. అత్యంత సంపన్నులైన ఈ 0.001 శాతం (60 వేల మంది) సంపద 1995లో 3.8 శాతం ఉండగా, 2025 నాటికి 6.1 శాతానికి పెరిగింది. దీన్ని బట్టే అసమానతలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

**ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలూ జనవర్గాల నడును ఆర్థిక అసమానతలు ఏ స్థాయిలో ఉన్నాయి?**

సంపదలో అసమానతలు 1990వ దశకం నుంచి తీవ్ర రూపం దాల్చాయి. పేదల సంపద వృద్ధిలో ఓ మోస్తరు ప్రగతే కనిపిస్తోంటే, పై అంచెలో ఉన్న వారి సంపద చాలా ఎక్కువగా పెరుగుతోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చాలా కొద్ది మందే ఆధిపత్యం చలాయిస్తున్నారు. మరోవైపు కోట్ల మంది కనీస అవసరాలకూ నోచుకోలేకపోతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావం విషయంలోనూ, స్త్రీ, పురుషుల మధ్య తీవ్ర అసమానతలు నెలకొన్నాయి. పురుషుడు గంటకు సగటున సంపాదించే మొత్తంలో మహిళ అర్జన 32 శాతం మాత్రమే. ఇంటి పనికి చేసే శ్రమను పరిగణనలోకి తీసుకొంటే ఈ తేడా ఎక్కువే. మహిళలు ఎక్కువ గంటలు పని చేస్తున్నా, తక్కువగానే ఆర్జిస్తున్నారు. మహిళలు సగటున వారానికి 53 గంటలు పని చేస్తే, పురుషులు 43 గంటలే శ్రమిస్తున్నారు. దేశాల మధ్య సైతం అసమానతలు అధికంగానే ఉన్నాయి. సబ్ సహారా ఆఫ్రికాలో ఒక విద్యార్థిపై చేసే ఖర్చుకంటే అమెరికాలో 40 రెట్లు ఎక్కువ. చాలా దేశాల్లో ఇదే పరిస్థితి, ధనిక దేశాలు పేద దేశాల్లో ఎయిడ్ కింద ఖర్చు చేసేది జీడీపీలో 0.3 శాతం మాత్రమే. కానీ ఆయా దేశాల నుంచి తీసుకెళ్తున్నది ఒక శాతందాకా ఉంటోంది. అల్పాదాయ దేశాల్లో విద్య, వైద్యం, వాతావరణ మార్పుల నిరోధక కార్యక్రమాలను చేపట్టే పరిస్థితి కూడా లేదు.

**సంపద, ఆదాయాలకు సంబంధించి భారతదేశంలో పరిస్థితేంటి?**

ప్రపంచంలో అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి, పైఅంచెలో వున్న పది శాతం మంది జాతీయ ఆదాయంలో 58 శాతం వాటా కలిగి ఉండగా, దిగువన ఉన్న యాభై శాతం మంది వాటా 15 శాతం మాత్రమే. సంపద అసమానతలు ఇంకా ఎక్కువ. పది శాతం మంది ధనికులు 65 శాతం సంపదను కలిగి ఉండగా, అగ్రశ్రేణిలోని ఒక శాతం మంది చేతిలో సుమారు 40 శాతం సంపద ఉంది. గడిచిన దశాబ్ద కాలంలో ఈ ఇరువర్గాల నడుమ ఆదాయ వ్యత్యాసాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మహిళా కార్మికుల భాగస్వామ్యం 15.7 శాతం మాత్రమే. మొత్తంగా భారత్‌లో ఆదాయం, సంపద, స్త్రీ పురుష అసమానత్వం తీవ్రంగానే ఉన్నాయి

**అసమానతలను తగ్గించడానికి**

### ఎలాంటి చర్యలు అవసరం ?

ప్రభుత్వాలు అసమానతల గురించి మాట్లాడుతూనే ఉన్నా, సంపద మాత్రం కొందరి దగ్గరే మరింతగా పోగుపడుతోంది. పన్నుల విధానంలో ప్రభుత్వాలు ఆధునికతను అందిపుచ్చుకోక పోవడమే ఇందుకు కారణం. ఇక్కడ నేను ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాల గురించి మాట్లాడుతున్నాను. ధనిక, పేద దేశాలనే తేడా లేదు. సమాజం ఎదుర్కొంటున్న వాస్తవిక సవాళ్లను ఎదుర్కోవడానికి అవి సిద్ధంగా లేవు. ఆధునిక ప్రపంచంలో ఆర్థిక వనరుల చలన స్వభావాన్ని బట్టి పెట్టుబడులు ఒక దేశం నుంచి మరొక దేశానికి సులువుగా వెళ్లిపోతున్నాయి. అత్యంత సంపన్నులు పన్ను ఎగవేయడాన్ని ఇది సులభతరం చేస్తుంది. కాబట్టి పన్నుల విధానంలో ఆధునికత అంటే సంపదపై పన్ను విధించడమే. అత్యంత పైస్థాయిలో అసమానతలు విపరీతంగా పెరుగుతుండటంతో ఇలాంటి చర్యలు అవసరం.

### ప్రభుత్వాలు గట్టి నిర్ణయాలు తీసుకుని అమలు చేసే పరిస్థితి ఉందా ?

ఈ విషయంలో ప్రభుత్వాలు ఇంకా సందేహిస్తున్నాయి. వేచి చూస్తున్నాయి. నిరుటి జీ 20 సదస్సులో అత్యంత ధనికుల నుంచి అధిక మొత్తంలో ఆదాయ పన్ను వసూలు చేయడంపై నిర్దుష్టమైన ప్రతిపాదనలు రావడం మంచి పరిణామం. ప్రపంచవ్యాప్తంగా శతాధిక కోటీశ్వరులపై రెండు శాతం కనీస పన్ను విధించాలన్న ప్రతిపాదనకు ఇది దారి తీసింది. ఇలాంటి వాటిని అన్ని దేశాల్లో స్వచ్ఛందంగా అమలు చేయవచ్చు. ఇవి జరగనంత వరకు అసమానతలు విపరీతంగా పెరుగుతూనే ఉంటాయి. ఇటీవలి కాలంలో ఆరోగ్యం, విద్యపై ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వాల దగ్గర వనరులు ఉండటం లేదు. శ్రీమంతుల్లో చాలా మంది పన్ను చెల్లించకపోవడం కూడా ఒక కారణమే. వారి నుంచి పన్నులు వసూలు చేస్తే ప్రజోపయోగ కార్యక్రమాలకు వనరులు పెరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన సర్వేలు అన్నింటిలో అన్ని వర్గాలకు చెందిన అత్యధిక ప్రజలు ఈ విధానాలకు మద్దతు తెలిపారు. నాయకులు మాత్రం దీనికి సిద్ధంగా ఉన్నట్లు లేదు. కానీ ఏదో ఒక సమయంలో వాళ్లు ఒప్పుకొంటారు. నూతన పన్ను విధానాలే కాకుండా ప్రభుత్వాల దన్నుతో ప్రపంచవ్యాప్తంగా అసమానతల తగ్గింపును పర్యవేక్షించడానికి అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటు కావాలి. ❑

**(22-12-2025 ఈనాడు దినపత్రిక సౌజన్యంతో )**

# కార్పొరేట్ దురాశ వల్లే అసమానతలు

**(19వ పేజీ తరువాయి)**

అధ్యయనం జరిపి, సమస్యలను గుర్తించి ప్రపంచానికి తెలియజేయడం ముఖ్యం' అన్నారు. అదేపని ఆక్స్‌ఫామ్ చేస్తోంది. అంతేకాకుండా ప్రజలకు రాజకీయాలపై అవగాహన వచ్చేందుకు ఈ నివేదికలు ఉపకరిస్తాయని తెలి పారు చందోర్కర్. "ఇలాంటి అంశాలపై ప్రజలు దృష్టి సారించి నప్పుడు, ముఖ్యంగా భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాల్లో, అంతరాలను రూపుమాపేలా విధానాల్లో సవరణలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి నివేదికల ఆధారంగా ఎన్నికలు, ర్యాలీలు, నిరసనల ద్వారా వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉంటుంది" అన్నారు. ఆయన విశ్లేషణ ప్రకారం.. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఎకనామిక్ ఫిలాసఫీగా వ్యవహ రిస్తున్న కార్పొరేట్ పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలు గడిచిన 30-40 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపాయి. ఇవాళ కార్పొరేట్ రంగం ఆర్థికపరంగా కన్నా రాజకీయపరంగా శక్తివంతంగా మారింది.

ఆ ఫలితంగా కార్పొరేట్ శక్తుల ఆర్థిక విధానాలే అమలవడం తోపాటు అవే వ్యవస్థను నియంత్రిస్తున్నాయి. రానున్న దశాబ్దాల్లో ప్రధాన పరిణామాలు, అతివృష్టి, అనావృష్టి వంటి అన్నీ అధిక జనాభా ఉన్న ఆసియా ప్రాంతంలోనే సంభవిస్తున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తల అంచనాలు వెలు వడుతున్నాయి. మరోవైపు రానున్న దశాబ్దంలోనే ట్రిలియనీర్ అవతరించబోతున్నాడని ఆక్స్‌ఫామ్ అంటోంది. సూపర్ రిచ్ మీద భారీగా పన్నులు వేయండని కొందరు పాశ్చాత్య కుబేరులు ఎప్పటిలాగానే దావోస్‌లో డిమాండ్ చేశారు. కానీ, కార్పొరేట్ ఆధిపత్యాలను విచ్ఛిన్నం చేయడం, అధిక లాభాలకు, అపరిమిత ఆస్తులకు వీలు కల్పిస్తున్న విధానాలను తిరగదోడటం బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థలో, అదీ ద్రవ్య పెట్టుబడి నియంత్రణలో ఉన్న ప్రస్తుత సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దశలో జరిగేపని కాదు. తక్కువ పన్ను రేట్లతో, ఎక్కువ ఎగవేత మార్గాలతో, ఏ మాత్రం పారదర్శకత లేని ప్రభుత్వ విధానాలను సంపన్నులే నిర్దేశిస్తుంటే, మరోవైపు శ్రమ దోపిడీకి వీలైన కార్మికచట్టాలు తయారవుతుంటే పరిస్థితుల్లో మార్పు వస్తుందని ఆశించడం భ్రమే. ప్రపంచ సంపదలో అసమానతలు పెరిగిన క్రమంలో పేదరికాన్ని తగ్గించేందుకు, అందరికీ సమాన అవకాశాలు కలి గిన భవిష్యత్ కోసం వ్యవస్థాగత మార్పులు చేపట్టాలని నివేదిక స్పష్టం చేసింది. కొద్దిమంది కోసం కాకుండా అందరికి ప్రయోజ నాలను చేకూర్చే ఆర్థిక వ్యవస్థలను రూపొందించేందుకు కీలక అడుగులు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆక్స్‌ఫామ్ నివేదిక స్పష్టం చేస్తోంది. ❑ **(వసంతమేఘం సౌజన్యంతో )**

# సంపద పన్ను శిక్ష కాదు, సంపద సృష్టే!

- ఆకుల అమరయ్య,
సీనియర్ జర్నలిస్టు



A society is not judged by how much wealth it creates, but by how fairly it distributes opportunities.

- అమర్త్య సేన్

"సమాజం ఎంత సంపద సృష్టించిందన్నదే కాదు. ఆ సంపద అవకాశాలను ఎంత న్యాయంగా పంచిందన్నదే సమాజాన్ని అంచనా వేసే ప్రమాణం" అంటారు నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్య సేన్ .

ఈ మాటలకు నేటి భారతదేశం సజీవ సాక్ష్యం. జీడీపీ వృద్ధి, స్టాక్ మార్కెట్ రికార్డులు, కార్పొరేట్ సంస్థల విలువలు, బిలియనీర్ల సంఖ్య – అన్నీ వేగంగా పెరుగుతున్నాయి. కానీ అదే సమయంలో ఆదాయం, సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమై, ఎక్కువ మంది జనాభా మాత్రం ఆర్థిక భద్రత లేకుండా జీవిస్తున్న వాస్తవం మరింత స్పష్టమవుతోంది. ఇది కేవలం ఆర్థిక అసమానత సమస్య కాదు. అవకాశాల అసమానత. ఈ అసమానతను సరిచేయకుండా భారత అభివృద్ధిని "సమగ్రం"గా చెప్పుకోవడం సమంజసం కాదు. నిన్నటి కన్నా నేడు బాగుండడాన్ని అభివృద్ధి అంటుంటారు. అభివృద్ధి ఎవరి కోసం, ఏ దిశగా అనేది ఇక్కడ ప్రధానం.

### కార్పొరేట్ల చేతుల్లో సంపద గుట్టలు.. పేదల చేతుల్లో చిల్లి గవ్వలు

భారతదేశం ప్రపంచపటంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ అనడంలో సందేహం లేదు. జీడీపీ వృద్ధి, స్టాక్ మార్కెట్ రికార్డులు, బిలియనీర్ల సంఖ్య వంటివన్నీ 'ఇండియా గ్రోత్ స్టోరీ'కి చిహ్నాలుగా చూపుతున్నారు. కానీ, ఈ అభివృద్ధి ఫలాలు సమాజంలోని అందరికీ సమానంగా చేరుతున్నాయా? లేదన్నదే సమాధానం. ఈ ప్రశ్నకు సమాధానం భావోద్వేగాల్లో కాదు. లెక్కల్లోనే ఉంది. ఆదాయం, సంపద, పంపిణీలే ఇందుకు రుజువులు. అసమానతలకు వాస్తవ చిత్రాలు. 2025-26 నాటి అంచనాల ప్రకారం, భారతదేశంలోని టాప్ 10 శాతం సంపన్నుల చేతుల్లో–జాతీయ ఆదాయంలో 58 శాతం వరకు ఉంది. అంటే రూపాయిలో 58 పైసలు ఈ పది మంది చేతుల్లో ఉంటే మిగతా 90 శాతం మంది ప్రజల చేతుల్లో 42 పైసలున్నట్టు. అదే సమయంలో దేశంలోని దిగువ 50 శాతం ప్రజలు కేవలం 15 శాతం ఆదాయంతోనే జీవిస్తున్నారు. మిగతాది

## టాప్ 25 మంది బిలీయనీర్లు

**ఈ బిలియనీర్ల సంపద సగటున దేశవ్యాప్తంగా ఉన్న పేదల సంపదకన్నా అనేక రెట్లు ఎక్కువ. ఇది భారతదేశంలోని సంపద అసమానతలను స్పష్టంగా చూపుతోంది. Forbes India లెక్కప్రకారం టాప్ 100లోని 25 మంది సంపన్నుల జాబితా ఇలా ఉంది.**

**భారతదేశంలోని ప్రముఖ సంపన్నులు - సంపద (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| ముఖేష్ అంబానీ కుటుంబం | 9,55,410 కోట్లు |
| గౌతమ్ అదానీ కుటుంబం | 8,14,720 కోట్లు |
| రోష్ని నాడర్ మల్హోత్రా కుటుంబం | 2,84,120 కోట్లు |
| సైరస్ ఎస్.పూనావాల్లా కుటుంబం | 2,46,460 కోట్లు |
| కుమార్ మంగళం బిర్లా కుటుంబం | 2,32,850 కోట్లు |
| నీరజ్ బజాజ్ కుటుంబం | 2,32,680 కోట్లు |
| దిలీప్ షాంఘ్వీ కుటుంబం | 2,30,560 కోట్లు |
| అజీమ్ ప్రేమ్‌జీ కుటుంబం | 2,21,250 కోట్లు |
| గోపిచంద్ హిందూజా కుటుంబం | 1,85,310 కోట్లు |
| రాధాకిషన్ దమానీ కుటుంబం | 1,82,980 కోట్లు |
| ఎల్.ఎన్. మిట్టల్ కుటుంబం | 1,75,390 కోట్లు |
| జే చౌద్రీ | 1,46,470 కోట్లు |
| సజ్జన్ జిందాల్ కుటుంబం | 1,43,330 కోట్లు |
| ఉదయ్ కోటక్ | 1,25,120 కోట్లు |
| రాజీవ్ సింగ్ కుటుంబం | 1,21,200 కోట్లు |
| అనిల్ అగర్వాల్ కుటుంబం | 1,11,400 కోట్లు |
| రవీ జైపురియా కుటుంబం | 1,09,260 కోట్లు |
| విక్రమ్ లాల్ కుటుంబం | 1,03,820 కోట్లు |
| సునీల్ మిట్టల్ కుటుంబం | 99,300 కోట్లు |
| మంగళ్ ప్రభాత్ లోధా కుటుంబం | 93,750 కోట్లు |
| మురళి దివి కుటుంబం | 91,100 కోట్లు |
| రోహికా సైరస్ మిస్త్రీ కుటుంబం | 88,650 కోట్లు |
| షాపూర్జీ పల్లోంజీ కుటుంబం | 88,650 కోట్లు |
| జోయ్ అలుక్కాస్ | 88,430 కోట్లు |
| శ్రీ ప్రకాశ్ లోహియా | 87,700 కోట్లు |

ఉన్నత మధ్యతరగతి, మధ్య మధ్యతరగతి(Middle middle class) చేతుల్లో ఉంది. సంపద పంపిణీలో ఈ అసమానత మరింత తీవ్రమైనది. దేశంలోని 1 శాతం అతి ధనవంతుల వద్ద దేశ సంపదలో సుమారు 40 శాతం, టాప్ టెన్ శాతం వర్గాల వద్ద 65 శాతం వరకు సంపద కేంద్రీకృతమై ఉంది. దిగువ 50 శాతం పేదల వద్ద మాత్రం 3 నుంచి 6 శాతం మాత్రమే సంపద ఉంది. 2025 ముగిసే నాటికి దేశంలో వంద కోట్లకు పైబడి సంపద ఉన్న సంపన్నులు సుమారు 284 (billionaire) మంది వరకు ఉన్నట్టు ఫోర్బ్స్ పత్రిక అంచనా. వీరి సంపద మొత్తం జీడీపీతో పోటీ పడుతోంది. నేటి జీడీపీ సుమారు 300 లక్షల కోట్లుగా ఉంది. దేశంలో 300లకు పైగా బిలియనీర్లు ఉంటే వీరిలో ఈ 25 మంది పెద్ద భాగాన్ని కలిగి ఉన్నారు. ఇది 135 కోట్ల జనాభాలోని భారీ అసమానతను స్పష్టంగా చూపిస్తుంది. దేశప్రజలందరూ ఉపయోగించుకోవాల్సిన సహజ వనరులు-ఇంధనం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆరోగ్యం, ఐటీ, ఆర్థిక సేవలు వంటివన్నీ ఈ సంపన్నుల చేతుల్లోనే ఉన్నాయి. వీళ్ల చెప్పిందే వేదం. పెంచిందే రేటు, తగ్గించేదే ధర. మొత్తం మార్కెట్‌ను వీళ్లు తిప్పగలుగుతున్నారనేది సుస్పష్టం. ఈ గణాంకాలు ఇంకో విషయాన్నీ స్పష్టం చేస్తున్నాయి. భారత ఆర్థిక వృద్ధి ఫలాలు కొద్దిమంది చేతుల్లోకే పోతున్నాయనేది స్పష్టమవుతోంది.

### కార్పొరేట్ సంపద ఎలా పెరుగుతోంది ?

గత దశాబ్దంలో భారతదేశంలో బిలియనీర్ల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. స్టాక్ మార్కెట్ లాభాలు, షేర్ల విలువల పెరుగుదల, కార్పొరేట్ ఆస్తుల విస్తరణ ద్వారా ఈ సంపద వేగంగా పెరుగుతోంది. 2025 నాటికి భారతదేశంలో వందల కోట్లున్న బిలియనీర్ల సంఖ్య మూడు వందలకు దాటి పోగా చిత్రంగా రోజుకో పూట తిండి కోసం వెతుక్కునే వారి సంఖ్య సుమారు 22 కోట్లుగా ఉంది. ఇది వ్యక్తిగత ప్రతిభ ఫలితమేనా ? లేక ప్రజా వనరులు, పాలసీలు, మార్కెట్ ఆధిపత్యాలు కలిసి సృష్టించిన సంపదనా ? ఈ ప్రశ్నకు సమాధానం లేకుండా పన్నుల చర్చ ముందుకు వెళ్లదు.

### సంపద ఒకే చోట పోగుపడితే ఏమవుతుంది ?

భారతదేశంలో సంపద కేంద్రీకరణ పెరిగే కొద్దీ ప్రజాస్వామ్య ప్రక్రియలు ఘోరంగా దెబ్బ తింటాయి. రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఒకే ఓటు హక్కు ఇస్తున్నా, ఎన్నికల నిధులు రాజకీయ ముఖ చిత్రాన్ని దెబ్బతీస్తాయి. ఎన్నికల బాండ్లు (Electoral Bonds) తెరపైకి వస్తాయి. కార్పొరేట్ నిధులు మూడో కంటికి తెలియకుండా బడా రాజకీయ పార్టీలకు చేరతాయి. ప్రభుత్వ విధానాలు ప్రజల కోసం కాకుండా 'దాతల' ప్రయోజనాలకు దాసోహం అంటాయి. అదే సమయంలో ప్రధాన మీడియా సంస్థలు పెద్ద కార్పొరేట్ సంస్థల గుప్పెట్లోకి వెళ్లడం వల్ల ప్రజా సమస్యలకు అణగారిన వర్గాల ఆక్రందనలకు చోటు లేకుండా పోతుంది. ప్రస్తుతం ఇండియాలో రిలయన్స్, అదానీ గ్రూపు సంస్థల చేతిలో సుమారు 21 ప్రముఖ న్యూస్ ఛానళ్లు ఉన్న సంగతి ఇక్కడ ప్రస్తావనార్హం. దీంతో ప్రజానుకూల విధానాలకు బదులు మార్కెట్ అనుకూల కథనాలు ప్రధానమవుతాయి. గనులు, టెలికాం, ఇంధనం, విమానాశ్రయాలు, పోర్టులు వంటి సహజ వనరుల కేటాయింపుల్లో పాలసీ క్యాప్చర్ పైచేయి అవుతుంది. నియంత్రణ సడలింపులు, ప్రైవేటీకరణ నిర్ణయాలు ప్రజా చర్చ లేకుండానే "ఆర్థిక సంస్కరణలు" పేరుతో ముందుకు వస్తాయి. ఈ ప్రక్రియలో లాబీయింగ్ అనే కనబడని శక్తి కీలకపాత్ర పోషిస్తోంది. సాధారణ పౌరుడికి తెలియకుండానే - మూసిన తలుపుల వెనుకే చట్టాలు, నిబంధనలు రూపుదిద్దుకుంటాయి. ఫలితంగా భారత ప్రజాస్వామ్యం, పార్లమెంటు సంపన్న వర్గాల పెంపుడు జంతువుగా మారిపోతుంది. అందుకే సంపద అసమానత భారతదేశంలో కేవలం ఆర్థిక సమస్య కాదు, అది ప్రజాస్వామ్య సారాంశానికే సవాల్ విసిరే రాజకీయ సమస్య.

### ఇది సమాజాన్ని బెదిరించడమేనా?

ఇక సంపద పన్ను లేదా వారసత్వ పన్ను. సంపద పన్ను (Wealth Tax) అనేది ఒక వ్యక్తి నికర ఆస్తుల (ఆస్తులు - అప్పులు) విలువపై విధించే పన్ను. ఇది ఆదాయపు పన్ను (Income Tax) కంటే భిన్నమైనది. ఆదాయపు పన్ను మీరు సంపాదించే దానిపై ఉంటే, సంపద పన్ను మీరు కలిగి ఉన్న దానిపై ఉంటుంది. తరతరాలకు ఎలాంటి పన్నుల పెద్ద అడ్డంకులు లేకుండా విధించవచ్చు. దీని గురించి మాట్లాడగానే "నేను సంపాదించిన ఆస్తిని నా పిల్లలకు ఇవ్వలేకపోతే, నేను ఎందుకు కష్టపడాలి?" అనే మాట తెరపైకి వస్తుంది. వినడానికిది బాగానే ఉన్నా తరచి చూస్తే ఇది సమాజాన్ని బెదిరించే వాదం. వారసత్వ హక్కు లేకపోయినా మార్కెట్‌లో ప్రతిభ ఉన్నవారు ముందుకు వస్తారు. ఇదే మూలధన వ్యవస్థ మౌలిక సూత్రం. "వారసత్వం లేకపోతే నేను ప్రతిభ చూపను" అనే వాదం నైతికంగానూ, ఆర్థికంగానూ నిలబడదు. నిజమైన ప్రోత్సాహం లేదా ఇన్సెంటివ్ అనేది వారసత్వం కాదు-పోటీ, ప్రతిభ, అవకాశాల సమానత్వం. ఇదే సందర్భంలో అనేక ప్రశ్నలూ వస్తుంటాయి. వారసత్వ పన్ను లేదా సంపద పన్ను విధిస్తే, ధనవంతులు తమ పెట్టుబడులను ఇతర దేశాలకు తరలించే అవకాశం ఉంది కదా అంటుంటారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే దీన్ని అడ్డుకోవడం చాలా సులువు. అంతర్జాతీయ సహకారం (Global Minimum Tax) అవసరం. సంపద పన్ను అనగానే కేవలం బిలియనీర్లే కాకుండా, నగరాల్లో ఒకట్రెండు ఆస్తులున్న ఉన్నత మధ్యతరగతి వారూ ఉలిక్కి పడుతుంటారు. అందువల్ల పన్ను పరిమితి (Exemption Limit) చాలా ఎక్కువగా ఉంటేనే (ఉదాహరణ

కు 100 కోట్లపైన ఉన్నవారికి మాత్రమే) సామాన్యుల మద్దతు లభిస్తుంది. భారత్‌లో విరాళాలు ఇచ్చే సంస్కృతి (Azim Premji వంటి వారు) ఉన్నప్పటికీ, అది పన్నుకు ప్రత్యామ్నాయం కాలేదు. స్వచ్ఛందంగా ఇచ్చే విరాళం 'దాత' ఇష్టంపై ఆధారపడితే, పన్ను అనేది 'పౌరుడి హక్కు'గా మారుతుంది. ధనవంతుల సంపద ఆస్తుల (Assets) రూపంలో పెరిగితే, పేదవాడి ఆదాయం ద్రవ్యోల్బణంతో హరించుకుపోతుంది. అంటే, ప్రభుత్వం పన్ను వేయకపోయినా, మార్కెట్ శక్తులు పేదవాడి నుంచి సంపదను ధనవంతుడికి తరలిస్తుంటాయి.

## ప్రపంచ దేశాలు ఏమి చేస్తున్నాయంటే..?

ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలు వారసత్వ పన్నును విధిస్తున్నాయి. జపాన్‌లో వారసత్వ పన్ను అత్యధికంగా 50 శాతానికి పైగా ఉన్నాయి. అమెరికాలో కూడా ఎస్టేట్ ట్యాక్స్ గరిష్ట రేటు 40 శాతం వరకు ఉంటుంది. బ్రిటన్ కూడా 40 శాతం పన్ను వేస్తోంది. అనేక యూరోపియన్ దేశాల్లోనూ సంపద బదిలీపై గణనీయమైన పన్నులు ఉన్నాయి. అంటే, ఇన్సెంటివ్ తగ్గిపోతుంది అనే వాదాన్ని ప్రపంచం అంగీకరించలేదు. భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నం. సంపద పన్ను 2015లో పూర్తిగా రద్దయింది. వారసత్వ పన్ను దశాబ్దాలుగా లేదు. ఫలితంగా–ఒకసారి పెరిగిన సంపద, తరాల తరాలకు ఎలాంటి పెద్ద అడ్డంకులు లేకుండా బదిలీ అవుతోంది. ఇదే సమయంలో పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని పరోక్ష పన్నులుగా (GST, ఇంధన పన్నులు) చెల్లిస్తున్నారు.

## సంపద పన్ను వేస్తే ఎంత రాబడి రావచ్చు ?

Hurun India Rich List 2025 ప్రకారం, భారత దేశంలోని బిలియనీర్ల చేతుల్లో సుమారు 98 లక్షల కోట్లకు పైగా సంపద కేంద్రీకృతమై ఉంది. దీనిపై 2 % Wealth Tax వేస్తే దాదాపు 2 లక్షల కోట్ల రాబడి రావచ్చని అంచనా. అదానీ, అంబానీ, టాటా, బిర్లా వంటి ధనవంతులపై 2 శాతం సంపద పన్ను వేస్తే వచ్చే ఆదాయం మన స్థూల జాతీయ ఉత్పత్తిలో (జీడీపీ)లో సుమారు 0.8 శాతం మేర అదనపు వనరులు సమకూరే అవకాశం ఉంది. **ఈ మొత్తం వస్తే..**

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించవచ్చు.

ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయవచ్చు.

పేదలకు ప్రత్యక్ష నగదు బదిలీలకు ఉపయోగించవచ్చు.

వృద్ధులు, దివ్యాంగులకు సామాజిక భద్రతకు వాడవచ్చు.

నిజానికిది అదనపు పన్నూ కాదు, ఖర్చూ కాదు, పెట్టుబడి. పేదల చేతిలో డబ్బు పెరిగితే వినియోగం పెరుగుతుంది. మనీ సర్క్యులేషన్‌లోకి వస్తుంది. వినియోగం పెరిగితే మార్కెట్ విస్తరిస్తుంది. మార్కెట్ విస్తరణ తిరిగి పరిశ్రమలకు లాభమే. అంటే, సంపద పునర్విభజన అనేది అభివృద్ధికి వ్యతిరేకం కాదు, ఆధారం. భారతదేశాన్ని నిజంగా ప్రజాస్వామ్య, సంక్షేమ రాజ్యంగా మార్చాలంటే అందరికీ ఆహార భద్రత, ఉపాధి భద్రత, ఆరోగ్య, విద్య హక్కులు ఉండాలి. ఇవి కాగితాలపై కాకుండా జీవితాల్లో కనిపించాలంటే, సంపద అసమానతను తగ్గించే పన్నుల చర్చ, సంస్కరణ తప్పనిసరి. ఇది కార్పొరేట్ వ్యతిరేక వాదం కాదు. న్యాయమైన పన్నుల ద్వారా సమాన అవకాశాలు కల్పించాలన్న డిమాండ్. సహజవనరులను అందరూ వినియోగించుకోవాల్సిన తరుణంలో ఏ ఒక్కరో వినియోగించుకుంటున్న తీరును, అసమాన పంపిణీని సవరించమని అడగడం. భారత దేశం పేద దేశం కాబట్టి ఇది సాధ్యం కాదు అనే వాదాన్ని కొందరు ఇప్పుడు తెరపైకి తీసుకువస్తున్నారు.

వాస్తవానికి భారత దేశం పేద దేశం కాదు, భారతీయులే పేదలని ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు తరిమెల నాగిరెడ్డి ఏనాడో తన పుస్తకం 'తాకట్టులో భారతదేశం'లో సోదాహరణంగా వివరించారు. దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గాలంటే సంపద పంపిణీ జరగాలి. కొత్త సంపద సృష్టికీ ఇది అవసరం. ఆ సంపద సమాజా నికి తిరిగి వెళ్లే మార్గం లేకపోతే ఆ అభివృద్ధి స్థిరంగా నిలబ డదు. "సంపదపై పన్నులు వేయడం విజయాన్ని శిక్షించడం కాదు; ప్రజాస్వామ్యం విఫలమవకుండా కాపాడటమే, Taxing wealth is not about punishing success. it is about preventing the failure of democracy అంటారు ప్రముఖ ఆర్థిక వేత్త థమస్ పికెట్టీ.

భారతదేశంలో ఈ రోజు అసలు ప్రశ్న సంపద సృష్టించామా లేదా అన్నది కాదు. ఆ ప్రశ్నకు జీడీపీ గణాంకాలు, కార్పొరేట్ విలువలు, బిలియనీర్ల జాబితాలు ఇప్పటికే సమాధానం చెప్పేశాయి. కానీ ఆ సంపద సమాజానికి తిరిగి వెళ్లే దారులు ఉన్నాయా అన్నదే కీలకం. కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైన సంపద ఎలాంటి అడ్డంకులు లేకుండా తరాల తరాలకు బదిలీ అవుతున్నప్పుడు, సమాన అవకాశాల భావన అర్థహీనంగా మారుతుంది. సంపద పన్ను, వారసత్వ పన్ను వంటి చర్యలు విజయాన్ని శిక్షించేవి కావు. అవి సంపద సృష్టిలో సమాజానికున్న పాత్రను గుర్తించి, ఆ సంపద సమాజానికి తిరిగి చేరే మార్గాలను నిర్మించే విధాన సాధనాలు. సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులు కాదు కార్మికులు, కర్షకులు, ఇతరేతర శక్తులు. మానవ శ్రమే సంపదను సృష్టిస్తుంది. ఫలితం ఎక్కువ శాతం పెట్టుబడిదారుల సొంతమవుతుంది. అభివృద్ధి అంటే కొద్దిమందికి సుఖభోగాలు కాదు, అందరికీ ఆయువుపట్టు కావాలి. ఆ పునాదిని బలోపేతం చేసే ధైర్యమైన పన్ను సంస్కరణలే భారత ప్రజాస్వామ్యానికి నిజమైన పరీక్ష. ❑

# సంపద పంపిణీ నినాదం..
# వర్గ పోరాట ప్రాథమిక రూపం



- ఎం.కోటేశ్వరరావు,
వేదిక డాట్ కామ్ సంపాదకులు

ధనం మూలం ఇదం జగత్ అన్నారు పెద్దలు. జగతిని నడిపించేది ధనమే. పూర్వకాలపు మన, ఇతర దేశాల తత్వ వేత్తలు ప్రవచించినా ఆధునిక కాలంలో కమ్యూనిస్టు సిద్ధాంత కర్తలు కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ చెప్పినా వాస్తవం అదే. అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు మానవ సంబంధాలన్నీ ఆర్థికమైనవే అని కూడా కమ్యూనిస్టులు చెప్పారు. ఇద్దరూ చెప్పింది ఒకటే కదా మనవారు ఎన్నడో చెప్పారు. వామపక్ష వాదుల ప్రత్యేకత ఏమిటని ఎవరికైనా సందేహం వచ్చిందంటే వారి బుర్ర పని చేస్తున్నదని అర్థం. నిజమే, సర్వేజనా సుఖినో భవంతు, వసుధైక కుటుంబం అని లేదా ఇతర దేశాలలో తత్సమాన అర్థంతో ఎవరు చెప్పినా వారంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. సుబోధ చేశారు. కానీ విన్న వారు, పాటించిన వారెవరూ లేరు. సుభాషితాలను దాటి అమలు కోసం ఎవరైనా ముందుకు పోతే విప్లవకారులంటూ అణచివేతలే అన్నది యావత్ ప్రపంచ చరిత్ర. ఆ సారాన్ని గ్రహించిన మార్క్సిస్టు పెద్దలు చెప్పిందేమంటే మంచి మాటలతో సమాజం మారదు. మార్చేందుకు జనమే పూనుకోవాలి. వారిలో కూడా దోపిడీకి గురయ్యే వారే ముందుండాలి. అడ్డుకొనే వారు మామూలుగా వినకపోతే చివరికి బడితెలు పట్టుకొని మార్చటం తప్ప మరొక మార్గం లేదని కర్తవ్యబోధ చేశారు.

ఇంత ఉపోద్ఘాతం ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ఇటీవలి కాలంలో సంపదల అసమానత విపరీతంగా పెరుగుతున్నదని, సంపదల పున:పంపిణీ జరగకపోతే సామాజిక సంక్షోభానికి దారి తీస్తుందని అనేక మంది చెబుతున్నారు. ఈ మాటలు చెప్పే వారిలో సంపన్నుల బాగు కోరుకొనే వారే ఎక్కువగా ఉన్నారు. వారి ఉద్దేశం ఏమిటంటే కొంత మంది దగ్గరే అపార సంపద పోగు పడితే మొదటికే మోసం వస్తుందన్నది. అయితే నిజంగా మంచి కోరుకుంటున్న వారు లేరా అంటే ఉన్నారు. 2026 ప్రపంచ అసమానతల నివేదిక డిసెంబరులో విడుదలైంది. 2018, 2022 తరువాత ఇది మూడవది. ప్రపంచంలో, మన దేశంలో కూడా అసమానత తీవ్ర స్థాయిలో ఉందని హెచ్చరించింది. ఈ నివేదికను రూపొందించిన వారు ల్యూకాస్ ఛాన్సెల్, రికార్డో గోమెజ్ కరేరా, రొవాయిడా మోషిరిఫ్, థామస్ పికెటి. ఆ నివేదికకు మన దేశానికి చెందిన జయతి ఘోష్, జోసెఫ్ స్టిగ్లిజ్ ముందుమాట రాశారు.

సంపాదకుల్లో చివరి వ్యక్తి ఫ్రెంచి ఆర్థికవేత్త థామస్ పికెటి గురించి తెలుగు వారికి కొంత మేరకు తెలుసు, ఎందుకంటే ఆర్థిక అసమానతల గురించి ఆయన హెచ్చరించిన అంశాలు గతంలో చర్చనీయాంశం అయ్యాయి. అసమానతలు అంటే కేవలం సంపదకే పరిమితం కాదు. వాతావరణ, లింగపరమైన, అవకాశాలు అందరికీ అందుబాటులో లేకపోవటం, చివరికి ఎన్నికల కోసం నియోజకవర్గాల విభజనలో వివక్షతో సహా ఇతర అంశాలు ఉన్నాయి. ప్రపంచ అసమానతల సమాచార సంస్థకు అనుబంధంగా ఉన్న రెండు వందల మందికి పైగా పరిశోధకులు అనేక కోణాల్లో చేసిన విశ్లేషణల సారమే ప్రపంచ అసమానతల నివేదిక. అన్ని అంశాలను ఇక్కడ సృజించటం సాధ్యం కాదు గనుక సంపదల పున:పంపిణీ గురించి చర్చిద్దాం.

ప్రపంచాన్ని 'కమ్యూనిస్టు భూతం' ఆవహించకుండా జనం దానివైపు మరలకుండా చూసేందుకు పెట్టుబడిదారీ ఆర్థిక, సామాజికవేత్తలు అనేక అంశాలను ముందుకు తెచ్చారు. వాటిలో ఊట సిద్ధాంతం ఒకటి. ప్రభుత్వాలు కేవలం పాలనకే పరిమితమై అన్ని రంగాలను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకే అప్పగిస్తే వారు సృష్టించే సంపదల మూట నుంచి ఊట యావత్ సమాజానికి దిగుతుందన్నది ఊట సిద్ధాంతం. దానికి సంస్కరణలు, నూతన ఆర్థిక విధానాల వంటి ముద్దు పేర్లు పెట్టారు. జనం కూడా నిజమేనని నమ్మారు. తమకూ సంపదల ఊట దిగుతుందేమోనని పోరాటాలు మాని ఆశతో చెంబులు పట్టుకు ఎదురుచూశారు. ధారలేమీ కారలేదు. కేవలం కొన్ని చుక్కలు మాత్రమే పడ్డాయి. దీంతో ఫలితం లేదని అసంతృప్తి చెందటం ప్రారంభించారు. సోషలిస్టు సమాజాల కోసం జనం చూడకుండా కొన్ని తాయిలాలు అందించి సంతృప్తి పరచేందుకు ఐరోపాలో అనేక ప్రయోగాలు చేశారు. సంక్షేమ పథకాలు అమలు జరిపి సోషలిజంలో ఇంతకంటే పెద్దగా ఒరిగేదేమిటని జనాన్ని కొంత కాలం మభ్యపెట్టారు.

ప్రథమ సోషలిస్టు రాజ్యం సోవియట్ యూనియన్ కూలి పోవటంతో కమ్యూనిజం, సోషలిజాలపై విజయం సాధించా మని, ఆ ప్రయోగం విఫలమైందని ప్రచారం చేశారు. అంతేనా పోటీ లేకపోవడంతో అప్పటి వరకు అమలు జరిపిన అనేక సంక్షేమాలకు కోత పెట్టటం ప్రారంభించారు. అసమానతలు అప్పటి నుంచి మరింత పెరగడంతో జనాన్ని తప్పుదారి పట్టిం చేందుకు సంపదల పున:పంపిణీ అవసరమంటూ మరో పల్లవి అందుకున్నారు. సూత్రరీత్యా దీన్ని ఎవరూ వ్యతిరేకించరు.

అయితే అది ఎలా అన్న అంశం మీదే తేడా వస్తున్నది. సంపదలు పంచినంత మాత్రాన వేగంగా దారిద్ర్యం తగ్గుతుంది తప్ప ఆర్థిక వృద్ధి జరగదని, జనాలను సోమరులుగా మారుస్తాయని కొందరు చెబుతున్నారు. కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు ఈ మంచి సంస్కరణ అంశాన్ని ప్రచారం చేసి జనాన్ని సమీకరించేందుకు చూస్తున్నాయి. అసలేమీ లేని దానికంటే ఏదో ఒకటి మంచిదే. అయితే భ్రమలు పెట్టుకోనవసరం లేదని చెప్పక తప్పదు. అసమానతల గురించి తాజా నివేదకలో పేర్కొన్న అంశాలను క్లుప్తంగా చూద్దాం.

మచ్చుకు ఒకటి, సబ్ సహారా ప్రాంతంలో ఒక బిడ్డ మీద పీపీపీ పద్ధతిలో 200 యూరోలు ఖర్చు చేస్తుండగా ఐరోపాలో 7,400, ఉత్తర అమెరికా, ఓషియానా దేశాల్లో 9,000 యూరోలు వెచ్చిస్తున్నారు. ప్రపంచంలో 0.001 శాతం అంటే అరవై వేల మందికంటే తక్కువ ఉన్న కోటీశ్వరులు దిగువన ఉన్న 50 శాతం జనాభా మొత్తం సంపదలకంటే మూడు రెట్లు ఎక్కువ కలిగి ఉన్నారు. ఏటా ప్రపంచ జీడీపీలో ఒక శాతం ధనిక దేశాలకు తరలుతున్నది. ఇది ప్రపంచ వృద్ధికి ఇస్తున్నట్లు చెబుతున్న సాయానికి మూడు రెట్లు ఎక్కువ. స్త్రీ, పురుష వేతన తేడా అన్ని చోట్లా ఉంది. గంటకు ఒక పురుషుడు పొందే వేతనంలో మహిళకు వస్తున్నది 61 శాతమే, వేతన చెల్లింపులేని పని గంటలను లెక్కిస్తే ఈ తేడా 32 శాతానికి దిగజారుతుంది. సంపదల పున:పంపిణీ ఎలా అన్నదాని మీద పూర్తి ఏకాభిప్రాయం ఉందా ? అంటే లేదని చెప్పవచ్చు. దోపిడీ విధానాన్ని కూకటివేళ్లతో పెకలించి వేయకుండా తీసుకొనే ఏ చర్య అయినా అది ఉపశమనం తప్ప మరొకటి కాదు.

లాటిన్ అమెరికా దేశాల్లో, దక్షిణాఫ్రికా, నేపాల్ వంటి చోట్ల పురోగామివాదులు, కమ్యూనిస్టులు ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చారు. దోపిడీ వర్గ పునాదిని దెబ్బ తీయకుండా దాని మీదే కొన్ని సంస్కరణలు మాత్రమే అమలు చేయటంతో ఒకదశ దాటిన తరువాత కార్మికవర్గంలో అసంతృప్తి కొనసాగుతూనే ఉంది. లాటిన్ అమెరికా దేశాల అనుభవం ఇదే. కొన్నిచోట్ల ఒకసారి గెలిచిన వామపక్ష శక్తులు తరువాత ఓడిపోవటానికి కారణాలు ఇవే. అసమానతలు ఎక్కువగా ఉంటే సామాజిక, రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతాయి. ఈ కారణంగానే రాజకీయ పార్టీలు ప్రజాకర్షక నినాదాలు, చర్యలతో ముందుకు రావడం పెరిగింది. ఓట్ల కోసం అలాంటి చర్యలకు పాల్పడను. ఆ సంస్కృతికి దూరం అని కొండంత రాగం తీసిన నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ అదే చేస్తున్నది. అయితే ఇతర పార్టీలు చేస్తే జనాకర్షక పథకాలు, తాము చేసేవి సాధికారత కలిగించేవంటూ వంచనకు పాల్పడుతోంది. ఇవి దీర్ఘకాలంలో అభివృద్ధిని దెబ్బ తీస్తాయని కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఆశ్రితులకు దేశ సంపదలను దోచిపెట్టి మరింతగా పెంచటమే గాక, సంపదలను సమంగా పంపిణీ చేయటాన్ని వ్యతిరేకించే వారే ఇలాంటి జనాకర్షక పథకాలను తీసుకువస్తారన్నది ఒక వాస్తవం. స్వాతంత్ర్యం గురించి కన్న కలలు విఫలమై 1967లో కాంగ్రెస్ అనేక రాష్ట్రాలలో ఓడిపోవటం, తనకు పార్టీలో సవాలు ఎదురైనపుడు గరీబీ హటావో పేరుతో ఇందిరాగాంధీ వాటికి శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. అయితే మనవంటి సమాజాలాలలో అవి అవసరం.

ఉదాహరణకు ఎన్‌టి రామారావు ప్రవేశపెట్టిన సబ్సిడీ బియ్యపు పథకం, వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు ఇస్తున్న పెన్షన్లు ఏ విధంగా సాయపడుతున్నాయో చూస్తున్నాం. ఇతర నగదు బదిలీ పథకాలు అలాంటివే. నిజానికి ఆ మొత్తాలు వస్తు, సేవల కొనుగోళ్ల రూపంలో తిరిగి ఆర్థిక వ్యవస్థలోకే వస్తున్నాయి. అందువల్ల ఈ మొత్తాలను ఇంకా పెంచటం సంపద పంపిణీలో భాగంగానే పరిగణించవచ్చు. అభివృద్ధి రేటుకు తగిన విధంగా పేదల ఆదాయాలు పెరగకపోతే ఫలాలు ధనికులకే చేరుతున్నట్లు లెక్క. మన దేశంలో అదే జరుగుతున్నది. శత కోటీశ్వరులు మరింతగా పెరుగుతున్నారు. ప్రపంచ అసమానతల సమాచార కేంద్ర వివరాల ప్రకారం దిగువ విధంగా మన దేశంలో అసమానత పెరిగింది. దీన్ని రెండుగా విభజించి చూడాలి. 1990 దశకంలో నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టక ముందు, తరువాత సమాజంలోని మూడు తరగతుల సంపదలు ఎలా పెరిగాయో చూడవచ్చు.

| **సంవత్సరాలు** | **దిగువ 50 శాతం** | **ఎగువ 10 శాతం** | **ఎగువ ఒక శాతం** |
|---|---|---|---|
| 1961-1970 | 12.29 | 43.18 | 11.87 |
| 1971-1980 | 11.75 | 42.25 | 11.23 |
| 1981-1990 | 10.91 | 45.00 | 12.50 |
| 1991-2000 | 8.36 | 54.57 | 23.31 |
| 2001-2010 | 8.10 | 56.60 | 25.70 |
| 2010-2020 | 6.12 | 63.68 | 31.55 |

**దీన్ని ముందే చెప్పుకున్నట్లు రెండు భాగాలుగా చేస్తే**

- 1961 నుంచి 1990 వరకు సగటు దిగువ 50 శాతం జనాభా వాటా 11.65 శాతం కాగా ఎగువ పది శాతం 43.47, ఎగువ ఒక శాతం 11.86 శాతం కలిగి ఉన్నారు.
- 1990 నుంచి 2020 వరకు వరుసగా 7.52 - 58.28 - 26.85 శాతం ఉన్నారు.
- నూతన ఆర్థిక విధానాలు అమలు జరిగిన మూడు దశాబ్దాలలో ఎగువ ఒక శాతం వాటా 226, పది శాతం మంది వాటా 134 శాతం పెరగ్గా దిగువ 50 శాతం వాటా 63 శాతం తగ్గింది.

మంచి రోజులు తీసుకువస్తానని చెప్పిన నరేంద్రమోడీ సంస్కరణలను మరింత వేగంగా అమలు జరుపుతానని చెప్పారు. దాని ఫలితం ఏమిటో చూశాము. కార్పొరేట్ పన్ను గణనీయంగా తగ్గించిన కారణంగా ఏటా లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖజానా కోల్పోతున్నది. పోనీ ఆ మేరకు ఆయా సంస్థలు పెట్టుబడులు పెట్టి ఉపాధి కల్పిస్తున్నాయా అంటే అదీ లేదు. పర్మనెంటు ఉద్యోగుల సంఖ్య నానాటికీ తగ్గుతున్నది. మన దేశ కార్పొరేట్ సంస్థలకు పన్ను తగ్గించిన కారణంగా వాటిలో పెట్టుబడులు పెడితే లాభసాటిగా ఉండటంతో విదేశీ కంపెనీ నేరుగా పరిశ్రమల స్థాపనకు బదులు ఉన్న కంపెనీల వాటాలను స్టాక్ మార్కెట్‌లో కొనుగోలు, విక్రయాలు చేస్తూ లాభాలను తమ దేశాలకు తరలించుకు పోతున్నాయి. ఆదాయాన్ని బట్టి పన్ను విధించి, ఆ మేరకు అల్పాదాయ వర్గాలకు రాయితీల రూపంలో సంపదల పంపిణీ ఒక పద్ధతి. లాటిన్ అమెరికాలోని బ్రెజిల్‌లో అసమానతలు, దారిద్ర్య నిర్మూలన పథకాల్లో భాగంగా షరతులతో కూడిన నగదు బదిలీ పథకాలను అమలు చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న అమ్మ వడి, తల్లిదీవెన పథకాలు వాటికి నకలే. తమ బుర్రలో పుట్టినవే అని ఎవరైనా చెప్పుకుంటే బడాయి తప్ప మరొకటి కాదు. 2003లో వామపక్ష నేత లూలాడ సిల్వా అధికారానికి వచ్చినపుడు అంతకు ముందున్న కొన్ని పథకాల అనుభవాలను చూసి మరింత లబ్ది చేకూరే విధంగా అల్పాదాయ వర్గాలకు ఈ పథకాన్ని అమలు చేశారు. పిల్లలను బడికి పంపటం, టీకాలు వేయించిన వారికి నగదు బదిలీ జరిగింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు దీనికి అర్హులు. అంతర్జాతీయంగా అది ప్రశంసలు పొందింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది.

సంపదల పంపిణీ వలన దారిద్ర్య తీవ్రత తగ్గుతుంది తప్ప అసమానత తొలగదు. గమనించాల్సిందేమంటే రెండు దశాబ్దాల తరువాత చూస్తే అసమానతలు ఎక్కువగా ఉన్న పది ప్రపంచ దేశాల్లో బ్రెజిల్ ఒకటిగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలలో అమలుచేస్తున్న రైతుబంధు, భరోసా మరో పేరుతో అందచేస్తున్న నిధులు, పిఎం కిసాన్ మొత్తాలు కూడా సంపద పున:పంపిణీలో భాగమే. అయితే అవి వ్యవసాయ రంగ సంక్షోభాన్ని ఆర్పేవి తీర్చేవి కాదు. కనీస వేతనాల పెంపుదల కూడా సంపదల పంపిణీలో ఒక అంశమే. గౌరవప్రదమైన జీవనం గడిపేందుకు, అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు అవకాశాలను పెంచుతాయి. అందువలన సంపదల పంపిణీ గురించి మరింత నిర్దిష్టంగా మథనం జరగాల్సి ఉంది.

తమ ప్రత్యేక లక్షణాలతో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించిన చైనాలో కూడా ఆర్థిక అసమానతలు ఉన్నాయి, అయితే వాటిని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది.

### ప్రపంచ దేశాల్లో భారతదేశం స్థానం

| | | |
|---|---|---|
| మానవాభివృద్ధి సూచిక | 193 | 130 |
| ప్రపంచ ఆకలి సూచిక | 127 | 105 |
| ప్రపంచ సంతోష సూచిక | 143 | 126 |
| మహిళా వెనుక బాటు | 146 | 129 |
| అవినీతి perception | 180 | 96 |
| పత్రికా స్వేచ్ఛ సూచిక | 180 | 159 |
| జీవన నాణ్యత సూచిక | 53 | 52 |
| ఆర్థిక అసమానతల సూచిక | 186 | 176 |

ఈ నివేదిక ప్రకారం సమాజంలో ప్రపంచంలో ఎగువన ఉన్న పది శాతం మంది వద్ద సంపద 58 శాతం ఉంది (2022లో 57 శాతం) దిగువన ఉన్న 50 శాతం మందికి 15 శాతం (2022లో 13శాతం). ఇంతకు ముందు పట్టికలో సంపదల పెరుగుదల రేటు చూశాము. ఉన్న సంపదల మొత్తం వేరు, పెరుగుదల రేటు వేరు. భారత్ మరియు చైనా గురించి చెప్పిందేమంటే ప్రపంచ మధ్య తరగతిలోకి చైనా జనాభా ఎక్కువ మంది చేరారని, అదే భారత్‌లో 1980లో మధ్య తరగతిలో ఉన్న 40 శాతంలో ఎక్కువ మంది ఇప్పుడు దిగువ 50 శాతంలోకి దిగజారినట్లు పేర్కొన్నది.

కార్పొరేట్లకు పన్ను తగ్గించిన కారణంగా సంపదలు పోగుపడటం ఒకటైతే రాష్ట్రాలకు రావాల్సిన పన్నురాబడి తగ్గుతున్నది. అది సంక్షేమ పథకాల మీద ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ఉదాహరణకు వెనుకబడిన తరగతుల వారికి 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ మాదిరి సామాజిక పెన్షన్లు నాలుగు వేలకు పెంచుతామని చెప్పిన తెలంగాణ కాంగ్రెస్ వాగ్దానం అమలుకు నిధులు లేవు.

బీజేపీ పాలిత రాష్ట్రాలలో పరిస్థితి మరీ అధ్వానం, వారికి అసలు ఆ ఉద్దేశమే లేదు అని వేరే చెప్పనవసరం లేదు. యూపీఏ ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన పెన్షన్ మొత్తాలనే మోడీ సర్కార్ ఇప్పటికీ అందిస్తున్నది తప్ప పైసా పెంచలేదు. దాని మానవత్వ ముఖం అలా ఉంది. అందువలన మరో విధంగా చెప్పాలంటే సంపదల పున:పంపిణీని దెబ్బ తీస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ రూపొందించిన ఆర్థిక చట్రంలోనే మన పాలకులు విధానాలను రూపొందిస్తున్నారు. అందుకే గొర్రె తోక మాదిరి జన జీవితాలు పెద్దగా పెరగటం లేదు. సంపదల పున:పంపిణీ నినాదం సంస్కరణ మాదిరి ఉన్నప్పటికీ అది కూడా వర్గ పోరాట ప్రాథమిక రూపమే అని చెప్పవచ్చు. ఈ మాత్రపు సంస్కరణనే వ్యతిరేకించే వారు, సంపదలను సమాజ పరం చేస్తే ఊరుకుంటారా ? **(మిగతా 29వ పేజీలో)**

# ప్రజా ఉద్యమమైతే సంపద పంపిణీ సాధ్యమే



- డాక్టర్ సీ.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి,
కమ్యూనిజం సంపాదక వర్గ సభ్యులు

నేడు ప్రపంచవ్యాప్తంగా సంపద కేంద్రీకరణ, సంపద గుత్తాధిపత్యంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. కార్ల్ మార్క్స్ నిర్వచించిన అదనపు విలువ నుంచి లాభాల రూపంలో పోగవుతున్న సంపద గుత్తపెట్టుబడిగా మారి ప్రపంచ మానవాళికి చేస్తున్న కీడుపైనా చర్చలవుతున్నాయి. ఇటీవలే జరిగిన న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లోనూ సంపద పంపిణీతో ముడిపడిన వివిధ అంశాలే ప్రధాన భూమికను పోషించాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఉన్న అమెరికాకు అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి గెలిచిన అనంతరం న్యూయార్క్ మేయర్‌గా గెలుపొందిన జోహ్రాన్ మంమ్దాని ఆలోచనలు అమెరికా సమాజాన్ని తీవ్రంగానే ప్రభావితం చేశాయని చెప్పక తప్పదు. పెట్టుబడిదారుల స్వర్గధామంగా పిలిచే న్యూయార్క్‌లో ఆర్థిక అసమానతలను రూపుమాపే విధానాలే తన పరిపాలనకు ప్రాతిపదిక కానున్నాయని జోహ్రాన్ ఎన్నికలకు ముందుగానే ప్రకటించారు. ప్రచారంలోనూ అదే పంథాను అనుసరించారు. అధిక సంపన్నులపై అధిక పన్నులు వసూలు చేయడం ద్వారా లభించే ఆదాయాన్ని సామాన్య ప్రజలకు అవసరమైన వసతి, విద్య, వైద్యం, రవాణా, ఉపాధి, ఇతర మౌలిక వసతుల కల్పన వంటి రంగాలపై ఖర్చు చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. సంపన్నుల సంపదను న్యూయార్క్‌లోని ఆర్థిక అసమానతల్ని రూపు మాపేందుకు వెచ్చిస్తామని బాహాటంగానే ప్రకటించి ప్రజల మద్దతును సమీకరించి ఎన్నికల్లో గెలిచారు. ఒక రకంగా కార్పొరేట్ వర్గాల శ్రేయస్సే సమాజ శ్రేయస్సని భావించే పెట్టుబడిదారులను సవాల్ చేసి ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణమంటూ ఎన్నికల్లో విజయం సాధించడం ఆషామాషీ వ్యవహారం కాదు. మరోవైపు యావత్ ప్రపంచమంతా తనమాటే వినాలని, పెట్టుబడిదారీ విధానాలను అంగీకరించాలని కార్పొరేట్ శక్తులకు మరింత దోచిపెట్టడం కోసం ట్రంప్ చేస్తోన్న టారిఫ్ వార్ ముదిరి పాకానపడిన తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం అసమానతలు లేని సమాజ నిర్మాణపు ప్రాసంగికతను కలిగే ఉంటుంది.

కార్పొరేట్ శక్తుల చేతుల్లో చిక్కుకున్న తమ దేశ సంపదలను జాతీయం చేసిన వెనిజుల వంటి దేశాలపై దాడికి కూడా పాల్పడిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ల వద్ద పోగవుతున్న సంపద, వారిపై విధిస్తున్న పన్నులు, అధిక సంపన్నులపై అధిక పన్నులు, ప్రజల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమానతల నివారణకు ఉన్న మార్గాలేమిటి అనే అంశాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది.

భారతదేశం విషయానికి వస్తే దేశంలోనూ కార్పొరేట్‌ల సంపద గణనీయంగా పెరిగింది. బిలీనియర్‌ల సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతూనే ఉన్నది. తలసరి ఆదాయం లెక్కలూ గొప్పగా అగుపిస్తూ సంపన్న దేశాలతో మన దేశం కూడా పోటీపడుతున్నట్టు కనిపిస్తోంది. కానీ దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో దారిద్ర్యం, పేదరికం తీవ్రమైనవిగా ఉన్నాయి. దేశంలో సుమారు 85 కోట్ల మందికి ఆహార భద్రతను అందించడం కోసం ఉచిత రేషన్ పథకాన్ని అందిస్తున్నామని మోదీ ప్రభుత్వం అంటున్నది. అంటే దేశంలో 85 కోట్లమందికి ఆహారం ప్రభుత్వమే అందించాల్సిన పరిస్థితి ఉన్నదని ప్రభుత్వమే అంగీకరించింది. దీనికి కారణం పేదరికం గణనీయంగానే ఉన్నట్టు ప్రభుత్వ చర్యల్లోనే కనిపిస్తోంది. ప్రభుత్వం నుంచి ఉచిత రేషన్ తీసుకోనివారిగా ఉన్నా సౌకర్యవంతమైన నివాసం, విద్య, వైద్యం సహా ఇతర కనీస అవసరాలను తీర్చుకోలేనివారి సంఖ్య కూడా గణనీయంగానే ఉన్నది. ఈ పరిస్థితి ఒకవైపు కొనసాగుతుంటే పాలకులు మాత్రం దేశం అభివృద్ధి చెందుతున్నదని బీరాలు పలుకుతున్నారు. దేశం ఆర్థికంగా వృద్ధి చెందుతున్నదని, ఇటీవలే ఆర్థిక శక్తి పరంగా జపాన్‌ను వెనక్కు నెట్టి ప్రపంచదేశాల్లో మూడోస్థానాన్ని పొందామని ప్రగల్భాలు పలుకుతున్నారు. త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెంది అగ్రస్థానం దిశగా కదులుతుందంటున్నారు. ఇందుకోసం దేశంలో పెరుగుతున్న కోటీశ్వరుల సంఖ్యను చూపిస్తున్నారు. రోజువారి కూలీని ఆదాయాన్ని కార్పొరేట్ దిగ్గజం అదానీ అదాయాన్ని కలిపి ఇద్దరి ఆదాయమూ, జీవన ప్రమాణాలు సమానం అని చెప్పే తలసరి ఆదాయం లెక్కల్ని చూపుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంత ఇప్పుడు మంది 3.8 లక్షల మందికి పైగా కోటీశ్వరులు భారత్‌లో తయారయ్యారని వాదిస్తున్నారు. అయితే దేశంలో కోటీశ్వరులు పెరుగుతుండడాన్ని మాత్రమే చూపించి అసమానతల కారణంగా సామాన్యుడు పేదవాడు అవుతున్న వాస్తవాన్ని ఉద్దేశ్యపూర్వకంగానూ పూర్వపక్షం చేస్తున్నారు.

దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై ప్రజల్లో చాలా కాలంగా అసహనం వ్యక్తమవుతూనే ఉంది. ఇది 2014 నాటి

ఎన్నికల ఫలితాల్లో కనిపించింది. అంతకు ముందున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోని నిరుద్యోగం, అవినీతి సహా వివిధ అంశాలపై విధానాలపై ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకతకు కారణం దేశంలో అన్ని రకాల అసమానతలు తీవ్రమవ్వడమే. ఇదే అదనుగా 2014 నాటి ఎన్నికల్లో నరేంద్ర మోదీ అసమానతలు రూపుమాపడం కోసం యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాల సృష్టి, విదేశాల్లో మూలుగుతున్న నల్లడబ్బును తెచ్చి సమానంగా (దేశ ప్రజలందరికీ ఒకొక్కరికి రూ.15 లక్షలు) పంపిణీ అనే హామీలను ముందుకు తెచ్చారు. ఈ విషయాలనే భారీగా ప్రచారం చేశారు. ఈ హామీ ప్రజలను ప్రభావితం చేయడానికి కారణం అసమానతలు భరించలేని స్థాయికి చేరడమే. దేశంలో తీవ్రమైన ఆర్థిక అసమానతలతో, పేదరికంలో కూరుకుపోయిన వారి ఓట్లను ఆకర్షించింది. నల్లధనం రూపంలో మూలుగుతున్న ఆ సంపదను ప్రజలకు పంపిణీ చేస్తామంటే సులభంగానే నమ్మేశారు. అంటే సంపద కేంద్రీకరణపై ప్రజల్లోని అసహనం, సంపద పంపిణీ జరగాలనే కోరిక ప్రజల్లో ఉందికాబట్టే మోదీ అప్పుడా ఎత్తుగడ వేశారు. లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని, కార్మికులందరికీ మెరుగైన వేతనాలు అందేలా చూస్తామని భారీ వాగ్దానాలు చేసి ఓట్లు దండుకుని అధికారం చేపట్టారు. ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి ఇప్పటికీ ఆయన ఆ రెండు అంశాల ఊసే ఎత్తలేదు. పైగా అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టుకున్నారు. తామూ పెట్టుబడిదారుల చుట్టాలమేనని చేతల్లో చూపించారు. బడా కార్పొరేట్ సంస్థలు, సంపన్న వర్గాల సేవలో తరించిపోతున్నారు. కార్పొరేట్ సంస్థలపై నియంత్రణలు తొలగించడం, సంపన్నులకు మరిన్ని పన్ను రాయితీలు కల్పిస్తున్నారు. నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు పట్టంగట్టి దేశంలో కార్పొరేట్ వర్గాలు చెల్లిస్తున్న పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి సాంకేతిక సేవలపై ఉన్న 25 శాతం పన్నును 10 శాతానికి తగ్గిస్తున్నట్లు 2015-16 బడ్జెట్‌లో నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లి చేత ప్రకటింపచేశారు. ఇది విధానం ఇప్పటికీ కొనసాగుతున్నది. కొన్ని నివేదికల ప్రకారం కార్పొరేట్ పన్నుకు వరుసగా రాయితీలు ఇవ్వడం మూలంగా రూ. 6 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోవడం జరిగింది. అప్పులు తీసుకుని బ్యాంకులను మోసగించి విదేశాలకు పారిపోయిన వారికి మద్దతుగా కేంద్ర మంత్రులే మాట్లాడిన పరిస్థితినీ చూశాము. రూ.20 లక్షల కోట్ల మేర రైటాఫ్‌ల రూపంలో కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టిన వైనం మనకళ్లముందే ఉన్నది. ఈ చర్యల ద్వారా తగ్గిన ప్రభుత్వపు ఆదాయాన్ని పూడ్చుకోవడం కోసం పేదలు, సామాన్యుల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాల నిధులకు కోతలు పెట్టడం, డిపాజిట్లపై వడ్డీ రేట్ల కోతలు, అప్పులు చేయడం, ప్రభుత్వరంగం ఆస్తుల అమ్మడం వంటి చర్యలకు దిగింది. పెద్దనోట్ల రద్దు, ప్రైవేటీకరణ, కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు, ప్రజోపయోగ ప్రభుత్వరంగ సంస్థలు, సేవలను కారుచౌకగా బడాబాబులకు కట్టబెట్టడం వంటి చర్యలన్నీ అందులో భాగమే. ఈ నిర్ణయాలు దేశ ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు మరింత పెరగడానికి కారణమయ్యాయి. పర్యవసానంగా ఒకరిద్దరు వ్యక్తులు ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానానికీ చేరారు. వేళ్లమీద లెక్కించే కొద్దిమంది వద్ద మొత్తం సంపద మొత్తం పోగుబడడం మొదలైంది. ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం మనదేశంలో 10 శాతంగా ఉన్న వారి దగ్గర 77 శాతం దేశ సంపద పోగైనట్లు తేలింది. నల్లకుబేరుల నుంచి సంపదను జాతీయం చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం భారతీయులందరికీ నిరుద్యోగం, పేదరికం, మానసిక అశాంతిని పంచింది.

భారతదేశంలో కార్పొరేట్ల వద్ద సంపద ఎలా పోగుపడిందో మనకు కళ్లకు కట్టినట్టు చూపించి సందర్భం కరోనా కాలం. శ్రామికవర్గం అంతా ఉపాధికి దూరమై ఆకలితో మాడి ప్రాణాలు కోల్పోతున్న ఆ సందర్భంలోనూ కార్పొరేట్ శక్తుల ఆస్తులు, సంపద గతం కన్నా అనేక వందల రెట్లు పెరిగాయి. మధ్య తరగతికి చెందిన శ్రామికవర్గం పేదరికంలోకి నెట్టివేయబడిన కాలంలో ఒక్క బడా కార్పొరేట్ సంస్థ కూడా ఆర్థికంగా దెబ్బతినలేదు. నష్టపోలేదు. మోదీ అనుంగు మిత్రుడు అదానీ సంపదల పెరుగుదలకు హద్దు, అవధులు లేకుండా పోయాయి. కార్పొరేట్ శక్తులు మరింత బలపడ్డాయి. దేశంలోని 90 శాతం సంపద బిలియనీర్ల చేతిలో కేంద్రీక తమై ఉందని ద వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ ఇటీవల విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. దేశంలోని మొత్తం సంపదలో 40 శాతం సంపద కేవలం ఒక శాతంగా ఉన్న వారి చేతుల్లో ఉన్నట్టు తెలిపింది. ఇది భారత దేశంలో గణనీయంగా పెరిగిన ఆర్థిక అసమానతలను సూచిస్తున్నది. బ్రిటీష్ పాలన కాలం నాటికన్నా ఆ అసమానతలు ఇప్పుడు ఎన్నో రెట్లు పెరిగినట్టు ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు. 1980ల కాలంలో దేశంలోని ఒక శాతం వారి వద్ద 12.5 శాతంగా ఉన్న సంపద 2023 నాటికి 55 శాతానికి చేరి శిఖరాగ్ర స్థాయిని అందుకున్నది.

ప్రధాని మోదీ నోటి వెంట కార్పొరేట్ శక్తులే నిజమైన దేశభక్తులనే మాట వినిపించింది. అందుకే వారి వ్యాపారాలకు ప్రకృతి వనరులను పెద్దమొత్తంలో కేటాయించడంతో పాటు పన్నుల్లో రాయితీలు ప్రకటిస్తున్నారు. ఈ పరిణామం ప్రభుత్వాల ఆదాయ మార్గాలపై పెను ప్రభావాన్ని చూపి ఆదాయం క్షీణించి సంక్షేమ పథకాల్లో కోతలకు కారణం అవుతుంది. చట్టబద్ధంగా అమలు కావలసిన గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవడాన్ని ఇందులో భాగంగానే చూడవచ్చు. దేశంలో క్రోనీ క్యాపిటలిజం పెరిగిపోవడం ద్వారా కార్పొరేట్ శక్తులు

ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వాల అండతో ఆయా కంపెనీలు తమ ఉత్పత్తులను సగటు ధరలకంటే అధిక ధరలకు అమ్ముకోవడం, అధిక లాభాలను పొందడం పరిపాటి అయింది. ప్రపంచ మార్కెట్టులో క్రూడ్ ఆయిల్ ధరలు గణనీయంగా తగ్గినా మన దేశంలో ఆ తగ్గుదల ప్రయోజనాలు సామాన్యులకు చేరకపోవడం ఇందులో భాగమే. పోగుపడ్డ సంపద గుత్తపెట్టుబడిగా మారి మార్కెట్టులోకి రావడంతో చిన్నతరహా ఉత్పత్తి దారులకు మార్కెట్లో మనుగడ సాగించలేని పరిస్థితులు ఎదురవ్వడంతో ఆయా వర్గాల వారు దివాళా తీయడంతో పేదరికంలోకి జారిపోతున్న కంపెనీలనూ, ఎంఎస్‌ఎంఈ లను మనం చూడవచ్చు. మోదీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వానికి వస్తున్న ఆదాయాన్ని సంక్షేమ పథకాల రూపంలో ఖర్చు చేయడమూ తగ్గింది. విద్యకు, వైద్యానికి కేటాయింపులు గణనీయంగా తగ్గిపోయాయి. మోదీ విధానాలే ఆదర్శంగా ప్రభుత్వ విద్య, వైద్యం కార్పోరేటీకరణకు గురవుతోంది. విద్య, వైద్యం, ఉపాధి ప్రభుత్వ రంగంలో ఉండకూడదన్నట్టు ప్రభుత్వ చర్యలున్నాయి. అటువంటి పని చేస్తున్న ఎన్‌జీవోలు, సహకార సంస్థలపైనా ప్రభుత్వం కన్నెర్ర చేస్తున్నది. సహకార సంస్థలు, కొన్ని బ్యాంకులు తమ కార్యకలాపాల ద్వారా ఆర్థించే లాభాలను ఆ సంస్థల్లో భాగస్వాములైన, లేదా సభ్యులకు పంపిణీ చేయడమూ మోదీ ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. ఈ తరుణంలోనే వివిధ పద్ధతుల్లో సహకార భావనలను, ఆ సంస్థలను నామరూపాలు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నది. ఇటీవలి కాలంలో ఆర్.బీ.ఐ ద్వారా సహకార సంస్థలపై వివిధ రకాలైన ఆంక్షలు పెడుతూ ఆయా సంస్థల కార్యకలాపాలకు అడ్డుపడుతూ లాభాలు రాకుండా, ఆ లాభాలను అందులోని సభ్యులకు పంచకుండా అనేక ఎత్తుగడలు వేస్తున్నది. ఇందుకు సంపద పంపిణీ, సంక్షేమ భావనల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేకతే కారణం. ఈ తరుణంలో దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గడానికి అవసరమైన చర్యలపై దృష్టి సారించాలి. మార్గాంతరాలను అన్వేషించాలి. ఆచరణకు సాధ్యంగా దేశంలోని పేదరికాన్ని నిర్మూలించడానికి, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయవలసి ఉన్నది. ఇందులో భాగంగానే నేడు సంపద పంపిణీ విషయంపై ప్రధాన చర్చ జరగుతున్నది. మరోవైపు అధిక సంపన్నులపై అధిక పన్నులను విధించడం, వారసత్వ పన్నుల విధింపుల ద్వారా లభించే ఆదాయంతో ప్రజలకు కొంతవరకైనా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన చేయవచ్చునే చర్చ ముందుకు వస్తున్నది. దేశంలోని మొత్తం సంపదను వివిధ వ్యక్తులకు, సమూహాలకు పంచడం ద్వారా ఆర్థిక సమానత్వం సాధించవచ్చునే వాదన బలం పుంజుకుంటున్నది. తద్వారా సామాజిక సంక్షేమం సాధ్యమవుతుందనే చర్చ నడుస్తున్నది. కార్పోరేట్ శక్తుల వద్ద గుత్తగా పోగుపడ్డ సంపదను సమానంగా పింపిణీ చేయడం ద్వారా సంక్షేమ సమాజం సాధ్యమవుతుందని ఆర్థికరంగ నిపుణులు అంటున్నారు. ఇది జరిగితే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ఆయా ఆర్థిక వ్యవస్థలు బలపపడతాయనే వాదనా ఉన్నది. ఆర్థిక స్థిరత్వం, సామాజిక న్యాయం అనే అంశాలతో మిళితం చేసి కార్పోరేట్‌ల వద్ద పోగుపడిన సంపదను జాతీయం చేయడం, సమానంగా పింపిణీ చేయడం అంత సులభమైన వ్యవహారం కాదు. అయితే నిరుత్సాహపడాల్సినపనీ లేదు. ప్రజలు కోరుకున్నారు కాబట్టే మన దేశంలో తెలంగాణ, పున్నప్రవాయిలార్ తెబాగా వంటి చోట్ల సాయుధ పోరాటాల రూపంలో భూముల పంపిణీ జరిగింది. సంపద పంపిణీ నినాదం కూడా దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమ స్వరూపాన్ని పొందితే అసాధ్యమూ కాదు. ❑

---

## ఆర్థిక అసమానతలు సంపదల పున:పంపిణీతో తొలగుతాయా !

**(26వ పేజీ తరువాయి)**

దేశంలో కార్పొరేట్లు, ధనికుల పెత్తనం ఉన్నందున వారి మీద పన్ను తగ్గించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దానికి విరుద్ధంగా పన్ను మొత్తాలను పెంచి పేదలకు పంచాలని ఇతరులు కోరుతున్నారు. పన్నులు పెంచుకుంటూ పోతే ఎగువన ఉన్నవారు కుప్పకూలుతారని వారి సమర్థకులు అంటే పెంచకపోతే మరింతగా దిగజారతామని దిగువన ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు.ఈ వైరుధ్యం మరింత ముదిరితే విప్లవానికే దారి తీస్తుంది. ప్రస్తుతం మనదేశంలో అలాంటి పరిస్థితి లేదు. 'చెడుగా మారేంత వరకు అసమానత మౌనంగానే ఉంటుంది.ఈ నివేదిక అసమానతకు మరియు నేటి అసమాన సామాజిక, ఆర్థిక నిర్మాణాలతో అవకాశాల నిరాకరణకు గురైన వందల కోట్ల మందికి గళాన్ని ఇస్తుంది' అని ప్రపంచ అసమానతల నివేదిక సంపాదకుల్లో ఒకరైన రికార్డో గోమెజ్ కరేరా వ్యాఖ్యానించాడు. ముందుమాట రాసిన వారిలో ఒకరైన జోసెఫ్ స్టిగ్లిజ్ ఇలా చెప్పారు. నేటి విపరీత అసమానత అనివార్యమైనదేమీ కాదని చరిత్ర, అన్ని దేశాల అనుభవాలు, సిద్ధాంతం కూడా చెబుతున్నది. పురోగామి పన్ను విధానం (సంపద పెరిగే కొద్దీ పన్నుల పెంపు), పెద్ద మొత్తంలో సామాజిక పెట్టుబడి,న్యాయమైన కార్మిక ప్రమాణాలు, ప్రజాస్వామిక వ్యవస్థలు గతంలో తేడాలను తగ్గించాయి. ఇదే మరోసారి చేయగలవు. సంపదల పున:పంపిణీ జరగాలని కోరుకొనే వారు ప్రచారానికి మాత్రమే పరిమితం కారాదు, కార్యాచరణకూ పూనుకోవాలి. ❑

# అవధులు లేని అసమానతలు



- ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

**దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆర్థిక అసమానతలు, అంతరాలు పెరుగుతున్నాయి. కార్పొరేట్ సంస్థల యజమానులు వేల కోట్ల రూపాయల ఖర్చుతో వివాహాది శుభకార్యాలు, సంబరాలు విదేశాల్లో నిర్వహిస్తున్నారు. దేశంలో ప్రతి సంవత్సరం బిలియనీర్ల, కుబేరుల సంఖ్య శరవేగంగా పెరుగుతున్నది. మన ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా కార్పొరేటీకరణ చేయడమే ప్రధాన లక్ష్యంగా అభివృద్ధి సాగుతున్నదనేది నిర్వివాదాంశం.**

కేంద్ర ప్రభుత్వం కార్మికుల వేతనాల నియంత్రణ, కుదింపు, పని గంటల పెంపునకు సహకరిస్తూ, కార్పొరేట్ సంస్థల లాభాలపై పన్ను శాతం తగ్గిస్తూ ప్రతి సంవత్సరం వారి లాభాలను పెంచుతున్నది. లాభాల వెల్లువను, పెట్టుబడులను, ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా కార్పొరేటీకరించడం జరుగుతోంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థలలో 30 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ కాకుండా ఉన్నాయి. దేశంలో ఒక పక్క పెట్రేగుతున్న నిరుద్యోగ సమస్య, మరోపక్క నిరంతరం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను గమనిస్తే ఆర్థిక వ్యవస్థలో పరస్పర వైరుధ్యాలు కలిగిన పరిస్థితులు ఎంతగా ఉన్నాయో అర్థమవుతుంది. ఆర్థిక వృద్ధిరేటు ఆరు శాతం, ఉపాధి - ఉద్యోగిత రేటు కేవలం రెండు శాతం మాత్రమే నమోదు అవుతున్న ఆర్థిక విధానంలో, దాదాపు ఉపాధి లేని అభివృద్ధి జరుగుతున్నదని ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ తిరోగమన ఆర్థిక విధానాల పుణ్యమా అని మధ్య, దిగువ స్థాయి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతున్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

పెట్రోల్, డీజిల్ పన్నులు, జీఎస్టీ పన్నుల భారం మధ్య, దిగువ తరగతి ప్రజలపై అధికంగా విధించడం వల్ల సగటు వినియోగదారుని నికర ఆదాయం కుదించుకుపోతోంది. నిత్యం పెరుగుతున్న ధరలతో అసంఘటిత, అనియత రంగంలోని ఉద్యోగుల, కార్మికుల వాస్తవ వేతనాలు రోజురోజుకూ కరిగిపోతున్నాయి.

ఎదుగుతున్న కోట్లాది విద్యావంతులైన యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించే ప్రయత్నంలో జి-20 దేశాలలో భారత్ వెనుకబడి ఉందని ఇటీవల ప్రపంచ బ్యాంకు అధికారి గోపీనాథ్ గుర్తుచేశారు. పేదలకు, ధనవంతులకు మధ్య సాపేక్ష పేదరికం మరింత పెరుగుతున్నది. డెబ్బై ఏడు సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా 80 కోట్ల మంది ప్రజలకు ఉచిత బియ్యం పంపిణీ జరుగుతున్నది. ఆర్థికాభివృద్ధి ఫలితాలు కార్పొరేట్ సంస్థలకు, పేద వర్గాలకు ఉచితాలు పంపిణీ చేసి పాలకులు చేతులు దులుపుకుంటున్నారు.

51 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ రూ. 100 నుండి రూ. 150 దినసరి ఆదాయంతో బతుకుతున్నారు. నివాసయోగ్యమైన గృహ సదుపాయం లేక ఆదివాసులు, గిరిజనులు, ఇతర పేదలు కోట్లాదిగా నిరాశ, నిస్పృహలకు గురి అవుతున్నారు. విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ రంగాల ద్వారా ప్రజల సమగ్ర అభివృద్ధికి కావలసిన ఆర్థిక విధానాలు అమలు చేయాలి. దేశ సంపదలో ప్రజలందరికీ భాగస్వామ్యం లభించాలి.

18వ లోక్‌సభలో 400 సీట్లు ఇవ్వండని అడిగినా, ప్రజలు కేవలం 240 సీట్లు ఇచ్చి కేంద్ర ప్రభుత్వ దూకుడుకు కళ్లెం వేశారు. ఇకనైనా ప్రజల అజెండాను పాలకులు గుర్తించడం ఎంతైనా అవసరం. మెజారిటీ ప్రజలకు అవసరమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధి విధానాలను రూపొందించాలి. పిడివాదపు ఆర్థిక విధానాలను విడనాడి ప్రజలకు ఉపాధి, ఉద్యోగ, ఆదాయాలను కల్పించి నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం నుండి రక్షించవలసిన అవసరాన్ని గుర్తించాలి. యువతలో పెరుగుతున్న అశాంతి, అభద్రతాభావాన్ని తొలగించాలి. వెనిజులా, శ్రీలంక, బంగ్లాదేశ్ మొదలైన దేశాలలో యువతలో పెల్లుబికిన అశాంతి, జరిగిన పరిణామాలు రాజకీయ వ్యవస్థలనే సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. మన దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, సాపేక్ష పేదరికం, ఆర్థిక అసమానతల అంతరాలను తగ్గించడానికి తగిన ఆర్థిక, రాజకీయ, సామాజిక సంస్కరణలు ఆదాయ పంపిణీ విధానాలను ప్రవేశపెట్టి అభివృద్ధిలో అన్నివర్గాల ప్రజలకు తగిన భాగస్వామ్యం కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం అర్థవంతం అవుతుందని భావించాలి. ❑

# అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అసమానతల భారత్ ?

- సి.రామచంద్రయ్య,
శాసనమండలి సభ్యులు



**మూ**డున్నర దశాబ్దాల క్రితం నాటి ప్రధాని పీవీ నరసింహారావు కొన్ని అనివార్య పరిస్థితుల్లో దేశంలో ప్రవేశ పెట్టిన ఆర్థిక సంస్కరణల వల్ల, ఆ తదుపరి వచ్చిన ప్రపంచీకరణ పుణ్యమా అని, పేదలకూ సంపన్నులకూ మధ్య పూడ్చ లేనంత వ్యత్యాసం ఏర్పడింది. ఆర్థిక సంస్కరణల వల్ల సృష్టించబడే సంపద అట్టడుగున వున్న పేదల వరకూ చేరుతుందని, దానిని 'ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్' అంటారని అప్పట్లో కొందరు ఆర్థికవేత్తలు, పాలకులు ఊదరగొట్టారు. అయితే, సంస్కరణల పేరుతో సాగిన ప్రైవేటీకరణ కారణంగా సృష్టించబడిన సంపదలో సింహ భాగంపై స్థాయికి చేరింది. నామమాత్రపు భాగం మాత్రమే కిందికి చేరుకుంది. ఫలితంగా, ఆర్థిక అసమానతలు అంతకు ముందెన్నడూ లేనంతగా పెరిగిపోయి, నేడు అది భూమ్యాకాశాలకు మధ్య ఉన్నంత అంతరంగా మారి పోయింది. అందుకనే రాజకీయ నాయకులు కొందరు ఒకప్పుడు ఊతపదంలా ఉపయోగించిన 'ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్' గురించి ఇప్పుడు మాట్లాడటం మానేశారు.



ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్ ఏ విధంగా తలక్రిందులైందంటే - నేడు దేశంలో 10 శాతం ప్రజల వద్ద 77 శాతం దేశ సంపద పోగుపడింది. కింది స్థాయిలో ఉన్న 50శాతం మంది ప్రజల వద్ద నామమాత్రంగా 4.1శాతం సంపద మాత్రమే ఉంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం 2022--23 ఆర్థిక సంవత్సరంలో 22.3 శాతం జాతీయాదాయాన్ని 1 శాతం మంది ఎగరేసుకు పోయారు. ఇది ఒకప్పటి రాచరిక వ్యవస్థలో అసమానతల కంటే ఎక్కువ. ఇంకా విపులంగా చెప్పాలంటే, ప్రముఖ అమెరికన్ పత్రిక 'ఫోర్బ్స్' కథనం ప్రకారం, 1991లో భారతదేశంలో ఒకే ఒక్క బిలియనీర్ ఉన్నాడు. 3 దశాబ్దాల కాలంలో అమలైన సంస్కరణల ఫలితంగా, బిలియనీర్ల సంఖ్య 162కు చేరుకొంది. ఈ 162 మంది నయా కుబేరుల సంపద ఎకాఎకిన జాతీయాదాయం పెరుగుదలలో 25 శాతంగా ఉంది ! ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడాన్ని ఎవరూ తప్పుపట్టవలసిన పనిలేదు. కాని, వాటి ప్రయోజనాల్ని కొందరు పారిశ్రామిక వేత్తలు పొందుతున్న తీరు, అందుకు కొందరు పాలకులు సహకరిస్తున్న విధానం, వారికి లబ్ధి చేకూరేలా తీసుకుంటున్న పాలసీల కారణంగా సంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారు. ముఖ్యంగా, అసంబద్ధమైన పన్ను విధానాలను అవలంబించడం వల్ల జాతీయాదాయానికి భారీగా గండిపడుతున్నది. దేశ జనాభాకు చేరవలసిన సంపద గద్దల్లాంటి కొందరికి ఫలహారంగా మారిపోతున్నది. ఫలితంగా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేయా ల్సిన దుర్గతి పట్టింది. సహజ వనరుల్ని కొద్దిమందికి ధారాదత్తం చేయకుండా ఉంటే, ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.

పేదలు మరింత పేదలు కావడానికి, మధ్య తరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధాన కారణాలు- ఈ వర్గాల వారికి విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడమే! సరైన ఆదాయంలేని పేద గ్రామీణ ప్రాంతాల ప్రజలలో పోషకాహార లోపం వల్ల రోగ నిరోధక శక్తి క్షీణించి, వారు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. వారికి ప్రభుత్వపరంగా అందే వైద్యం అందుబాటులో లేక, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి దోపిడీకి గురవుతున్నారు. ఇక 'విద్య'దీ ఇదే తంతు. ప్రభుత్వ పాఠశాలల్లో అందే విద్యపై నమ్మకం కోల్పోయి, తాహతుకు మించిన ప్రైవేటు బడులకు తమ పిల్లల్ని పంపించి చదివిస్తున్నారు ఆ పేద తల్లిదండ్రులు. ఫలితంగా మరింతగా అప్పుల ఊబిలోకి జారిపోతున్నారు.

కరోనా సమయంలో కుప్పకూలిన ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమ)లు ఇప్పటి వరకూ కోలుకోలేదు. కారణం - వాటిని గాడిలో పెట్టగల ప్రోత్సాహకాలు అరకొరగా అందడమే! నిజానికి భారత ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలే వెన్నెముక. దేశంలోని ప్రతి నగరం, పట్టణంలో రోడ్ల మీద కన్పించే తోపుడుబళ్ల వ్యాపారాలు మొదలుకొని, ఏటా 10 నుంచి 20 లక్షల టర్నోవర్ ఉండే చిన్న చిన్న వ్యాపారాల మీద ఆధారపడి సుమారు 20 కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. రోడ్ల విస్తరణ, బైపాస్ రోడ్లు వేయడం, ప్రభుత్వాల నుంచి ఎటువంటి సబ్సిడీలు అందకపోవడం **(మిగతా 36వ పేజీలో)**

# ప్రాసంగికం అవుతున్న గ్రాంసీ

- కొప్పర్తి వెంకటరమణమూర్తి,
ప్రముఖ చరిత్రకారులు





‘పాత ప్రపంచం మరణిస్తూ కొత్త ప్రపంచం జనిస్తున్న ఈ సంధి కాలంలో రాక్షసులు రాజ్యమేలుతున్నారు’ అని ఫాసిస్టు, నాజీ పాలకులను ఉద్దేశించి ఆంటోనియో గ్రాంసీ అన్న దాదాపు వంద సంవత్సరాల తర్వాత కూడా పరిస్థితుల్లో మార్పు లేకపోవడం గ్రాంసీని ప్రాసంగికం చేస్తున్నది. 1891లో జన్మించి ముస్సోలిని ఫాసిస్టు ప్రభుత్వంచే నిర్బంధానికి గురై చివరి పదకొండు సంవత్సరాలు జైలులోనే రాపాడి నలభై ఆరు ఏళ్లకే మరణించిన ఈ ఇటాలియన్ మార్క్సిస్టు మేధావి రూళ్లకర్ర లాంటిదనుకున్న మార్క్సిస్టు సిద్ధాంతానికి వంగే గుణాన్ని ఆపాదించాడు. 1937లో మరణించిన గ్రాంసీ 1960ల తర్వాత, ముఖ్యంగా 1970ల తర్వాత జీవించడం ప్రారంభించి దశాబ్దాలు గడిచేకొద్దీ మరింత పఠనీయమూ, ఆచరణీయమూ అవుతున్నాడు. తీవ్రమైన అనారోగ్యంతో, దారుణ ప్రతికూల పరిస్థితుల మధ్య సాగిన జైలు జీవితంలో ఆయన రాసిన ముప్పైకి పైగా ప్రిజన్ నోట్ బుక్స్ రానున్న కాలానికి విజన్ నోట్ బుక్స్ అయ్యాయి. ‘ఈ బుర్రని ఇరవై సంవత్సరాలపాటు పని చేయకుండా ఆపాలి’ అంటూ అన్నే ఏళ్లు జైలు శిక్ష విధించిన ఫాసిస్టు ప్రభుత్వం సూర్యుణ్ణి జైలు గోడల మధ్యకు రాకుండా ఆపగలిగింది కానీ, అతని ఆలోచనలను అనంతర కాలంలో వాటి ప్రసారాన్ని అడ్డుకోలేకపోయింది.

మార్క్సిస్ట్ అయిన కారణంగా జైలుకెళ్లిన గ్రాంసీ మార్క్స్ ఆలోచనల మీద మౌలిక ప్రశ్నలు లేవనెత్తాడు. ప్రాథమిక సూత్రాలు కొన్నింటిని దిద్దడానికి ప్రయత్నించాడు. ఆ కారణంగానే మార్క్సిస్ట్ నియతివాదాన్ని వ్యతిరేకించి మార్క్సిస్టులు కాని వారు సైతం అధ్యయనం చేయవలసిన వాడయ్యాడు. గ్రాంసీ రాజకీయ సామాజిక అంశాల మీద చేసిన కొత్త ఆలోచనలు 21వ శతాబ్దపు మనుగడకు సూచికలయ్యాయి. గ్రాంసీని చదివి కొందరు, చదవకనే కొందరు అనుసరించడం దాదాపు తొమ్మిది దశాబ్దాల తర్వాత నిలబడిన అతని సిద్ధాంతాలలోని సమకాలీనతకు నిదర్శనం. మార్క్సిజానికి కొనసాగింపుగా గ్రాంసీ చేసిన ప్రతిపాదనలు ప్రపంచానికి కొత్తదారి చూపించాయి.

ఆర్థిక సంబంధాలు పునాదిగా రాజకీయ సామాజిక మత సాంస్కృతిక సంబంధాలు నిర్మితమౌతాయనే రెండంచెల మార్క్సిస్ట్ దృక్పథంలో పౌరసమాజం అనే మధ్య అంచె ఉంద డాన్ని గుర్తించాడు గ్రాంసీ. అది రాజ్య, న్యాయ, రక్షక వ్యవస్థల్లో భాగం కాని విభాగం. ఆర్థిక సంబంధాలు మాత్రమే సామాజిక సాంస్కృతిక సంబంధాలని నిర్ధారించవని వాటి మధ్య ఆదాన ప్రదానాలు వుంటాయని అనడంతో గ్రాంసీకి కొత్తదా రులు తెరుచుకున్నాయి. సమకాలీన సమాజంలో విరివిగా వాడబడుతూ చర్చకు గురౌతున్న ‘సాంస్కృతిక ఆధిపత్యం’ (కల్చరల్ హెజిమొని) భావన ఆంటోనియో గ్రాంసీతో ముడిపడి వుంది. ఇటలీలో ఫాసిజం ఆవిర్భావం వెనుక పనిచేసిన రోమన్ సాంస్కృతిక పునరుజ్జీవన భావజాలం గ్రాంసీని ఆలోచింప చేసింది. ఫాసిజం పేరిట ప్రగాఢ జాతీయభావం ఏర్పడడంలో ముస్సోలిని ప్రేరేపించిన రోమన్ సంస్కృతీ ఔన్నత్యం నిర్వహిం చిన పాత్ర గమనంలోకి వచ్చింది. అట్లాగే మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఇటలీలో ఏర్పడ్డ ఆర్థిక మాంద్యం, రాజకీయ అస్థిరత, శ్రామికోద్యమాల వైఫల్యం నేపథ్యంలోంచి సాంస్కృతిక ఆధిపత్యం నిర్వహించగలుగుతున్న పాత్రను ఆయన అంచనా వేశాడు. ఆధిపత్య వర్గాలు ఆధిపత్య భావజాలాన్ని రాజకీయ రంగంలో బలప్రయోగంతో సాధించగలిగితే సాంస్కృతిక రంగంలో పౌరసమాజం అంగీకారంతో సాధించగలుగుతాయని సూత్రీకరించాడు. ప్రభుత్వ వర్గాల సాంస్కృతిక భావజాలమే విధాయకమని, అనుసరణీయమని, అదే తమ భావజాలం కూడా అని పౌరసమాజం చేత ఆమోదింపచెయ్యడాన్ని కల్చరల్ హెజిమొనిగా నిర్వచించాడు.

ఫాసిస్టు ప్రభుత్వాలే కాదు సోషలిస్టు వ్యవస్థలో శ్రామికవర్గాలు కూడా తమ సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పుకోగలగాలని సూచించాడు గ్రాంసీ. ఈ క్రమంలో కలుపుకు వెళ్లవలసిన సామాజిక ఉపశ్రేణుల్ని ప్రస్తావిస్తూ వారిని మొదటిసారిగా సబాల్టర్న్ వర్గాలుగా పేర్కొన్నాడు. ఈ వర్గాల ఐక్యత రాజ్యాధికార స్థాపనను సుగమం చేస్తుందని సూచించాడు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ సమాజంలోని ఒకానొక ప్రాథమిక వర్గం ఇతర సామాజిక ఉప శ్రేణుల్ని సమీకరించడం ద్వారా సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెలకొల్పవచ్చు నని, ఈ క్రమంలో

వారి భాష, సంగీత సాహిత్యాలూ, కళలూ, జానపద సంప్రదాయాలూ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయని అన్నాడు.

గ్రాంసీ మేధావుల్ని రెండు రకాలుగా వర్గీకరించాడు. ఇతరులను సంప్రదాయ మేధావులుగా పేర్కొన్న గ్రాంసీ ఆయా వర్గాల నుంచి ఉపశ్రేణుల్నించి రూపొందే మేధావుల్ని సవర్గ మేధావులని (ఆర్గానిక్ ఇంటలెక్చువల్స్) అన్నాడు. గ్రాంసీ అభిప్రాయంలో రాజకీయ కార్యకర్తలు, నిర్వహకులు, ఉద్యమ నాయకులు మేధావులే. భౌతిక, బౌద్ధిక కార్యకలాపాల పట్ల గ్రాంసీ తేడా చూపలేదు. ఏ భౌతిక కార్యకలాపమైనా ఎంతో కొంత బుద్ధిని ఉపయోగించకుండా ఎట్లా సాధ్యపడదో దేన్నైనా అధ్యయనం ద్వారా గ్రహించడానికి కొంతైనా శారీరక శ్రమను వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తించాడు. ఉద్యమాన్ని యుద్ధంగా భావిస్తూ యుద్ధ విన్యాసం, యుద్ధ వ్యూహం అనే రెండు తంత్రాలను ప్రతిపాదించాడు గ్రాంసీ. శత్రువును సరాసరి ఎదుర్కోవడం యుద్ధ విన్యాసమైతే, ఇతర వర్గాలతో స్నేహ సంబంధాలు, పౌరసమాజ అంగీకారం పొందడం వంటివి యుద్ధ వ్యూహంలో భాగాలు. అనేక వైరుధ్యాలుండే లోకజ్ఞానం లేదా కామన్ సెన్స్ గురించి గ్రాంసీ రాస్తాడు. అనేక ప్రాపంచిక దృక్పథాలు ఉన్నాయని అవి పరస్పర విరుద్ధ తత్వాలతో అసంపూర్ణ పూర్ణత్వాన్ని కలిగి వుంటాయని దాన్నే లోకజ్ఞానం అంటారని అన్నాడు. అసమానత్వం, అణచివేత వంటివి సహజమైనవి, మార్చ వీలు లేనివి అనే భావనలు ఈ కామన్ సెన్స్ నుంచే వస్తాయంటాడు. దీనిని విలోమ చైతన్యంగానో వ్యతిరేక చైతన్యంగానో భావించడానికి వీల్లేదని అంటూ అందులో కొంత సత్యమూ ఉండకపోదంటాడు.

అనేక సందర్భాలలో జైలు అధికారుల సెన్సార్ నుంచి తప్పించుకోవడం కోసం మార్క్సిజంకు ఆచరణీయ సూత్రాల తత్వం(ఫిలాసఫీ ఆఫ్ ప్రాక్సిస్)గా మారుపేరు పెట్టిన గ్రాంసీ దానిని ఒక నైరూప్య తాత్వికతగా భావించలేదు. అది ప్రజల స్థితిగతులు తాము అనుభవిస్తున్నంత సహజంగా వారి చైతన్యం లోకి కామన్ సెన్స్‌లోకి ఇంకిపోయేటట్లు చెయ్యగలిగేదిగా చూశాడు. ఫిలాసఫీ ఆఫ్ ప్రాక్సిస్ అంటే గ్రాంసీకి సమాజం లోని వైరుధ్యాలను గుర్తించే శాస్త్రమే కాదు, ఆ వైరుధ్యాల మీద అనుభవపూర్వక అవగాహన ఉండడం. అది అతనికి తాము జీవిస్తున్న కాలపు స్వీయ చారిత్రక అవగాహన.

గ్రాంసీ 1937లో చనిపోయినా ఫాసిస్టు ప్రభుత్వ పతనం తర్వాత 1945 నుంచే అతని రచనలు వెలుగు చూడడం ప్రారంభమైంది. 1971 వరకు వాటి ఇంగ్లీషు అనువాదమే వెలువడలేదు 1980కి ఇటలీలో అతని సర్వలభ్య రచనల సంకలనం వచ్చింది. ఈలోగా రష్యాలోనూ, తూర్పు యూరప్ లోనూ సోషలిస్ట్ వ్యవస్థల పతనం ప్రారంభమైంది. మార్క్సిస్ట్ సిద్ధాంతం ఆచరణ మీద నీడలు వ్యాపించాయి. కొత్త సామాజిక సమీకరణాలు రూపొందడం ఆరంభమైంది. ఈ నేపథ్యంలో గ్రాంసీ రచనల అధ్యయనం పెరిగింది. 1980లకు ముందూ వెనుకా లేవనెత్తబడిన కొన్ని ప్రశ్నలకి గ్రాంసీలో సమాధానాలు దొరికాయి.

ఆర్థిక సంబంధాల పునాది మీద మాత్రమే రాజకీయ సామాజిక వ్యవస్థలు నిర్మితం కావని అవి పరస్పర ఆధారితాలని, ఆర్థిక సంబంధాలు రాజకీయ సామాజిక సంబంధాలను ఒక వైపు రూపొందిస్తూ మరో వైపు నిర్వహిస్తే, రాజకీయ సామాజిక సంబంధాలు ఒకవైపు ఆర్థిక సంబంధాలను రూపొందిస్తూ మరోవైపున నిర్వహిస్తాయన్న గ్రాంసీ చాలా మందికి ఆమోదయోగ్యుడయ్యాడు. మతం, ఆర్థికం మొదలైన అంశాల మీద ఆర్థికం ప్రభావం ప్రశ్నార్థకమైంది. గ్రాంసీ ప్రతిపాదించిన సాంస్కృతిక ఆధిపత్యం భారతదేశంలో వేర్వేరు కోణాల్లో చర్చకు వచ్చింది. బూర్జువా ప్రభుత్వం తన భావజాలాన్నే ప్రజల భావజాలంగా అంగీకరింపచెయ్యడంలో విజయం సాధిస్తుందని దానికి ప్రత్యామ్నాయంగా శ్రామిక వర్గాలు ఇతర సామాజికవర్గాలను కలుపుకుని తానే సాంస్కృతిక ఆధిపత్యం నెలకొల్పాలనే గ్రాంసీ భావనకు ప్రచారం వచ్చింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మెజారిటీ ప్రజల మత పార్టీ అయినందున అది సాంస్కృతిక ఆధిపత్యం సునాయాసంగా సాధించగలిగింది. గ్రాంసీ ప్రతిపాదించినట్టుగానే రాజకీయ ఆధిపత్యం వెనుక సాంస్కృతిక ఆధిపత్యం దన్నుగా నిలబడింది. ఈ నేపథ్యంలో దేశవ్యాపితంగా విస్తరిస్తున్న లౌకికోద్యమాలు గ్రాంసీని సజీవుణ్ణి చేస్తున్నాయి.

గ్రాంసీ ప్రయోగించిన వాటిల్లో ప్రపంచం మీద, భారతదేశం మీద విస్తారమైన ప్రభావం చూపిన పదం ఆయనే మొదటిసారి ఉపయోగించిన ఉపశ్రేణులు (సబాల్టర్న్). సబాల్టర్న్ గ్రూప్స్ అనీ, సబాల్టర్న్ క్లాసెస్ అని గ్రాంసీ ఉపయోగించిన మాటలు జైలు సెన్సార్‌ను తప్పించుకునేందుకు ప్రోలెటేరియెట్‌కు ప్రత్యామ్నాయంగా వాడాడని భావించినప్పటికీ అనేక సందర్భాలలో అది శ్రామికవర్గం ఇతర ఉపశ్రేణులతో కలవడం గురించిన సందర్భమే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రోలెటేరియెట్‌లోని ఆర్థికకోణాన్ని సబాల్టర్న్‌లోని సామాజిక సాంస్కృతిక కోణంలోకి కొనసాగించడమే గ్రాంసీ తెచ్చిన విప్లవం. ఇది అంతర్జాతీయస్థాయిలో రణజిత్ గుహ వంటి చరిత్రకారుల సారథ్యంలో ఆదివాసీల స్త్రీల రైతుల దృష్టినుంచి చరిత్రను పునర్నిర్మించడానికి దారితీస్తే దేశీయంగా స్థానికంగా అనేక అస్తిత్వ ఉద్యమాలు ఆవిర్భవించడానికి కారణమైంది.

ఆర్థిక తారతమ్యం ప్రాతిపదికగా ఏర్పడిన శ్రామికవర్గం నుంచిసాంస్కృతిక వివక్షకు గురైన వర్గాలు విడిపోవడం గ్రాంసీ అవసరాన్ని ముందుకు తెస్తున్నది. ఉన్నవాళ్లు లేనివాళ్లూ అనే అడ్డుకోత విభజన నుంచి అగ్రవర్ణాలూ నిమ్న వర్ణాలూ, స్త్రీలూ

పురుషులూ అనే నిలువుకోత విభజన జరుగుతున్నప్పుడు ఈ రెండు రకాల విభజనలో ఎక్కువగా ఉన్నది శ్రామికవర్గాలు. కార్మిక కర్షక వర్గంలో అధికంగా ఉన్నది దళిత బహుజనులైతే, దాదాపు దళిత బహుజనులంతా శ్రామికవర్గమే. కులం, వర్గం అనేవి రెండు వేర్వేరు సమస్యలైనా ఎదుర్కొంటున్న శ్రేణి ఒక్కటేనని గుర్తించడంలో గ్రాంసీ వర్తింపు ఉంది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా అగ్రవర్ణస్వామ్యంగా కొనసాగుతున్న పరిస్థితి నుంచి మారడానికి కావలసిన పరిస్థితుల్లో ఉపశ్రేణుల మధ్య ఏర్పడవలసిన సంఘీభావం గ్రాంసీ ప్రస్తావించిన యుద్ధవ్యూహ స్థితికి సరిపోలుతుంది. దేశ జనాభాలో అరవై ఆరు శాతం ఉన్న ఈ శ్రేణులు ప్రధానశ్రేణులుగా రూపొందడానికి రాజ్యాధికార సాధనే లక్ష్యమని గుర్తించడంలోనూ గ్రాంసీ ఉంటాడు. ఐదువేల సంవత్సరాల నాగరిక చరిత్రలోనే కాదు, ఏడు దశాబ్దాల గణతంత్రంలోనూ ఈ వర్గాలకు రాజ్యాధికారం అందని ద్రాక్షే అయ్యింది. అందలేదు కదా అని ద్రాక్ష పుల్లనిదని సరిపెట్టుకునే కాల్పనికతకు కాలం చెల్లిందనుకోవడంలో గ్రాంసీ ఉంటాడు. అధికారం క్రమేపీ క్రిందివర్గాలకి అందడమే చరిత్రగమన లక్షణ మని గుర్తిస్తే ప్రాచీనయుగంలో రాచరిక వర్గానికీ, మధ్య యుగం లో భూస్వాములకూ, ఆధునిక యుగారంభంలో ఉన్నత మధ్య తరగతికీ అందివచ్చిన అధికారం ఇప్పుడు దళిత బహు జన శ్రామిక వర్గాలకు దక్కవలసి ఉందనుకోవడంలో గ్రాంసీ అస్తిత్వం ఉంటుంది. ఈ నేపథ్యంలో చూసినపుడు గ్రాంసీ–అంబేద్కర్‌ల మధ్య ఎన్నో పోలికలు కనిపిస్తాయి. ఇద్దరూ 1891 లోనే జన్మించారు. ఇద్దరూ తమ వర్గం చైతన్యీకరింపబడడంలోనే ఆ వర్గం భవిష్యత్తు ఉందని గుర్తించారు. ఇద్దరూ రాజ్యాధికార స్థాపన వెనుక సాంస్కృతిక ఆధిపత్య స్థాపనలో తమ తమ వర్గాలు నాయకత్వం వహించాలని కాంక్షించారు సైద్ధాంతికంగా సవర్గ మేథావుల గురించి గ్రాంసీ రాస్తున్నపుడే అంబేద్కర్ అందుకు గొప్ప ఉదాహరణగా ఆవిర్భవించడం వారిద్దరి మధ్య బలీయమైన బంధాన్ని సృష్టిస్తోంది. వారి తులనాత్మక అధ్యయన అవసరాన్ని సూచిస్తోంది. బీమాకోరేగావ్ కేసులో వరవరరావు, తెల్తుంబ్డే తదితరుల్ని నిర్బంధంలోకి తీసుకోవడం ఫాసిస్టు నియంత ముస్సోలిని మీద హత్యాప్రయత్న నేరారోపణ మీద గ్రాంసీని నిర్బంధంలోకి తీసుకోవడాన్ని గుర్తుకు తెస్తున్నది. అందుకే గ్రాంసీ అన్న ఈ వ్యాస ప్రారంభ వాక్యాల్నే ఇక్కడ పునరుల్లేఖించవలసి వస్తున్నది. 'పాత ప్రపంచం మరణిస్తూ కొత్త ప్రపంచం జనిస్తున్న ఈ సంధి కాలంలో రాక్షసులు రాజ్యమేలుతున్నారు.' ❑

## అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అసమానతల భారత్ ?

**(33వ పేజీ తరువాయి)**

తదితర కారణాల వల్ల, స్వయం ఉపాధి పొందుతున్న వీధి వ్యాపారులు లక్షల సంఖ్యలో రోడ్డున పడ్డారు. మరోపక్క వ్యవసాయ రంగంలోని చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం గిట్టుబాటుకాక, సాగుకు స్వస్తి పలికినట్లు, వీరి సంఖ్య దేశవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలుగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉపాధి లేమి, పేదరికం, అప్పుల కారణంగా దేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డుల ప్రకారం – ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో నిరుద్యోగులు, కూలీలు, స్వయం ఉపాధి పొందుతున్న వారు ఎక్కువగా ఉన్నారు. ఇటీవలి కాలంలో పిల్లల్ని పెంచలేక, వారిని చంపి తామూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న తల్లులు, తండ్రుల సంఖ్య పెరగడం అందర్నీ ఆందోళనకు గురిచేస్తోంది. దేశంలో ఒకవైపు బిలియనీర్ల సంఖ్యతో పాటు, మరోవైపు ఇలా ఆత్మహత్యల సంఖ్య పెరుగుతూపోవడం దేశ ఆర్థిక రంగంలోని వైరుధ్యాలకు అద్దం పడుతోంది. భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్నదని వేసుకొంటున్న లెక్కలు నిజమే కావచ్చు. కానీ, మేడిపండులా కనిపించే ఈ ఆర్థిక వ్యవస్థలోని అసమానతల్ని తగ్గించకుండా, కేవలం జీడీపీ లెక్కల తో మురిసిపోతే ప్రయోజనం ఏమిటి? ఆకలి చావుల సూచీల్లో మన దేశం సబ్ సహారా దేశాల కంటే దిగజారిన స్థాయిలో ఉండటం నిజం కాదా?

ఆర్థిక అసమానతలు లేకుండా ప్రపంచంలోని ఏ దేశమూ ఉండదన్న మాట నిజమే. అగ్రరాజ్యాలుగా చెప్పుకుంటున్న అమెరికా, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ వంటి దేశాల్లో కూడా ఆర్థిక అసమానతలు ఉన్నాయి. కానీ, ఆ దేశాల్లో సామాన్య ప్రజలకు అందుబాటులో మెరుగైన ప్రభుత్వ విద్య, వైద్యం ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అందరూ పనిచేయడానికి ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అక్కడ దాదాపు 90శాతం మంది ప్రజలకు ఏదో ఒక రంగంలో నైపుణ్యం ఉన్నది. అక్కడి సంపన్నులపై 1 శాతం సంపద పన్ను అదనంగా వేస్తున్నారు. ఇక్కడ మాదిరిగా కార్పొరేట్ పన్నుల్లో రాయితీలు ఇవ్వడం, ఉద్యోగాల కల్పన పేరుతో భూముల్ని తేరగా ఇచ్చే విధానాలు లేవు. పైగా ఆ దేశాల నుంచి నల్లధనం తరలించడం దుర్లభం.


మన దేశ ఆర్థిక వ్యవస్థలో అంతర్గతంగా ఇమిడి ఉన్న పలు బలహీనతలను సవరించకుండా, పెరుగుతున్న స్థూల జాతీయా భివృద్ధి ఫలాలు అందరికీ చెందేలా చర్యలు తీసుకోకుండా, భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని చాటుకోవడం ఆత్మవంచనే అవుతుంది. 'కరి మింగిన వెలగ పండు' పైకి గుండ్రంగాను, పెద్దదిగాను కనిపిస్తుంది. కానీ లోపల మాత్రం అంతా డొల్లే! మన దేశ ఆర్థిక వ్యవస్థ ఇలాగే ఉందన్నది వాస్తవం. ❑

# రాజ్యాంగ శాసనసభలో పీఠికపై చర్చ



- డా.ఎ.బి.సాయిప్రసాద్

**డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ద్వారా అధ్యక్షుడి హోదాలో తయారు చేయబడిన మన రాజ్యాంగం 75 వసంతాలను పూర్తి చేసుకుంది. హేమాహేమీలతో కూడుకున్న రాజ్యాంగ శాసనసభ (CONSTITUENT ASSEMBLY) క్లాజు(CLAUSE) వారీగా చర్చించి తొలుత పీఠికను, ఆ తర్వాత మొత్తం ముసాయిదాను ఆమోదించింది. తృతీయ పఠనంలో 1949 నవంబరు 26న సవరణలకు అధికార ముద్రపడింది. 42వ రాజ్యాంగ సవరణ యాక్ట్ 1976లో చేర్చబడిన మాటలను లౌకిక (SECULAR) సామ్యవాద(SOCIALIST) తొలగించలేమని 25-11-2024న మనదేశపు సుప్రీంకోర్టు కీలకమైన తీర్పునిచ్చింది.**


భారత రాజ్యాంగము

భారత ప్రజలమైన మనము మన భారతదేశాన్ని
సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర
రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్రదీక్షతో తీర్మానించి
మన దేశ పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ
న్యాయాల్ని
ఆలోచనా భావప్రకటనా మతవిశ్వాస ఆరాధనా
స్వేచ్ఛను
హోదాల్లోనూ అవకాశాలలోను
సమానత్వాన్ని
సాధించేందుకు వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత సమగ్రతను కల్పించే
సౌభ్రాతృత్వాన్ని
పెంపొందించాలని మన రాజ్యాంగ నిర్ణాయక సభ లో
1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని
స్వీకరించి శాసనీకరించి ఆమోదించి
మనకు మనము సమర్పించుకుంటున్నాము

1949 అక్టోబరు 16, 17, 18 తేదీలలో జరిగిన చర్చలో దేవుడు, మహాత్మాగాంధీ, లౌకిక విధానం (SECULARISM), సమాజ వాదం వంటి అంశాలను విపులంగా చర్చించి వాటిని రాజ్యాంగ శాసనసభ స్వీకరించలేదన్న సంగతి మనలో చాలా మందికి తెలియదు. రాజ్యాంగ శాసనసభ నిపుణ సలహాదారు డిగా నియమింపబడిన శ్రీ బెనగల్ నరసింహారావు (B.N.RAU) రాజ్యాంగపు మొదటి ముసాయిదాను ఫిబ్రవరి 1948లో తయారుచేశారు. (1947లో శ్రీ బి.యన్.రావు, బర్మా (ప్రస్తుతపు మయన్మార్) రాజ్యాంగాన్ని తయారు చేశారు) దీనిని రాజ్యాంగ శాసనసభ, ప్రథమ పఠనం(FIRST READING)గా స్వీకరించింది. దీనిపై చర్చ 1948 అక్టోబరు 4, 9 తేదీల్లో తేదీల్లో జరిగింది. శ్రీ.బి.యన్.రావు గారు సమర్పించిన ముసాయిదాలో పీఠిక తీలా ఇవ్వబడింది. "భారతీయులమైన మేము, సమష్టి శ్రేయస్సు (COMMON GOOD)ను పెంపు చేయడానికి, మా ద్వారా ఎన్నుకోబడిన రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ మాకు మేము అందజేసుకుంటున్నాము". బాధ్యత అప్పగించిన నెలలోపే శ్రీ.బి.యన్.రావు ముసాయిదాను తయారు చేశారు.

16.10.1948న ద్వితీయ పఠనాన్ని స్వీకరించారు. ఈ సభలో రాజ్యాంగ కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తాను, ఇతర సభ్యులు సర్వశ్రీ కె.యమ్.మున్షీ, మహమ్మద్ సాదుల్లా, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్. గోపాలస్వామి అయ్యంగార్, యన్.మాధవరావు(అనారోగ్యం కారణంగా రాజీనామా చేసిన బి.యన్. మిత్తర్ స్థానంలో) టి.టి.కృష్ణమాచారి(1948లో కీర్తిశేషులైన డి.పి. ఖైతాన్ స్థానంలో) కలిసి తయారు చేసిన రాజ్యాంగ ముసాయిదాను ప్రవేశపెట్టారు. ద్వితీయ పఠనంపై చర్చ 16.10.1948న ప్రారంభమైనది. ఇందులో ముసాయిదాను భాగభాగాలుగా (CLAUSE BY CLAUSE) సభ్యులు చర్చించారు. ఈ సభ ఆరంభంలో ఒక సభ్యుడు రాజ్యాంగ ప్రామాణిక ముసాయిదా ఇంకా పూర్తిగా తయారుకాలేదు కాబట్టి పీఠికకు సంబంధించిన చర్చను తృతీయ పఠనంకు వాయిదా వేయాలని సూచించాడు. ప్రముఖ ఉర్దూ కవి, ఇన్‌క్విలాబ్ జిందాబాద్ అన్న నినాదాన్నిచ్చిన కాంగ్రెస్ సభ్యుడు శ్రీ మౌలానా హసరత్ మోహాని, ఆ సభ్యుడి ప్రతిపాదనను తీవ్రంగా ఖండించాడు. మౌలానా హసరత్ మోహానీను ఎప్పుడూ సమర్థించని శ్రీ కే.యమ్.మున్షీ లేచి నిలబడి "జీవితంలో ఒకసారి నేను మౌలానా హసరత్ మోహానీని సమర్థిస్తున్నాను" అని అన్నారు. రాజ్యాంగ శాసనసభ అధ్యక్షుడు డాక్టర్‌రాజేంద్ర ప్రసాద్ కూడా శ్రీ మౌలానా హసరత్ మోహానీను సమర్థించారు. అంతటితో వాయిదా ప్రతిపాదన వీగి పోయింది. చర్చ ప్రారంభంలో రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ అంబేద్కర్ ముసాయిదా పీఠికను ప్రవేశపెట్టారు. "భారత దేశాన్ని ఒక సార్వభౌమ (SOVEREIGN) ప్రజాస్వామిక

(DEMOCRATIC) గణతంత్ర (REPUBLIC) దేశంగా పరిగణించాలని భారతీయులమైన మేము సత్యనిష్ఠాత్మకంగా (SOLENNLY) తీర్మానించుకుంటున్నాము." అంబేద్కర్ ఈ ప్రస్తావనను శ్రీమౌలానా హసరత్ మోహాని ప్రతిఘటించారు.

22-01-1947న ఆమోదింపబడిన ఆబ్జెక్టివ్ రెసెల్యూషన్ (OBJECTIVE RESOLUTION)ను ప్రస్తావిస్తూ అందులో స్వతంత్ర (INDEPENDENT) సార్వభౌమ అధికారం (SOVEREIGN) గణతంత్ర (REPUBLIC) అన్న అతి ముఖ్యమైన మాటలున్నాయి. కాని రాజ్యాంగ నిర్మాణ కమిటీ సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రను మాత్రం వాడింది. బహుశా వారి దృష్టిలో సార్వభౌమ అన్నమాటలోనే స్వతంత్ర అన్న అర్థం ఉన్నందువల్ల వారు దానిని వదిలి వేశారనుకుంటానని మోహానీ తమ సవరణగా మూడు వాక్యాలను సూచించారు.

**సార్వభౌమ, స్వతంత్ర, గణతంత్ర(రాజ్యం) - సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర - సార్వభౌమ ప్రజాస్వామ్య ప్రభుత్వం**

వాదోపవాదాలను విన్న తరువాత సర్వ సమ్మతితో సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర (రాజ్యం) వాక్యాన్ని స్వీకరించడం జరిగింది. 1949 అక్టోబరు నెల 17వ తారీఖున రాజ్యాంగపు పీఠిక పరమైన చర్చను ప్రారంభిస్తూ : మన రాజ్యాంగపు పీఠిక దేవుడి పేరుతో (IN THE NEME OF GOD) ప్రారంభం కావాలని హెచ్.వి.కామత్ తమ సవరణను ప్రవేశపెట్టారు. శ్రీ శిబ్బిన్ లాల్ సక్సేనా (SHBBAN LAL SAKSENA) పండిట్ గోవింద మాలవ్యాలు హెచ్.వి.కామత్ గారిని సమర్థించారు. తమ వాదనను కొనసాగిస్తూ శ్రీ శిబ్బన్ లాట్ సక్సేనా ఐరిష్ రాజ్యాంగం దేవుడి పేరుతోనే మొదలవుతుందని చెప్పారు. అధ్యక్షుడు కోరగా తమ సవరణను-దేవుడి పేరుతో-వాపసు తీసుకొన్నారు. బీహరు నుండి ఎన్నుకోబడిన శ్రీ గుప్తనాథ్ సింగ్ (GUPTHA NATH SING) చర్చలో పాల్గొంటూ: "దేశము, అన్ని దేవుళ్ళకంటే గొప్పది. దేశము దేవుళ్లకే దేవుడులాంటిది. దేశము ప్రజల ప్రతినిధి అన్నప్పుడు దాని అర్థం అది దేవుడే అని సూచిస్తుంది." అన్నారు. దేవుడి పేరు పీఠికలో చేర్చడమంటే ఏదో ఒక మత విశ్వాసాన్ని ప్రోత్సహించడమవుతుంది. ఇది ప్రాథమిక హక్కులను(FUNDAMENTAL RIGHTS) ధిక్కరించడం అవుతుందని ఒక సభ్యుడు తన అభిప్రాయాన్ని తెలిపాడు. చాలా గంభీరంగా జరుగుతున్న చర్చ వాతావరణాన్ని చల్లబరచేందుకు అస్సాం నుండి ఎన్నికైన సభ్యుడు రోహిణీ కుమార్ చౌదరి కలుగజేసుకుంటూ అయ్యా! మీరు దేవుడి పేరును చేర్చే పక్షంలో 'దేవత' అన్న మాటను కూడా చేర్చండి. నేను కామాఖ్యాదేవి భక్తుడను అని అన్నాడు. శ్రీమతి పూర్ణిమా బెనర్జీ, హెచ్.వి కామత్ గారిని తమ సవరణను వాపసు తీసుకొమ్మని అభ్యర్థించింది.

మద్రాసు నుండి ఎన్నుకోబడిన శ్రీ వి.యల్.మునిస్వామి పిళ్ళై, హెచ్.వి.కామత్‌ను బలపరచడంతో ఓటు ద్వారా నిర్ణయించవలసిందిగా అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను కోరారు. తప్పనిసరి పరిస్థితులతో ఓటింగు జరిగింది. దేవుడి పేరుకు అనుకూలంగా 41 ఓట్లు ప్రతికూలంగా 68 ఓట్లు పడడంతో, 'దేవుడి పేరుతో'ను పీఠికలో చేర్చకుండా వదిలేశారు.

హెచ్.వి.కామత్ గారు ఎంతో బాధపడ్డారు. సభాధ్యక్షుడితో, అయ్యా ఇది వార్షిక సంఘటనలలో (ANNALS)ని బ్లాక్‌డే. (BLACK DAY) దేవుడు దేశాన్ని రక్షించుగాక అన్నారు. హెచ్.వి. కామత్ గారు దేవుడి పేరుతో మన రాజ్యాంగ పీఠిక మొదలవ్వాలని సవరణను ప్రతిపాదించారు.

శ్రీ శిబ్బన్ లాల్ సక్సేనా శ్రీ గోవింద మాలవ్యాలు మరో అడుగు ముందుకు వేస్తూ రాజ్యాంగ పీఠికలో దేవుడితోపాటు జాతిపిత మహాత్మాగాంధీ గారి పేరు ఉండాలని పట్టుపట్టారు. శ్రీ శిబ్బన్ లాల్ సక్సేనా తన సవరణను ఇలా ప్రవేశపెట్టారు. "సర్వశక్తి సంపన్నుడైన (ALMIGHTY) ఆ భగవంతుడి పేరు తోనూ, ఏ భగవంతుడి ప్రేరణ, మార్గదర్శకత్వంతో తన చింతనమైన అహింసా సత్యాల సిద్ధాంతం ద్వారా బానిసత్వం నుండి, స్వాతంత్ర్యం వైపు దేశాన్ని తీసుకుని వెళ్లాడో ఆ మహాత్మాగాంధీ పేరుతోనూ, లక్షలాది మంది త్యాగధనులు, అమరవీరుల పేరుతోనూ ప్రారంభకావాలని కోరారు.

ఇదే తరహాలో పండిట్ గోవింద మాలవ్యా తన సవరణలో ఇలా పేర్కొన్నారు. "సర్వాధికారి (SUPREME BEING) జగత్ రక్షకుడైన (LORD OF THE UNIVESE) ఆ పరమేశ్వరుడి దయతో, మా భక్తి శ్రద్ధలను సవినయంగా సమర్పించుకుంటూ మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ అనే గొప్ప నాయకుడిని స్మరిస్తూ, దేశ స్వాతంత్ర్యం కోసం.. శ్రమపడిన, పోరాడిన, అనేక బాధలను సహించిన ప్రజలను గుర్తు చేసుకుంటూ, భారతీయులమైన మేము దేవుడి పేరుతో మాటను తొలగించిన తర్వాత గాంధీ గారి పేరును గురించి రాజ్యాంగ శాసన సభలో వాదోపవాదాలు జరిగాయి. బిహారు నుంచి ఎన్నికైన శ్రీ బ్రజేశ్వర ప్రసాద్ శ్రీ శిబ్బన్ లాల్ సక్సేనా ప్రతిపాదనను ఆక్షేపించారు. తమ వాదనను కొనసాగిస్తూ "అయ్యా మన రాజ్యాంగంలో మహాత్మాగాంధీ గారి పేరును చేర్చడానికి నేను ససేమిరా ఒప్పుకోను. కారణం శ్రీ బి.ఆర్.అంబేడ్కర్ గారు ప్రవేశపెట్టిన రాజ్యాంగం అమెరికా వారి సుప్రీంకోర్టు నిర్ణయాల ఆధారంగా, భారత ప్రభుత్వ 1935వ యాక్టును అనుసరించి తయారు చేయబడింది. మన రాజ్యాంగం గాంధీ గారి సిద్ధాంతాల ఆధారంగా తయారు చేయబడి వుంటే దానిని సమర్థించే వారిలో మొదటివాడిగా ఉంటాను. ఇది కుళ్లిన (ROTTEN) రాజ్యాంగం. ఇందులో గాంధీ గారి పేరును లాగడం సముచితం కాదు" అన్నారు.

రాజ్యాంగ శాసనసభ రెండవ పఠనం (SECOND READ-

ING)లో దేవుడు, మహాత్మాగాంధీ తరువాత దేశం పేరుకు సంబంధించిన చర్చ జరిగింది. మౌలానా హసరత్ మోహాని చర్చలో పాల్గొంటూ దేశం పేరు అప్పటి UNION OF SOVIET SOCIALIST REPUBLICS (U.S.S.R) లాగా UNION OF INDIA SOCIALISTIC REPUBLICS (UISR)గా ఉండాలన్నారు. మన రాజ్యాంగం సోవియట్ రష్యా రాజ్యాంగం లాగా ఉండాలని, ఆ రాజ్యాంగం నుండి మనం ప్రేరణను పొందాలని మౌలానా వాదించారు. శ్రీ దేశబంధు గుప్తా గారు మౌలానా ప్రతిపాదనను ఖండించారు. అంతటితో ఆ చర్చ ముగిసింది.

సరిగ్గా అప్పుడే మద్రాసు ప్రెసిడెన్సీ నుండి ఎన్నికైన శ్రీ కల్లూరు సుబ్బారావు లేచి నిలబడి ఋగ్వేదంలో భారత్ అన్న పదం ఉందని తెలిపారు. (సాక్షి, 26-11-2024) భారత్ అన్న మాట ఎంతో విశిష్టమైనదని భావించి సభ్యులు ఇండియా దట్ ఈజ్ భారత్‌ను స్వీకరించారు.

బిహారు నుంచి కాంగ్రెస్ టికెట్‌పై ఎన్నుకోబడిన శ్రీ కె.టి.షా (కుషాల్ తలక్సి). రాజ్యాంగ ముసాయిదాకు క్లాజు వారీగా జరిగిన చర్చలో చాలా చురుకుగా పాల్గొన్నారు. అందరికంటే ముందు రాజ్యాంగ పీఠికలో లౌకిక(SECULAR) అన్నమాటను చేర్చాలని వాదించారు. తమ సవరణను వారు ఇలా ప్రతిపాదించారు. భారత దేశము లౌకిక కేంద్ర (FEDERALIST) సమాజవాద (SOCIALIST) సమితి (UNION) రాజ్యం (STATE) అవుతుంది. ఈ మాటలు పరిపాలనా విధానాన్ని సూచిస్తాయన్నారు. అదేవిధంగా సమాజవాద (SOCIALIST) మాట అందరికి సమన్యాయం సమ అవకాశాలను తెలియబరుస్తుందన్నారు. శ్రీ బ్రజేశ్వర్ ప్రసాద్ 'సెక్యులర్ అన్న మాటను చేర్చాలన్నారు. దేశం విధానం (POLICY) ఏమై ఉండాలి.

సమాజ ఆర్థిక పక్షపు రూపురేఖలు ఎలా ఉండాలి ? అన్న వాటిని ప్రజలే సమయం, పరిస్థితులకు అనుగుణ్యంగా నిర్ణయించాలి. అంతేకాని వాటిని రాజ్యాంగంలో చేర్చకూడదు. ఆ విధంగా చేయడం అన్నది ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడం అవుతుందని రాజ్యాంగ నిర్మాణ కమిటీ అధ్యక్షుడైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. సమాజవాద సంస్థకన్నా మెరుగైన సామాజిక సంస్థను ప్రజలే ఏర్పరుచుకోగలరని కూడా అన్నారు. హెచ్.వి.కామత్ గారు శ్రీ. కే.టి.షా ప్రతిపాదనను ప్రతిఘటించారు. మత సహనం భారతీయుల జీవనశైలిలో ఒక అంతర్భాగం. ఆకారణంగా లౌకిక (SECULAR) అన్నమాటను పీఠికలో చేర్చరాదని మన దేశపు తొలి ప్రధానమంత్రి భావించారు. కాని, అత్యవసర పరిస్థితి (EMERGENCY)ని విధించి 42వ సవరణ ఆక్ట్ 1976 ద్వారా సామ్యవాద (SOCIALIST) లౌకిక (SECULAR) నైతిక నిష్ఠ(INTEGRITY) అన్న మాటలను పీఠికలో శ్రీమతి ఇందిరాగాంధి చేర్చారు. ఆనాటి సుప్రీంకోర్టు అత్యంత సీనియర్ జడ్జి జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా 1976లో ఎమర్జన్సీకి తమ అసమ్మతిని తెలియజేసిన ఏకైక వ్యక్తి (ADM JABALPUR V SHIV KANY SHUKLA CASE DURING 1975-1977) ఆ కారణంగా అతనికి దక్కవలసిన చీఫ్ జస్టిస్ పదవి దక్కలేదు. (ప్రస్తుత సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ జిస్టిస్ హన్స్ రాజ్ ఖన్నా సోదరుడి పుత్రుడు) రాష్ట్ర ప్రభుత్వాలు - గుజరాత్ జమ్మూకాశ్మీర్, తమిళనాడు ఆనాటి కేంద్ర పాలిత ప్రభుత్వాలు మేఘలయా, నాగాల్యాండ్‌లు తమ శాసనసభలలో ఆమోదాన్ని తెలియబరచలేదు. అత్యవసర పరిస్థితి తర్వాత మొరార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో పీఠికలో చేర్చబడిన మాటలను తొలగించాలన్న ప్రతిపాదనను తీసుకువచ్చారు. కాని, ఎగువ సభలో తమ పార్టీకు ఆధిక్యం లేకపోవడం వల్ల అది జరగలేదు 250 మంది సభ్యులున్న ఎగువ సభలో అప్పుడు కాంగ్రెస్ పార్టీకు 163 మంది సభ్యులుండడం వల్ల ఆ బిల్లు పాసు కాలేదు. తర్వాతి ప్రధాని శ్రీ వీపీ సింగ్ కూడా కూడా ప్రయత్నించారు. అప్పుడు పూర్తిగా కుదరలేదు. రాజ్యాంగం 43, 44వ సవరణల ద్వారా కొంత సఫలతను సాధించడమైనది. పండిత్ లక్ష్మీకాంత మిశ్రా ముసాయిదాలో వాడబడిన యూనియన్ ఆఫ్ స్టేట్స్‌ను గురించి చర్చిస్తూ రాజ్యాంగ సాహిత్యంలో స్టేట్ అన్నమాటలో సార్వభౌమత్వమూ, స్వాతంత్రమూ అన్న అర్థాలున్నాయి. ప్రావిన్స్ (PROVINCES) ప్రదేశ్, దేశం అన్న మాటలు గందర గోళాన్ని సూచిస్తాయన్నారు. శ్రీ జవహర్ లాల్ నెహ్రూ గారు కలగజేసుకుని ప్రాంతాలు (PROVINCES) ప్రదేశ్ ఈ రెండూ స్టేట్స్(రాష్ట్రాలను)ను సూచిస్తాయన్నారు. దీంతో స్టేట్స్‌కు బదులుగా ప్రావిన్స్ లేదా ప్రదేశ్ అన్న మాటను పండిత్ లక్ష్మీ కాంత మిశ్రా ఉపసంహరించుకున్నారు.

కేశవానంద భారతి కేసులోను, ఎల్.ఐ.సి. ఇండియా కేసులోను, బొమ్మాయి కేసులోను తమ సంచలనాత్మక తీర్పులలో రాజ్యాంగపు పీఠిక రాజ్యాంగపు అంతర్భాగం అని సుప్రీంకోర్టు నొక్కి వక్కాణించింది. దేశపు అత్యున్నత అధికారాన్ని రాజ్యాంగంగా పరిగణించవచ్చు. దేశపు సుపరిపాలనకు కావలసిన నియమాలను రాజ్యాంగంలో క్రోడీకరించడం జరుగుతుంది. మన రాజ్యాంగం యునైటెడ్ కింగ్‌డమ్ రాజ్యాంగంలా అలిఖితమైనది కాదు.

మనది లిఖిత రాజ్యాంగం. మన రాజ్యాంగం ప్రపంచపు లిఖిత రాజ్యాంగాలలో అది సుదీర్ఘమైనది (LENGTHIEST). మన రాజ్యాంగపు పీఠికలోని తొలివాక్యం We the people of India అతిసార గర్భిత వాక్యం. ఈ వాక్యం ప్రత్యేక తను లేదా గొప్పతనాన్ని శ్లాఘిస్తూ.. మాటల గొప్పతనాన్ని శ్లాఘిస్తూ ప్రముఖ న్యాయవాది కీర్తిశేషులు నానీ పాల్కీవాలా యిలా అన్నారు it is a power of attorney given by freedom, not a charter of freedom given by power. ❑


పుస్తక పరిచయం

# మాటలకు లోతూ, చూపులకు వైశాల్యమూ సంతరించే రచన

- కల్లూరి భాస్కరం,
ప్రముఖ సాహిత్య విమర్శకులు



**ఇటీవల వెలువడిన వాడ్రేవు చినవీరభద్రుడు గారి 'ఉదారచరితులు-వారిది వసుధైక కుటుంబం' పుస్తకం చదవడం నాకొక గొప్ప అనుభవం. అందులో నన్ను నేను దర్శించుకుంటున్నట్టే కాక, ఎన్నో కొత్త ఆలోచనలను దర్శించుకుంటున్న అనుభూతి కలిగింది. అవడానికి అది కేవలం 184 పేజీల పుస్తకమే. కానీ అందులోని విషయానికున్న బరువుతోనే తప్ప పేజీల సంఖ్యతో కొలవాల్సిన పుస్తకం కాదు.**




మనం చూసే చూపులు, మనకు కలిగే ఆలోచనలు, మనం మాట్లాడే మాటలు, రాసే రాతలు రకరకాల అంతరవుల తేడాతో ఉంటాయి. కొన్ని కొన్ని మాటలనూ, కొన్ని కొన్ని రాతలనే తీసుకుంటే, అవి నాలుక చివరి నుంచి, కలం చివరి నుంచి లేదా ల్యాప్‌టాప్ కీబోర్డు మీద ఆడే వేలి కొసల నుంచి జాలు వారుతూ ఉంటాయి. అలాంటివి ఎన్ని వందల పేజీలకు విస్తరించినా విషయపరంగా వాటి బరువు పెరగదు. కానీ కొన్ని మాటలూ, కొన్ని రాతల పంక్తుల మధ్యలో మన కంటికి కనిపించని లోతూ, వైశాల్యమూ వ్యాపించి ఉండి పుస్తకం బరువు పెంచుతూ ఉంటాయి. 'ఉదారచరితులు' పుస్తకం అటువంటిది.



మన చూపులకూ, ఆలోచనలకూ కూడా ఇదే వర్తిస్తుంది. ప్రజలూ, సమాజం, రాజకీయాలు, సంస్కృతి, సాహిత్యం, చరిత్ర - దేని గురించైనా కానీ, వర్తమానానికి, మన ప్రాంతానికి, దేశానికి పరిమితమయ్యే మేరకే మన చూపులను, ఆలోచనలను కుంచించుకుంటాం. ఆ చూపుకు అందిన మేరకే వ్యాఖ్యానిస్తాం. అలాకాకుండా, వర్తమానపు గాథత నుంచి గతపు లోతుల్లోకి వెళ్లి ఆ తర్వాత భవిష్యత్తులో తేరి చూడడం ద్వారా మూడు కాలాలనూ ముడివేయగల వైశాల్యాన్ని మన చూపులు, ఆలోచనలు, అవగాహన సంతరించుకున్నప్పుడు మాటే మంత్రమూ, వాక్యమే గొప్ప సందేశాత్మకమూ అవుతాయి. నాలుక చివరి మాటలకూ, వేలికొసల నుంచి జాలువారే రాతలకూ ఉన్న తేడా అర్థమవుతుంది. ఈ పుస్తకంలో అలాంటి త్రికాలదర్శనాన్ని ఆవిష్కరించే దార్శనికత కనిపిస్తుంది.

ఇంకొంచెం అర్థమయ్యేలా చెప్పాలంటే, మన చూపులను, ఆలోచనలను కుంచించుకోవడం దేశ భక్తిగా, జాతీయతా స్ఫూర్తిగా భావించి ఆరాధించడం ఇప్పుడు పరిపాటి అయింది. జన్మనిచ్చిన తల్లిదండ్రుల మీద ఎంత భక్తి, గౌరవం, ప్రేమ ఉంటాయో పుట్టి పెరిగిన గడ్డ మీద కూడా అంతే ఉంటాయి; అది ప్రాకృతిక ధర్మం. కానీ ఇప్పుడు 'దేశభక్తి' అనే మాట, దేశాన్ని ఒక భౌతిక వాస్తవంగా కొన్ని సరిహద్దుల మధ్య ఊహించుకోవడంతో జతపడి ప్రాచుర్యంలోకి వచ్చింది. అలా చూపులకు, ఆలోచనలకు, అవగాహనకు సరిహద్దులు గీసుకోవడం ఒక ఆదర్శంగా పరిణమించింది. చారిత్రకంగా జాతీయ రాజ్యభావన నుంచి పెంపొందిన ఆదర్శం అది.

కానీ ఈ పుస్తకం ఏం చేస్తుందంటే, మన చూపులను, ఆలోచనలను, అవగాహననూ దేశాల సరిహద్దులను దాటించి,

దేశాల స్థానంలో, వాటికి ఉనికిచ్చిన మనిషిని ఆవిష్కరిస్తుంది. మనిషి ప్రాతిపదికగా కొత్త సరిహద్దులు గీసి చూపడానికి ప్రయత్నిస్తుంది. అవడానికి రచయిత ఇందులోని విషయాన్ని 'అంతర్జాతీయ రంగం', 'జాతీయ రంగం', 'తెలుగు సమాజం', 'చరిత్ర, పురాణాలు, సామాజిక గమనం', చివరిగా – 'మరో రెండు మాటలు' అనే శీర్షికలతో ఆరు విభాగాలు చేసినా వాటన్నిటిలో ఏకసూత్రంగా మనిషీ, అతణ్ణి మనిషిని చేసే లక్షణాలు, అతని ఔన్నత్యాలు, అతను పూరించుకోవలసిన కొరతలే ఇతరేతర హద్దులకు అతీతంగా ప్రధాన భూమిక వహిస్తూ ఉంటాయి. ఆ విధంగా ప్రతి వాక్యమూ, ప్రతి వ్యాఖ్యా త్రికాలవ్యాప్తమైన లోతునూ, వైశాల్యాన్నీ సంతరించుకుని ఉంటాయి.

'అంతర్జాతీయ రంగం' అనే విభాగంలోని తొలి రెండు వ్యాసాలలో 2015లో నోబెల్ పురస్కారాన్ని అందుకున్న రష్యన్ రచయిత్రి స్వెత్లానా అలెగ్జీవిచ్ గురించి రాస్తారు. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియెట్ యుద్ధం మిగిల్చిన చేదు అనుభవాలకు, 1986లో చెర్నోబిల్‌లో సంభవించిన అణు ప్రమాద బాధితుల గాథలకు ఆమె అక్షర రూపమిచ్చింది. మానవ విషాదాన్నే తన ప్రధాన ఇతివృత్తం చేసుకుంది. బాధితుల మధ్యకు వెళ్లి వాళ్లతో మాట్లాడి చేసిన ఇలాంటి రచనల స్వభావం గురించి కూడా రచయిత చర్చిస్తారు. ఈ ప్రక్రియను కేవలం జర్నలిజంగా భావించలేం అంటారు. దీనిని 'సమష్టి నవల'గా, 'వక్తృత్వ నవల'గా, 'సాక్ష్య రచన'గా, 'ఐతిహాసిక బృందగానం'గా రచయిత్రి పేర్కొనడాన్ని ఉదహరిస్తూ, ప్రక్రియపరంగా ఇంకొక లోతైన, ఆసక్తికరమైన వ్యాఖ్యను ఉటంకిస్తారు. సోవియెట్ రచయితల దృష్టి ఎంతసేపూ బ్రహ్మాండమైన పురాణాలు నిర్మించడం మీదే ఉంటే, బెలో రష్యన్ రచయితలు, సినిమా దర్శకులు చిన్న చిన్న మనుషులను, వాళ్ల అనుభవాలను చిత్రించడం కోసమే ఎక్కువ తహతహలాడతారట. స్వెత్లానాకు నోబెల్ రావడం నుంచి రచయితలు, ముఖ్యంగా తెలుగు సాహిత్యం తెలుసుకోవలసింది ఏమైనా ఉందా ? అని ప్రశ్నించి; నేటి కాలంలో రచయిత ఇంకెంత మాత్రం ఒంటరిగా కూర్చుని రచనలు చేస్తూ ఉండడంలో అర్థం లేదని, నేటి సాహిత్య ప్రక్రియలు సామూహిక ప్రక్రియలూ, సమష్టి ప్రక్రియలూ అంటూ రచయిత తనే సమాధానమిస్తారు. రైతుల ఆత్మహత్యలు సహా మన చుట్టూ సంభవిస్తున్న విషాదాలు చెర్నోబిల్ దుర్ఘటన లాంటివేనని, వాటి బాధితుల సామూహిక రోదనలకు అక్షర రూపం ఇవ్వడానికి మన నుంచి ఒక స్వెత్లానా రావడానికి ఇంతకన్నా చారిత్రక సందర్భం ఏముంటుందని ప్రశ్నిస్తూ మనిషిని, అతని దుఃఖాన్ని చూపుల నిండా నింపుకుని వాటిని దేశాల సరిహద్దులను దాటించవలసిన అవసరాన్ని ఉద్బోధిస్తారు.

**కొన్ని తళుకులూ, కొన్ని తలపులూ**

'నేటి సాహిత్య ప్రక్రియలు సామూహిక ప్రక్రియలు, సమష్టి ప్రక్రియ'లన్న రచయిత మాటలను చూడగానే, సాహిత్యంలో భాగమైన ఆటపాటలు, సామూహిక శ్రమ నుంచి, స్పందన నుంచే పుట్టాయన్న సంగతి గుర్తొచ్చింది. సామాజిక అంతరాలు పెరుగుతూ వ్యక్తి సమూహం నుంచి వేరు పడే క్రమంలోనే ఆట పాటలతో సహా సాహిత్యం వైయక్తికమవుతూవచ్చింది. ఇప్పుడు మళ్లీ దానిని తలకిందులు చేస్తూ సాహిత్యం ప్రజాపరమూ, సామూహిక నిర్మాణమూ అయిన, అవుతున్న క్రమానికి స్వెత్లానా అలెగ్జీవిచ్ రచనలు అద్దం పడుతున్నాయన్న అన్వయానికి ఇది అవకాశమిచ్చింది.

అలాగే బెన్ ఒక్రి అనే ఆఫ్రికా రచయిత గురించిన ప్రారంభవాక్యాలు నా ఊహను ఒక్కసారిగా తటిల్లున మెరిపించాయి. పాశ్చాత్య రచయితలను, ముఖ్యంగా ఐరోపా రచయితలను చదువుతుంటే ఒక సెమినార్ హాల్లో ఒక మేధావితోనో, తాత్వికుడితోనో గంభీరమైన విషయాల గురించి మాట్లాడుతున్నట్టు ఉంటుందని, కానీ ఆఫ్రికా రచయితలను చదువుతుంటే మన గ్రామాలకు వెళ్లి, అక్కడి మట్టి అరుగుల మీద కూర్చుని, ఆ గ్రామ వృద్ధులో, రైతులో, అక్కడి ముంగిళ్లలో గృహిణులో చెప్పే సుద్దులు విన్నట్టుంటుందని రచయిత అంటారు.

ఆఫ్రికా మూలాలున్న 'రూట్స్ నవలా రచయిత ఎలెక్స్ హేలీ అనుభవం కూడా అలాంటిదే. అతను ఆఫ్రికాలో తనకు ఆరు తరాల వెనకటి పూర్వీకులు జీవించిన గ్రామానికి వెళ్లి కెబ్బా కంజీ పొఫానా అనే వృద్ధ గాథికుడు తన వంశ చరిత్రను గానం చేస్తుండగా వింటాడు. ఆ ఉదంతాన్ని నేపథ్యంగా తీసుకుని గాథిక సంప్రదాయంలో ఆఫ్రికాకూ, మనకేకాక, ఇతర సాంప్రదాయిక సమాజాలకు వున్న పోలికల గురించి ; మన వ్యాస వాల్మీకులతోనూ, సూతుడితోనూ కెబ్బా కంజీ పొఫానాకు ఉన్న సామ్యాల గురించి నా 'మంత్ర కవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే' అనే పుస్తకంలో పొందుపరచిన వ్యాస భాగాలు – పై వాక్యాలు చదివినప్పుడు చటుక్కున కళ్ల ముందు మెదిలాయి.

రచయిత పొందుపరిచిన బెన్ ఒక్రి ఆలోచనల్లోకి తొంగి చూసినప్పుడు వలస పాలనకన్నా కూడా చాలా వెనకటి నుంచి భారత్, ఆఫ్రికా సహా సాంప్రదాయిక సమాజాల మధ్య ఉన్న సామ్యాలే స్ఫురించాయి. నిజానికి మనకు రాజకీయాలకన్నా కవిత్వమే ఎక్కువ సన్నిహితమనీ, అసలు మనం పుట్టడంలోనే శ్వాసించడంతోపాటు కవిత్వం ఉందనీ అంటాడాయన. ఆధునికతకు ముందు ప్రపంచవ్యాప్తంగా వేల సంవత్సరాల మానవానుభవంలోని ఒక పార్శ్వాన్ని ఎత్తిచూపే మాటలివి.

రచయితలు పతనమైనప్పుడే జాతులు పతనమవుతాయని, ఒక జాతి అవ్యక్తసత్వానికి, ఒక దేశ జీవ స్ఫూర్తికి ఆ జాతి రచయితలే ప్రతినిధులంటాడు బెన్ ఒక్రి. ఇలా చారిత్రకపు లోతుల్లోంచి, చూపుల వైశాల్యంలో నుంచి చూసి ఎవరికి వారు

వర్తమానానికి అన్వయించుకోవాల్సిన దిక్సూచికలు, ఉటంకింపులు ఈ పుస్తకమంతటా కనిపిస్తాయి.

కెన్యా రచయిత గూగి వా థియాంగో గురించి రాస్తూ, గ్లోబలైజేషన్ యుగంలో పోస్ట్ మాడర్న్ బహుళతా వాదం బలపడ్డాక, వివిధ ప్రాంతాలు, కులాలు, భాషలు తమ అస్తిత్వాన్ని ప్రకటించుకోవడం మొదలు పెట్టాక, వాటిని ఏ విధంగా తమ ఆశయాలతో సమన్వయపరచుకోవాలో మన రచయితలకు అర్థం కాలేదని, ప్రధానంగా మనవాళ్లు పందొమ్మిదో శతాబ్ది భాషలోనే ఆలోచించడానికి అలవాటుపడ్డారని, ఆ సమన్వయం గూగిలో కనిపిస్తుందని రచయిత అంటారు. చరిత్ర లోతుల్లోంచి మన లోపాలను గమనించుకోవడం వైపు ఒక్కసారిగా మన ఆలోచనలను మళ్లించే వ్యాఖ్యలలో ఇదొకటి.

అంతకన్నా కీలకంగా ఆ వ్యాసంలోనే ఒక వ్యాఖ్య నేరుగా మనల్ని వర్తమానంలోకి తీసుకొస్తుంది : 'వలసవాదం రోజుల్లో భారతీయ మధ్య తరగతి వలసవాద సాధనాలైన యూనివర్సిటీలు, రైళ్లు, పత్రికలు, తంతి తపాలాలను వాడుకునే ప్రజలను కార్యోన్ముఖులను చేసింది. ఇప్పుడు కొత్త వలస పాలన రోజుల్లో, మునపటికన్నా శక్తిమంతమైన ప్రచారసాధనాలు తన చేతుల్లోకి వచ్చిన ఈ తరుణంలో భారతీయ మధ్య తరగతి ఆ సాధనాల్ని వినోదానికి, కాలక్షేపానికి, ఇంకా చెప్పాలంటే ద్వేష వ్యాప్తికి వాడుకుంటూ ఉందని' అంటారాయన. నేటి మన దైనందిన అనుభవంలో ప్రత్యక్షంగా చూస్తున్న పరిణామం ఇది. ఈ విషయంలో మనకు, ఆఫ్రికాకూ కొంత మేరకు సామ్యం కుదురుతోందేమో! ఎందుకంటే, గూగి కూడా ఇటువంటి మధ్యతరగతిని ఉద్దేశించే మాట్లాడతాడు.

ఇరవై రెండేళ్ల స్వీడిష్ అమ్మాయి, పర్యావరణ ఉద్యమకారిణి గ్రేటా థున్ బెర్గ్ గురించి రాసినా ; నెల్సన్ మండేలా గురించి చెప్పినా, తొలి తరం పురాతత్వ శాస్త్రవేత్త హైన్రిశ్ ష్లీమన్ గురించి మాట్లాడినా స్థల కాలాల హద్దులకు అతీతంగా మనిషిని ప్రపంచమనే ఉమ్మడి వేదిక మీద ప్రతిష్ఠిస్తూనే వర్తమానాన్ని వ్యాఖ్యానించడం ఈ పుస్తకంలో అంతస్సూత్రంగా వ్యాపించి కనిపిస్తుంది. పర్యావరణ పరిరక్షణ అనే ఉమ్మడి లక్ష్యం కోసం పోరాడుతున్న గ్రేటా థున్ బెర్గ్ అచ్చం మన అమ్మాయిలానూ, జీవితాంతం హోమర్‌ను ఆరాధిస్తూనే గడిపిన ష్లీమన్ మన పాతకాలపు పండితుల్లానూ మన మనసుకు దగ్గరవుతారు.

నెల్సన్ మండేలా, మన పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాంల గురించిన ఇందులోని వ్యాసాలు వారి అపురూపపార్శ్వాలను చూపించి చూపుల్ని జిగేలు మనిపిస్తాయి; వారి వ్యక్తిత్వాల ఎత్తును ఎన్నో అడుగుల మేరకు పెంచి చూపిస్తాయి. మండేలాపై రాపోలు సీతారామరాజు రచించిన 'మెలకువలో కన్న కల' అనే పుస్తకాన్ని ఆధారం చేసుకుని రాసిన వ్యాసంలో మండేలా కేవలం దీర్ఘకాలం జైలు శిక్ష అనుభవించిన ఒక ఉద్యమకారుడిగా, ఆ తర్వాత దేశాధినేత అయిన ఒక పాలకుడిగా మాత్రమే కనిపించడు; తనంత వరకూ నమ్మిన మానవీయమైన విలువల నుంచి తను ఏ మాత్రమైనా పక్కకు జరుగుతున్నానా అని నిరంతరం ఆత్మశోధన చేసుకుంటూ, అంతరంగాన్ని శుభ్రపరచుకునే ఒక మహోదాత్త మానవుడిగా కనిపిస్తాడు. అలాగే అబ్దుల్ కలాం గురించిన వ్యాసాలు కూడా, ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను బంధుమిత్రుల కోసం ఎట్టి పరిస్థితులలోనూ వాడుకోకూడదన్న సూత్రాన్ని ఆయన జీవితాంతమూ త్రికరణశుద్ధిగా పాటించడం గురించి ; తన దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తిని ప్రోత్సహించి చదివించి ఉన్నత విద్యావంతుని చేయడం గురించి చెబుతాయి.

వీరి గురించిన నా దృష్టిలోని ఒక కొరతనూ, నా ఆలోచనల్లోని ఒక వెలితిని ఈ వ్యాసాలు పూరిస్తున్నట్టు నాకు అనిపించింది. వీరిద్దరిని ఒక పత్రికా రచయితగా, వృత్తిపరమైన పరిమితుల్లో మాత్రమే నేను చూస్తూ వచ్చాను; వారి వ్యక్తిత్వాల్లోకి తొంగి చూసే అవసరమూ, అవకాశమూ కలగలేదు. కలాం విషయమే తీసుకుంటే, రాష్ట్రపతిగా ఆయనను రాజకీయ, పాలనా వ్యవస్థలో భాగంగా చూడడమే తప్ప వ్యక్తిగత పార్శ్వంలోకి తలదూర్చలేదు. దీనిని వృత్తిరీత్యా సంక్రమించిన ఒక దృష్టి భేదమని అనుకోవచ్చు. కానీ వీరభద్రుడి గారి చూపు వేరు, బాహ్యమైన వాటినన్నిటిని పక్కకు తప్పిస్తూ వ్యక్తి లోపలికి చూసే చూపు అది. ఉదాత్త వ్యక్తిత్వాలను చూసి పరవశించడమే కాదు, ఒక్కోసారి కన్నీళ్లు పెట్టే చూపు కూడా. ఆ విధంగా అది ఇతరుల చూపు లోపాన్ని, లేదా కొరతను పూరించేది కూడా.

### రాజకీయాల్లో ఉన్నప్రతి ఒకరికీ ఒక సవాలు

ఆయనేమంటారంటే.. ఒక పీడక, పీడిత వైరివర్గంలో పీడకులను పీడితులు భౌతికంగా నిర్మూలించాక, ఆ చిట్టచివరి జార్ కూడా మరణించాక, అప్పుడు ఆ మొట్టమొదటి బోల్షివిక్కు తనే ఒక జార్‌గా మారతాడని ! నువ్వు నీలో ఉన్న జార్‌ను నిర్మూలించనంత వరకూ బయటి జార్లను ఎంత మందిని నువ్వు వధించినా లాభం లేదని రష్యా-ఉక్రెయిన్ యుద్ధం చెబుతోందంటారు. దీనినొక పారడాక్స్‌గా, విషమ ప్రహేళికగా ఎత్తిచూపుతూ, ఏ అసమానతా నిర్మూలన కోసం underprivileged రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తారో, ఆ రాజ్యాధికారం సిద్ధించగానే వాళ్లల్లో ఒక చిన్నభాగం privilegedగా మారిపోతారని, అంతదాకా విమోచనశీలాన్ని కనబరచిన ఆ సమూహం అప్పణ్ణించి ఆధిపత్య ధోరణిని సంతరించుకుంటుందని, తనే రాజ్యంగా మారిపోతుందని అంటారు. రాజ్యాధికారం స్వభావతః privileged కాబట్టి, పాలనాధికారం పొందిన ప్రతివాడూ పాలకుడుగానే ప్రవర్తిస్తాడు

కనుక underprivilegedకి ఎప్పటికీ రాజ్యాధికారం సిద్ధించదంటారు. చివరిగా, పాలక స్వభావాన్ని సంతరించుకోని పాలకుడి కోసమే తను మూడు దశాబ్దాలుగా అన్వేషిస్తున్నానని అంటారు. ఇది మధ్యేవాదపక్షాలు, వామపక్షాలు, రాజ్యాధికారాన్ని కోరుకునే దళిత, బహుజన వర్గాలతో సహా రాజకీయ సామాజిక క్షేత్రాలలో పనిచేసే ప్రతి వారికీ ఒక సవాలు విసురుతున్న వ్యాఖ్య.

నన్ను నేను పునర్దర్శించుకోడానికి, మరింతగా కనెక్ట్ చేసుకోడానికి అవకాశమిచ్చి ఆశ్చర్యచకితం చేసినవి వీరభద్రుడు గారి పుస్తకంలో మరికొన్ని ఉన్నాయి. వాటిలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ గురించి రాసినవి ఒకటి. Indian Pilgrim అనే సుభాస్ స్వీయచరిత్ర గురించి రాస్తూ; ఆయనా, అల్లూరి సీతారామరాజూ 1897లోనే జన్మించారని, ఇద్దరి జీవితాల మధ్యా చాలా పోలికలు వున్నాయని, ఆయన మృతి చెందారని నమ్మని వారు ఇప్పటికీ ఉన్నారని, తనూ అంతేనని రచయిత అంటారు. విచిత్రమేమిటంటే, అల్లూరి సీతారామరాజు విషయంలోను అదే జరిగింది. ఆయన మరణించినట్టు నమ్మని వారూ గతంలో ఉండేవారు. అప్పట్లో పాపికొండల్లోని పేరంటపల్లిలో ఆశ్రమం కట్టుకుని జీవించిన బాలానందస్వామి అనే ఆయనను సీతారామరాజుగా చెప్పుకోవడం విన్నాను. సుభాస్‌బోస్, సీతారామరాజుల మధ్య ఉన్న ఇలాంటి పోలికలను పొడిగిస్తూ, అలాంటివి మరికొన్ని జోడిస్తూ, వాటి వెనుక ఉన్న దృష్టి కోణాన్ని వివరిస్తూ 'వీరుడు మరణించడు' శీర్షికతో నా 'మంత్రకవాటం తెరిస్తే మహాభారతం మనచరిత్రే'లో రాశాను.

సుభాస్ బోస్ తనను Indian Pilgrim ఎందుకు పిలుచుకున్నాడో ఆ పుస్తకం చదువుతుంటే అర్థమవుతుందని, ప్రాయకంగా ఆయన ఒక ఆత్మాన్వేషకుడని, యోగి కావాలని తపించాడని, ప్రాపంచికబంధాల్లో కూరుకుపోకుండా జీవిత సత్యాన్ని దర్శించడానికి తపించాడని అర్థమవుతుందంటారు. రాజ్‌మోహన్ గాంధీ రచించిన అత్యంత పరిశోధనాత్మకమూ, పఠనీయమూ అయిన గాంధీ జీవిత చరిత్ర 'మోహన్ దాస్‌'ను అనువదించినవాడిగా స్వాతంత్ర్యోద్యమఘట్టంలో సుభాస్ నిర్వహించిన పాత్రపై నాకు కొంత అవగాహన ఉంది. కానీ, పై వివరం నా దృష్టికి రాలేదు. దాంతో యోగి, ఆత్మాన్వేషీ కావాలని సుభాస్ అనుకోవడం వెనుక ఈ దేశానికి చెందిన ఒక చారిత్రక విశేషం ఉన్నట్టు నాకు స్ఫురించింది.

మన దేశం దీర్ఘకాలంపాటు స్వపరిపాలనలో కాని, ఒక కేంద్రీయమైన పాలనలో కాని లేకపోవడం వల్లా; అంతకు ముందు దేశం అనేక రాజ్యాల రూపంలో రాచరిక వ్యవస్థలో ఉండడం వల్లా యువతతో సహా చాలా మందికి రాజకీయంగా, పరిపాలనాపరంగా నిర్వహించవలసిన పాత్ర ఏదీ లేకపోవడం సహజమే. అందువల్ల ఆధ్యాత్మిక రంగమే వాళ్లకు ఏకైక కార్యక్షేత్రంగా పరిణమించి ఉండవచ్చు. బ్రిటిష్ ఏలుబడిలో మొదలైన స్వాతంత్ర్యోద్యమ ఘట్టంలోనే వాళ్లు పెద్ద ఎత్తున రాజకీయ కార్యక్షేత్రంలోకి అడుగుపెట్టే అవకాశం చిక్కింది. అయినా దానికి సమాంతరమైన ఒక పాయగా అధ్యాత్మిక దృష్టి కొనసాగుతూ ఉందనుకోవాలి. వివేకానంద, అరవింద, చివరికి గాంధీలో కూడా రాజకీయ, ఆధ్యాత్మిక దృష్టి కోణాలు రెండూ పెనవేసుకుని కనిపిస్తాయి. ఆధ్యాత్మికతతోపాటు చాలా మందిని మతభావన అంటిపెట్టుకుని ఉంటూ వచ్చింది. ఆధ్యాత్మికతను అలా ఉంచితే, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా దేశం అభివృద్ధి చెందిన వర్తమాన ఘట్టంలో మతభావన వికృతరూపాన్ని తెచ్చుకుని వైవిధ్యవంతమైన ఈ దేశస్వభావానికి ప్రమాదం తెచ్చిపెట్టే దిశగా అడుగువేస్తోందనుకోవాలి.

స్వాతంత్ర్యోద్యమ నాయకులలో ఎక్కువ వివాదాస్పదుడైంది సుభాస్ చంద్ర బోసే. ఆయన హింసావాదాన్ని అనుసరించడమే కాక, ఫాసిస్ట్ శక్తుల సాయం పొందే ప్రయత్నం చేశాడన్నది ఆయనపై వచ్చిన ఆరోపణలలో ఒకటి. ఈ పుస్తక రచయిత ఈ కోణాన్ని కూడా చర్చించారు. ఈ నేపథ్యంలోనే సుభాస్–గాంధీ సంబంధాలు చర్చలోకి రావడం జరుగుతోంది. ఇందులోని 'విప్లవాత్మక జాతీయవాది' అనే వ్యాసానికి రచయిత ఆధారం చేసుకున్న గిరిజ.కె.ముఖర్జీ పుస్తకం 'బిల్డర్స్ ఆఫ్ మోడర్న్ ఇండియా', గాంధీ–సుభాస్‌లు ఎందుకు కలసి పనిచేయలేకపోయారన్న ప్రశ్నను ముందుకు తెచ్చి సుభాస్ వైపు నుంచి సమాధానం చెబితే, రాజ్‌మోహన్ గాంధీ పుస్తకం 'మోహన్‌దాస్‌' గాంధీ వైపు నుంచి చెబుతుంది. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీ తరానికి, సుభాస్ తరానికి మధ్య ఉన్న అంతరం, ఉభయుల ఆకాంక్షలలో, వ్యవహరణలో తలెత్తిన తేడా, మొదట్లో కాంగ్రెస్ చట్టసభల్లో ప్రవేశించడానికి వ్యతిరేకించిన గాంధీ ఆ తర్వాత మెత్తబడి అందుకు అనుమతించడం, కొత్త తరానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సుభాస్ దానిని వ్యతిరేకించి, కాంగ్రెస్ నుంచే బయటపడి వేరు దారి పట్టడం జరిగినట్టు ముఖర్జీ పుస్తకం విశ్లేషిస్తుంది. అంతిమంగా, ఇలాంటి వాటిపై ఒక స్పష్టతనిచ్చే విధంగా సమగ్రపరిశోధన జరగవలసిన అవసరాన్ని ఈ వ్యాసాలు సూచిస్తాయి.

### రాజకీయం ఉచ్చనీచాలను పట్టించుకోదు

అసలు 'చరిత్ర'ను ఎలా చూడాలనేది చాలా మౌలికమైన ప్రశ్న. అందులోనూ ఇప్పటి మన దేశీయ సందర్భంలో చాలా ముఖ్యమైన ప్రశ్న కూడా. వాడ్రేవు చినవీరభద్రుడు గారు దీనిపై కూడా ఒక కీలకమైన వ్యాఖ్యను ముందుకుతెస్తారు. 'నేతాజీ–మహాత్ముడూ ఎందుకు కలసి పనిచేయలేకపోయారు? 1939లో నేతాజీ కోరుకున్నట్టుగా ఆయన్ను కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచెయ్యనిచ్చి ఉంటే, భారతదేశ భవితవ్యం మరోలా ఉండేది

కదా అని నాకే కాదు, చాలా మందికి అనిపిస్తుం'దని వీరభద్రుడు గారు అంటూనే, అసలలాంటి ఊహాగానానికే చరిత్ర తావివ్వదన్న తన చిన్నప్పటి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుని అభిప్రాయాన్ని ఉటంకిస్తారు. 'చరిత్రలో if అనేది ఉండదని, వ్యక్తిగత అభిప్రాయాల కన్నా, రాగద్వేషాలకన్నా చారిత్రక గతిశక్తులు చాలా పెద్దవని' ఆయన అనేవారట. నేటి కొమ్ములు తిరిగిన చరిత్రకారులు, అధ్యాపకులు, ఔత్సాహిక చరిత్ర పరిశోధకుల నుంచి, మామూలు ఆలోచనాపరుల వరకూ అందరూ గమనించి తీరవలసిన వ్యాఖ్య ఇది.

ఎందుకంటే, ఈ రోజున మన దేశంలో సరిగ్గా దీనికి వ్యతిరేకంగా జరుగుతోంది. గాంధీ 1914లో దక్షిణాఫ్రికా నుంచి స్వదేశానికి తిరిగివచ్చి స్వాతంత్ర్యోద్యమంలోకి అడుగు పెడితే; ఆ తర్వాత సరిగ్గా వందేళ్లకు, అంటే, 2014 నాటికి కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాల్లోను మెజారిటీ మతతత్వం వైపు మొగ్గు చూపే రాజకీయ పక్షమూ–కూటమి సొంతంగా సంపూర్ణ సంఖ్యాబలంతో అధికారంలోకి వచ్చాయి. అప్పటి నుంచి ఆ వందేళ్ల చరిత్రనూ, ఆ చరిత్రలో ప్రముఖపాత్ర వహించిన వ్యక్తుల చరిత్రను తిరగదోడడం, వారి వ్యక్తిత్వాలు, వ్యవహరణ తీరును ఆక్షేపించడం, వారి నిర్ణయాలను ప్రశ్నించడం, పునర్వ్యాఖ్యానించడం, వాళ్ల 'తప్పు'లను ఎంచి చూపడం అటు అకడమిక్ స్థాయి నుంచి, ఇటు మీడియా, సోషల్ మీడియా స్థాయి వరకూ ఆయా అంచెలలో పెద్ద ఎత్తున జరుగుతూ ఉండడం గత పదకొండేళ్లుగా చూస్తున్నాం.

అందులో భాగంగా అటు బ్రిటిష్, ముస్లిం కాలాల్లోకి కూడా 'తమదైన' చూపును మరింత బలంగా చొప్పించే ప్రయత్నమూ జరుగుతోంది. పాఠ్య పుస్తకాలను తిరగ రాయడంతో మొదలు పెట్టి, ఎక్కడికక్కడ మరింత ఎత్తున కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా పాత విగ్రహాలను మరుగుజ్జులను చేయడం, లేదా స్థానభ్రంశం కలిగించడం వరకూ అది బహురూపాలలో సాగుతోంది. ఏదైనా ఒకటి రాజకీయమైన రూపం తీసుకున్నప్పుడు నిజాలను మరుగు పరచడం, మసిపూయడం, వక్రీకరించడం, వాటిపై అసత్యాలను స్థాపించడం, లేదా ఉన్న నిజాన్ని అనేక రెట్లు పెంచి చూపడం, లేదా అనేక రెట్లు తగ్గించి చూపడం, దూషణ భూషణలు రెండూ హెచ్చు శ్రుతిని అందుకోవడం సహజమే. చరిత్రను వస్తుగతంగా నిష్పాక్షికంగా చూసే అకడమిక్ రంగం దీనికి విడిగా, దూరంగా పనిచేస్తూ ఉంటే ఏమోకానీ, అందులోని హెచ్చుభాగం రాజకీయమైన ఒత్తిడులకు తలవంచి అందులో భాగస్వామి అయితేనే చిక్కు. ఇప్పుడు అదే జరుగుతోంది.

ఇటీవలి కాలంలో గుజరాత్‌లో నెలకొల్పిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం దీనంతటికీ 'ఆరు వందల అడుగుల ఎత్తైన' ఉదాహరణ. ప్రపంచంలో అనేకచోట్ల గాంధీ విగ్రహాలు ఉన్నాయి కానీ, ఆయన పుట్టిన గడ్డ మీద మాత్రం, 'ప్రపంచంలోనే ఎత్తైన'దిగా చెబుతున్న విగ్రహం ఆయన అనుయాయికే కానీ ఆయనకు లేదు! గాంధీ–పటేల్‌ల సంబంధం ఎలాంటిదో రాజ్‌మోహన్ గాంధీ రచన 'మోహన్ దాస్ట' చదివితే అర్థమవుతుంది. అది రామలక్ష్మణులు, రామ, ఆంజనేయుల సంబంధం లాంటిది. అప్పటి అగ్రనాయకులలో గాంధీకి పటేల్ అంతటి విధేయ అనుచరుడు మరొకరు లేరు. నెహ్రూ కూడా గాంధీకి అంత విధేయుడు కాదు. అటువంటిది, తన గురువు కన్నా ఎత్తున తన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం చూసి పటేల్ ఆత్మ సిగ్గుతో చితికిపోతూ, కోపంతో రగిలిపోతూ ఉంటుంది.

కానీ రాజకీయం నిజానిజాలనే కాదు; ఉచ్చనీచాలనూ, ఔచిత్యానౌచిత్యాలనూ కూడా పట్టించుకోదు. నెహ్రూ–పటేల్, నెహ్రూ–సుభాస్ చంద్రబోస్‌ల సంబంధం విషయంలో కూడా అదే జరుగుతోంది. నెహ్రూ–పటేల్‌ల మధ్య అభిప్రాయభేదాలు ఉండేవి కానీ పటేల్ ప్రధానమంత్రి పదవి కోసం నెహ్రూతో ఎప్పుడూ పోటీ పడలేదని, ఆయన నాయకత్వాన్ని ఆమోదించి, రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడని, గాంధీ వారిద్దరి మధ్యా వయసులో ఉన్న పద్నాలుగేళ్ల అంతరాన్ని దృష్టిలో పెట్టుకొని యువకుడైన నెహ్రూ వైపు మొగ్గు చూపాడని, అదీగాక స్వాతంత్ర్యం వచ్చే నాటికే పటేల్ ఆరోగ్యం క్షీణించిందని, ఆ తర్వాత మూడేళ్లే ఆయన జీవించాడని 'మోహన్‌దాస్ట' చెబుతుంది. అయినా సరే, పటేల్‌కు దక్కవలసిన ప్రధానమంత్రి పదవి అన్యాయంగా నెహ్రూకు దక్కిందని, పటేల్ ప్రధానమంత్రి అయుంటే దేశగమనం మరో విధంగా ఉండేదన్న నేరెటివ్‌ను ప్రచారంలో ఉంచడం చూస్తున్నాం.

అలాంటి నేరెటివ్‌నే సుభాస్‌చంద్రబోస్–నెహ్రూల విషయంలోనూ ముందుకు తెచ్చారు. సుభాస్ కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు నెహ్రూ, ఆయనా కలిసికట్టుగా వ్యవహరించే వారని, కొన్ని కొన్ని సందర్భాలలో గాంధీని ప్రశ్నించడం, ధిక్కరించడం చేసేవారనీ 'మోహన్ దాస్ట' చెబుతుంది. కానీ, నెహ్రూ ప్రధానమంత్రి అయ్యాక సుభాస్ చంద్రబోస్ పోరాట చరిత్రనూ, ఆయన జ్ఞాపకాలనూ భూస్థాపితం చేయడానికి ప్రయత్నించాడనే నేరెటివ్‌ను ప్రచారంలోకి తెచ్చారు.

'చరిత్రలో if అనేది ఉండదని, వ్యక్తిగత అభిప్రాయాలకన్నా, రాగద్వేషాలకన్నా చారిత్రకగతిశక్తులు చాలా పెద్దవని' వీరభద్రుడుగారు ఉటంకించిన వ్యాఖ్య అతికినట్టు సరిపోయే ఒక ఆసక్తికరకోణం కూడా ఇక్కడ ఉంది. రెండవ ప్రపంచ యుద్ధ నేపథ్యంలో జపాన్ ఒక దురాక్రమణ శక్తిగానూ, దూకుడుగానూ వ్యవహరిస్తూ వచ్చింది. అది ఒక దశలో మన దేశ ఈశాన్య సరిహద్దుల దాకా చొచ్చుకు వచ్చిందని, అంత వరకూ ప్రపంచ యుద్ధానికి దూరంగా ఉన్న అమెరికా తన పెరల్ హార్బర్ మీద జపాన్ దాడి దరిమిలా యుద్ధంలోకి దిగి, జపాన్ లోని

హిరోషిమా, నాగసాకీల మీద అణుబాంబు ప్రయోగించిన తర్వాతే జపాన్ వెనక్కి తగ్గిందని కూడా చరిత్ర చెబుతోంది. జపాన్ దూకుడు అప్రతిహతంగా కొనసాగి ఉంటే చరిత్రగతి ఎలా పరిణమించేదని కాని, సుభాస్ చంద్ర బోస్ అప్పుడు జపాన్‌తో సత్సంబంధాలలో ఉన్నాడు కనుక నెహ్రూ స్థానంలో ఆయనే దేశాధినేత అయుండేవాడేమోనని కాని అనుకోవడం కేవలం ఊహాగానమే అవుతుంది. పైవ్యాఖ్య చెప్పినట్టు, చారిత్రక గతిశక్తులు మన ఇష్టాయిష్టాలూ, ఊహాగానాలకన్నా చాలా బలమైనవి.

## మన కంటికీ మనసుకూ కూడా అశ్రు చికిత్స

'అద్వితీయ జయగాథలు' అనే వ్యాసంలో వీరభద్రుడు గారు ఆలోచననూ, చర్చనూ రేకెత్తించే ఒక వ్యాఖ్య చేశారు. 'ఐ.ఆర్ 8' అనే వరి వంగడం ద్వారా సస్యవిప్లవానికి దోహదం చేసిన నెక్కంటి సుబ్బారావు గారి గురించి డాక్టర్ గోటేటి లలితాశేఖర్ రచించిన 'పుడమితల్లి నేస్తం' అనే పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఆయన ఇలా అంటారు: "రైతు కడగండ్లను, దోపిడీని, పీడనను చిత్రించడంపట్ల తెలుగు రచయితకి ఉన్న ఆసక్తి, రైతు విజయగాథలు నమోదు చెయ్యడం మీద లేదు. జయగాథల గురించి చెప్పడమంటే ప్రభుత్వానికి మద్దతు పలికినట్టుగానూ, pro-establishment వైఖరి అవలంబించినట్టుగానూ భావిస్తాడు తెలుగు రచయిత. అది అతడి పరిమితులను తెలియ చెప్తుంది తప్ప, అతడి అవగాహనను కాదు... social entrepreneurగా మారితే తప్ప ఏ రైతూ బీదరికం నుంచి బయట పడడు. ఆ ప్రయాణం ప్రధానంగా అతనిదీ, అతని సహచరులదీను. ప్రభుత్వం వారికి సహాయపడి ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అది వేరే కథ. నేను తెలుగు రచయితల నుంచి, పత్రికల నుంచి, ప్రసార మాధ్యమాల నుంచి ఇటువంటి కథలు ఆశిస్తాను". విడిగా చూసినప్పుడు ఎవరైనా ఆమోదించి తీరవలసిన మాటలే ఇవి. వ్యక్తుల విజయగాథలు అసలే నమోదు కావడం లేదని అనలేం కానీ; రైతులతో సహా ఆయా వర్గాల కడగండ్లూ, దోపిడీ, పీడనా నమోదైన స్థాయిలో కాకపోవచ్చు, లేదా ఆ స్థాయిలో జనం దృష్టిని ఆకర్షించకపోతూనూ ఉండవచ్చు. అయితే, ఈ వ్యత్యాసాన్ని ప్రో, లేదా యాంటీ ఎస్టాబ్లిష్ మెంట్ కోణం నుంచి చూసి, రచయితలు, పత్రికలు, ప్రసారమాధ్యమాల వైఖరిని ఒక లోపంగా భావించినప్పుడు మరో రకమైన ప్రమాదం తలెత్తవచ్చు. వ్యక్తుల స్థాయిలో విజయాలను సాధించడాన్ని ఒక ఆదర్శంగా స్థాపించిన కొద్దీ ప్రభుత్వాలు ప్రజల పట్ల తాము నిర్వర్తించవలసిన బాధ్యతల బరువును వదిలించుకునే ప్రయత్నం చేయచ్చు; లేదా ప్రభుత్వాల బాధ్యత గురించిన చర్చ పలచన కావచ్చు. ప్రభుత్వరంగం క్షీణించి, ప్రైవేట్ రంగం బలపడుతూ రావడంలో ఈ పరిణామాన్ని ఇప్పటికే చూస్తున్నాం. ఇది క్రమంగా జన జీవితంతో ప్రత్యక్షంగా ముడిపడిన అన్ని పాలనా విభాగాలకూ విస్తరించే ప్రమాదానికి దారితీయచ్చు.

అందులోనూ, ఏడు దశాబ్దాలకు పైబడిన మన ప్రజాస్వామిక పాలనానుభవం నుంచి చూస్తే ప్రభుత్వాలతో సహా ఆయా వ్యవస్థలు తమకు నిర్దేశించిన విధులు, బాధ్యతలలో పూర్తిగా కుదురుకోలేదని; పనితీరులో పరిణతిని తెచ్చుకోలేదని, ఆశించిన స్థాయిలో ఫలితాలను సాధించడం లేదని, ఇంకా నేర్చుకుంటూ, అనుభవాన్ని గడించుకుంటున్న దశలోనే ఉన్నాయని అర్థమవుతుంది. రాజకీయ పక్షాలూ, ప్రభుత్వ యంత్రాంగాలూ, మీడియా సహా ఏవీ ఇందుకు మినహాయింపు కావు. అందుకే, ప్రధానంగా రాజకీయ నాయకత్వాలూ, ప్రభుత్వాల తప్పులనూ, తప్పటడుగులనూ ఎత్తిచూపుతూ ప్రతిపక్ష పాత్ర పోషించే విధంగానే మీడియా, ప్రత్యేకించి వార్తాపత్రికల రూపకల్పన జరిగింది. దాని నుంచే 'యాంటీ-ఎస్టాబ్లిష్‌మెంట్ భావన బలపడింది. కనుక, వ్యక్తుల జయగాథలు నమోదు కావలసిన అవసరాన్ని గుర్తిస్తూనే, అది పూర్తిగా ప్రో-ఎస్టాబ్లిష్ మెంట్ వైఖరి వైపు నడిపించకుండా జాగ్రత్త పడడమూ అవసరం.

మన దగ్గర ప్రజాస్వామ్యం ఇప్పటికీ ఇంకా పరిణామ దశలోనే ఉందనడానికి, వ్యక్తులు-వ్యవస్థల మధ్య తేడాను ఇప్పటికీ పోల్చుకోలేకపోతుండడం ఒక సాక్ష్యం. ప్రజాస్వామ్యంలో పౌరులు ఆధారపడవలసింది వ్యవస్థల మీదే తప్ప; వ్యక్తులూ, వాళ్ల దయాదాక్షిణ్యాలూ, వాళ్ల సొంత నిర్ణయాల మీద కాదు. పరిపాలన వ్యవస్థాముఖంగా జరగాలి తప్ప వ్యక్తుల ముఖంగా కాదు. కాని, అది తలకిందులు కావడం రాజకీయ, ప్రభుత్వ నాయకత్వాలలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. సమష్టి నిర్ణయాలను, వాటి సానుకూల ఫలితాలను ప్రధాన మంత్రికి, లేదా ముఖ్యమంత్రికి ఆపాదించి, వాళ్ల వ్యక్తిగత ఘనతగా చిత్రించడం, వాళ్లను ఆకాశానికెత్తడం, ఆ విధంగా వాళ్లకు రాచరిక, లేదా ఫ్యూడల్ వ్యవస్థలో రాజుకు ఇచ్చే ప్రతిపత్తిని, ఇమేజ్‌నూ కల్పించడం ఇప్పటికీ చూస్తున్నాం. ఆ విధంగా, 'పాలక స్వభావాన్ని సంతరించుకోని పాలకుడి కోసమే తను మూడు దశాబ్దాలుగా అన్వేషిస్తున్నా'నని వేరే సందర్భంలో వీరభద్రుడు గారు చేసిన వ్యాఖ్య ఈ సందర్భానికి కూడా తూచినట్టు సరిపోతుంది.

ప్రముఖ చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ గారి గురించి రాస్తూ - ఆయనా, ఆయన కొలీగ్ ప్రొ. లక్ష్మీనారాయణా తమ కాలనీలో రోజూ తెల్లవారుజామునే ఏదో గంభీరమైన విషయం మీద మాట్లాడుకుంటూ మార్నింగ్ వాక్ చేస్తూ ఉంటే మా కాలనీ వీధులు 'ఏథెన్స్ వీధు'ల్లా అనిపించేవంటారు వీరభద్రుడు; ఆ ఉపమానం మన ఊహలను ఒక్కసారిగా జిగేలు మనిపించి, లోతైన తాత్త్విక, వైజ్ఞానిక మథనానికి వేదిక అయిన ప్రాచీన గ్రీసుచరిత్ర మొత్తాన్ని మన

కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది. ఈ పుస్తకం పుటల వీధుల్లో మన మనోనేత్రాలు వాకింగ్ చేస్తున్నప్పటి అనుభవం కూడా దానికి భిన్నమైనది కాదు.

ఈ సంపుటిలోని 'జాతిని మేల్కొల్పిన వాళ్లు' అనే 13 పేజీల వ్యాసం విషయరీత్యా ఒక పరిశోధక గ్రంథ ప్రమాణంలో ఉండి భావి పరిశోధకులకు ఒక సోర్సు కాదగినది. జాతీయోద్యమంలో పాల్గొన్న వేలాది మంది తెలుగు వారు చరిత్రకెక్కకపోవడం గురించి, మన సాహిత్యచరిత్ర జాతీయోద్యమకారుల పట్ల నిర్లక్షిణ్యంగా వ్యవహరించడం గురించి ఇది చర్చిస్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ ప్రాచుర్యంలో లేని ఎన్నో విశేషాలు, వివరాలు ఇందులో కనిపిస్తాయి.

ఒక ఐ.ఎ.ఎస్ అధికారిగా తెలిసిన నరేంద్ర లూథర్ గురించి అంతగా తెలియని కోణాన్ని ఇందులోని 'ఒక తల్లిదండ్రుల కథ' అనే వ్యాసం ముందుకు తెస్తుంది. ఆయన రాసిన A Bonsai Tree అనే పుస్తకం చదువుతూ చివరి పుటలకు వచ్చేసరికి కన్నీటితో నా కళ్ళు మసకబారిపోయాయంటారు వీరభద్రుడు. మద్యానికి బానిసై జీవన విధ్వంసపు అంచులకు చేరుకొన్న కొడుకుని చూసి లూథర్ దంపతులు పడిన దుఃఖాన్ని చిత్రించే ఘట్టమది. కొడుకు ఆ పతనం నుంచి బయటపడి తిరిగి జీవితాన్ని గెలుచుకున్నప్పుడు తల్లిదండ్రులు పడిన సంతోషాన్ని కూడా ఆ పుస్తకం చిత్రిస్తుంది. గాంధీ పెద్ద కొడుకు హరిలాల్ జీవితం అలాంటిదే కానీ, అతను ఎప్పటికీ కోలుకోలేక గాంధీ దంపతులకు చివరి వరకూ కడుపుకోతనే మిగిల్చాడు. హరిలాల్ జీవితకథను తెలుగు చేస్తున్నప్పుడు కూడా నా నేత్రాలు తడిసిపోతూనే ఉండేవంటారు వీరభద్రుడు. నేను అనువదించిన రాజ్ మోహన్ గాంధీ 'మోహన్ దాస్' కూడా హరిలాల్ జీవితాన్నీ, గాంధీ దంపతుల దుఃఖాన్నీ అంతే కరుణరసార్ద్రంగా చిత్రిస్తుంది. సంఘసేవకుడు, గాంధేయవాది మురళీధర్ దేవీదాస్ ఆమ్టే సహచరి సాధనా తాయి ఆమ్టే రాసిన 'సమిధ' కు భారతి కోడె చేసిన తెలుగు అనువాదం చదువుతున్నప్పుడు కూడా (ఒక తల్లి ఆత్మకథ) నా కళ్లు ధారాపాతంగా కన్నీళ్లు కారుస్తూనే ఉన్నాయని, పుస్తకం ముగించేటప్పటికి గంగాస్నానం చేసినట్టూ, గంగాపానం చేసినట్టూ, నన్ను ఎవరో బయటా, లోపలా కూడా శుభ్రం చేసేసినట్టూ ఉందంటారు వీరభద్రుడు. ఒక కరుణరసవంతమైన జీవితగాథ మన నేత్రాలకూ, మనోనేత్రానికీ కూడా చేసే అక్షరచికిత్స అది.

### వినిపించుకోక తప్పని వివేకవాణి...

చివరిగా రెండు విషయాలను నేను ప్రస్తావిస్తాను. ఇవి అనేక రోజులపాటు, అనేక మంది ఆలోచనాపరుల భాగస్వామ్యంతో అనేక పుటలూ, అనేక గొంతుల మీదుగా చర్చించవలసిన విషయాలు కూడా.

**మొదటిది ఏమిటంటే,** ప్రాచీన వాఙ్మయంతో మొదలుపెట్టి సమకాలీన వాఙ్మయంవరకూ ప్రతి ఒక్క దానిని ప్రతి ఒక్క తరమూ కొత్తగా చదువుకుంటారు. కొత్తగా అర్థం చేసుకుంటారు. ఆ క్రమంలో అవి ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని సంతరించుకుంటూ తమ ఉనికిని పొడిగించుకుంటాయి. ప్రాచీన వాఙ్మయాన్నే తీసుకుంటే, దానికి మత విశ్వాసమూ, భక్తీ, దాని గురించిన సాంప్రదాయిక భాష్యమూ వంటి అనేక కవచాలు తొడిగి కట్టకట్టి పూజ గదిలో ఉంచి పూజించడానికే పరిమితమైనప్పుడు, ఆ విధంగా సరికొత్తగా వాటిని చూడడాన్ని నిషేధించినప్పుడు ఆ వాఙ్మయపు పునర్వికాసమూ, పునర్నవీకరణా ఆగిపోవడమే కాదు. వాటి గురించిన సాంప్రదాయిక భాష్యం కూడా యాంత్రికమైన వల్లింపుగా మారి శ్రోతలను, లేదా పాఠకులను ఉత్తేజపరచగల శక్తిని, తన అస్తిత్వాన్ని పొడిగించుకోగల జీవశక్తిని కూడా కోల్పోతుంది.

ఎప్పటికప్పుడు ప్రతి తరమూ స్వేచ్ఛగా, నిర్నిషేధంగా దానిని కొత్తగా చదువుకోగలిగినప్పుడు సాంప్రదాయిక భాష్యానికి అక్కడక్కడ పూర్వ పక్షం, ప్రతిపక్షం తలెత్తవచ్చు. నిజమే; అదే సమయంలో మరెన్నో వినూత్నమైన, విశిష్టమైన కోణాలూ, అన్వయాలూ, భాష్యాలూ వెలుగు చూసి, ప్రాచీన వాఙ్మయానికి నూతన వికాసాన్ని కల్పించి అంతిమంగా కాలం వెంబడి దాని ఉనికినీ, దోహదాన్నీ మరింత పొడిగిస్తాయి కూడా.

చెప్పొచ్చేదేమిటంటే, సమస్త వాఙ్మయాన్నీ అన్ని రకాల విధి నిషేధాలకు, సరిహద్దులకు అతీతంగా, కొత్తగా అందివచ్చిన అనేకానేక వనరుల వెలుగులో స్వేచ్ఛగా అవలోకించి సమకాలానికి తెచ్చి దాని ప్రాసంగికతను స్థాపించడానికి బహుముఖాలుగా ప్రయత్నించే నేటి సాహితీవేత్తలూ, జిజ్ఞాసువులలో వీరభద్రుడుగారు ఒకరు మాత్రమే కాదు; ప్రథమగణ్యులలో ఒకరు. ఈ పుస్తకంలోని 'చరిత్ర, పురాణాలు, సామాజిక గమనం' అనే విభాగంలోని నాలుగు వ్యాసాలు కూడా అందులోకే వస్తాయి; అది రచయిత తాలూకు ఒక ముఖ్యమైన దృష్టి కోణం అయినప్పుడు పుస్తకమంతటా దాని ప్రతిఫలనాన్ని ఏదో ఒక రూపంలో దర్శిస్తాం.

ఈ సందర్భంలో ప్రత్యేకంగా ఉదహరించుకోవలసిన వ్యాసం 'స్పష్టంగా చెప్పగలిగేనా?' అనేది. ఇది వ్యక్తిగతంగా నేను అనుసంధానం కాగలిగినది కూడా. గురజాడ లాంటి కొంత మంది లోపల్లోపల మథనపడి, సమాధానం వెతికి పట్టుకుని దానిని మాత్రమే తేటగా, స్పష్టంగా ప్రపంచంతో పంచుకుంటారని, తన లాంటివాళ్ళు వేరని వీరభద్రుడు అంటూ, 'నా నలుగులాటను నేను నలుగురి నుంచి దాచుకోవాలనుకోలేను. చలం లాగా, బైరాగిలాగా నేను రాసుకునేదంతా ఒక interior monologue. కాబట్టి, అందులో చాలా సంకీర్ణతా, సంక్లిష్టతా తప్పనిసరి' అంటారు.

నన్ను ఆశ్చర్యపరచింది ఏమిటంటే, ఆ 'వేర'ని చెప్పిన వాళ్లలో నేను కూడా ఒకడినేమో అనిపించడం! ఈ మధ్య, నా సారస్వత, రచనా జీవితాన్ని చిత్రించవలసివస్తే, దానికి ఏ పేరు పెట్టవచ్చునన్న ప్రశ్న ఎదురైనప్పుడు 'ప్రయాణం', 'అన్వేషణ' అనే రెండు పేర్లు అప్పటికప్పుడు స్ఫురించాయి. ప్రయాణం, అన్వేషణ అన్నప్పుడు అవి ఇంకా ముగింపుకు చేరలేదని, ఒక జీవితకాలంలో చేరే అవకాశం లేదని అర్థం.

మరోరకంగా కూడా ఇది నన్ను నేను అనుసంధానించుకునే వ్యాసం. ఉపనిషత్తుల కాలం తర్వాత మొదటిసారిగా ఇప్పుడే భారతదేశంలో పెద్ద ఎత్తున భావజాల ఘర్షణ జరుగుతోందని; మంచిదా, చెడ్డదా అనేది అలా ఉంచి, దేశం ఈ రోజున ఒక కీలకమైన మలుపు తిరిగే దశలో ఉందని; అది ఈ దేశపు గతం వైపు కొత్తగా తిరుగుతున్న మలుపే తప్ప అంత కొత్తదీ కాదని నేను గత పదేళ్లుగా భావిస్తూ, చెబుతూ వచ్చాను. వర్తమాన సందర్భం అలాంటిది కనుక, పునరుక్తమనిపించినా సరే, ఇదే మాటను మళ్లీ మళ్లీ నొక్కి చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇతరేతరమైన తేడాలు ఉండచ్చు కానీ మౌలికంగా వీరభద్రుడు గారు చేస్తున్నది కూడా అదే! నేను ప్రస్తావించాలనుకున్న విషయాలలో రెండవది ఇదే.

ఈ వ్యాసంలో ఆయన ఏమంటారో చూడండి : 'ఏదైనా విషయం గురించి ఆలోచించడంలో, నలుగురితో చర్చించడంలో మూడు దశలు వుంటాయనిపిస్తుంది. చర్చ మూడవ దశకు చేరుకున్నప్పుడు అది ఆర్థిక-రాజకీయ-సామాజికపార్శ్వాలను దాటి ఒక తాత్త్వికకోణాన్ని సంతరించుకుంటుంది. ఉదాహరణకు, ఇప్పుడు భారతదేశంలో ఒక కొత్త జాతీయతా ధోరణిని సంతరించుకుంటున్న రాజకీయ వాతావరణం ఏర్పడుతున్నది. అది కొత్తపరిణామంగా కనిపించవచ్చుగాని, ఆదినుంచీ భారతదేశచరిత్రను నిశితంగా పరిశీలించినవాళ్ళకి ఈ పరిణామంలో చరిత్ర పునరావృత్తి కనిపిస్తుంది'.

ఈ దేశచరిత్రలో ఒకసారి కేంద్రం నుంచి అంచుల దాకా (centrifugal), మరొకసారి అంచులనుంచి కేంద్రం దాకా (centripetal) మార్చి మార్చి రాజకీయ-సాంస్కృతిక నిర్మాణాలు సంభవిస్తూ కనిపిస్తాయని, మొదటిది జాతిభావనగా, మతపరమైన ఏకేశ్వరోపాసనగా, రాజకీయంగా totalitarian గా వ్యక్తమై బలమైన కేంద్రంవైపు, బఅఓఎ వైపు నడిపిస్తే; రెండవది బలమైన ప్రాంతాలూ, అంచులూ, వివిధ సంస్కృతులూ, భాషలూ, వివిధ ఆరాధనాసమూహాల గురించిన జాగృతి వైపు, diversity వైపు నడిపిస్తుందని వీరభద్రుడు ఒక ఆసక్తికరమైన సూత్రీకరణ చేస్తారు. ఈ alternation ను ప్రపంచ విపణితో దేశ సంబంధాలు బలంగా ఉండడం, లేదా బలహీనపడడం అనే పరిణామాలతో ముడిపెట్టి; బలంగా ఉన్నప్పుడు కేంద్రం బలపడడం, బలహీనపడినప్పుడు అంచులు బలపడడం జరుగుతూ ఉంటుందని ఊహిస్తారు. 'ఈ క్రమంలో భారతదేశంలో నా కళ్ల ముందు సంభవిస్తున్న పరిణామాల్ని చరిత్ర, తత్త్వశాస్త్రం, సాహిత్యం ఆసరాగా మరింత లోతుగా అధ్యయనం చేయాలనేది నా కోరిక' అంటారు.

నేడు భారతదేశం హిందుత్వవాదం, హిందుత్వవాదాన్ని వ్యతిరేకించే వాదం అనే రెండు శిబిరాలుగా చీలిపోయిందని ఆయన అంటూ, ఈ రెండు దృక్పథల్లోనూ కూడా లోతు లేదని, తమకు సంబంధించని విశాలభారతదేశమొకటి ఉందనీ, దాని గురించి వాళ్ళకు తెలిసింది స్వల్పమని తన అభిప్రాయంగా చెప్పి, ఆ భారతదేశం గురించిన ఎరుకను తను కబీరును చదవడం ద్వారా పొందానంటారు.

నేను కానీ, ఇతరులు కానీ ఆయన అవగాహనతో, లేదా సూత్రీకరణలతో ఏకీభవించేవీ, విభేదించేవీ ఏముంటాయనేది అలా ఉంచితే; నా వరకు నాకిక్కడ కావలసినది ఆయన కూడా దేశీయంగా ఈ రోజున పెద్ద ఎత్తున భావజాల ఘర్షణ జరుగుతున్న సంగతిని గుర్తిస్తూ, దాని గురించి ఆలోచిస్తూ, ఆ దిశగా సాహిత్యంతో సహా తన అధ్యయనాంశాలను అన్నిటినీ మళ్ళించడం! ఆ దిశగా ఆలోచించే ఎంతో మందికి బలమైన తోడు కావడం!

రచయిత ఇతరత్రా వ్యాసాలలో వ్యక్తపరచిన దృష్టి కోణాలను కూడా దీనికి కలుపుకుని చూసి మొత్తం మీద ఈ పుస్తకానికి ఒక వస్త్వైక్యత సమకూడుతోందనుకుంటే- ఈ పుస్తకంలోని చివరి వ్యాసం మన ప్రాచీన కావ్య నాటకాలలో కనిపించే భరతవాక్యం లేదా మంగళాశాసనం లేదా ఫలశ్రుతి లాంటిది. 'మన పిల్లలకు మంచిది కాదు' అనే శీర్షికతో ఉన్న ఈ వ్యాసం గౌరీ లంకేశ్ హత్య గురించి మాట్లాడుతూ, 'ఆమె హత్యను ఎవరు ఖండించారన్నది కాదు, ఎవరు ఖండించలేదన్నది నన్నెక్కువ బాధపెడుతోంది. ఇది జాతికి మంచిది కాదు. దేశానికి మంచిది కాదు. మన పిల్లలకు మంచిది కాదు' అంటుంది. నా వరకు ఇక్కడ ఇంకొక విచిత్రమైన యాదృచ్ఛికత ఏమిటంటే, గౌరీ లంకేశ్ హత్య గురించి రాసినప్పుడు నేను ప్రముఖంగా ప్రస్తావించినది కూడా, ఆ హత్యను ఖండించని వాళ్ల గురించే!

సాయుధ యుద్ధాలలోనే కాదు, భావజాలయుద్ధాల్లో కూడా మధ్యమ వాణిని వినిపించే వివేకవంతులు ఉంటూనే ఉంటారు. భీకర యుద్ధారావాల మధ్య ఆ గొంతు అణగారినట్టు అనిపించినా, యుద్ధం విధ్వంసపు అంచుల వైపు పూర్తి స్థాయిలో సాగుతున్నప్పుడు, హాహాకారాలు మిన్నంటుతూ పునర్నిర్మాణం గురించిన ఆకాంక్షలు వెల్లువెత్తుతున్నప్పుడు ఆశ్వాసన కోసం, దిశా నిర్దేశం కోసం ఒక వివేకవాణికి అందరూ తప్పనిసరిగా చెవియొగ్గవలసివస్తుంది. అదిగో, అప్పుడు, ఆ అక్కర తీర్చడం కోసం.. ఈ పుస్తకం, ఇంకా ఇలాంటి మరెన్నో పుస్తకాలు జాతి చేతికి అలంకారమవుతాయి! ❑

పుస్తక పరిచయం

# ఆర్వీ రామారావు నిజాయితీగా రికార్డ్ చేసిన వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర

- తాడి ప్రకాష్, సీనియర్ జర్నలిస్టు



సింగారవేలు చెట్టియార్ ఎవరు ?

షాపూర్జీ సక్లత్‌వాలా పేరు విన్నారా ?

సోహన్ సింగ్ బక్నా ఏం చేశారు !

ఆచార్య నరేంద్రదేవ్ సాహసం ఏమిటి ?

జతిన్‌దాస్, సూర్యసేన్, గణేష్ ఘోష్‌లను ఎందుకు తలచుకోవాలి ?

ఫిలిప్ స్ప్రాట్ మనకేం అవుతారు ?

హేముకలానీ, కనకలతా బారువా పేర్లు తెలుసా?

రాజమహేంద్ర ప్రతాప్ ఎవరు ? ఎం.ఎన్.రాయ్ లెనిన్ ఏమన్నాడు ? జడ్.ఎ.అహ్మద్, సజ్జాద్ జహీర్, ముక్దూం మొహియుద్దీన్‌ల పాత్ర ఏమిటి?



ఎస్వీ ఘాటే, గంగాధర అధికారి ఏం చేశారు ?

లాలా లజపతిరాయ్‌ని చంపిందెవరు ?

సర్వదేవభట్ల రామనాధం, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మీ నరసింహారెడ్డి చేసిన త్యాగం ఎలాంటిది ?

ఎందరో వీరులు, మేధావులు, తిరుగుబాటుదారులు – ఉద్యమాల్లో నడిచిన వాళ్లు.. దేశం కోసం ప్రాణాలు విడిచిన వాళ్లు.. జనం కోసం త్యాగాల ఎర్ర జెండాపై ఎగిరిన వాళ్లు.

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ అనే తొలి విత్తనాలు నాటి వంద సంవత్సరాలు అయ్యింది. ఆ చారిత్రాత్మక సందర్భాన్ని, ప్రజా పోరాటాలను తలుచుకుంటూ ప్రతిభావంతుడైన సీనియర్ జర్నలిస్టు, సంపాదకుడు ఆర్వీ రామారావు విశాలాంధ్ర దినపత్రికలో వరసగా వంద వ్యాసాలు రాశారు. వాటన్నిటితో 'శత వసంతాల అరుణ పథం' అని ఓ పుస్తకం వేశారు.

నూరేళ్ల చరిత్రను కేవలం 260 పేజీల్లో చెప్పడానికి ఆయనొక పద్ధతిని ఎంచుకున్నాడు. ఆ స్కీమ్ ప్రకారం క్లుప్తంగా, స్పష్టంగా, సమర్థంగా రాయగలిగారు. ఆర్వీ రామారావు వంద వ్యాసాల కోసం – కీలకమైన సంఘటనలు, త్యాగమూర్తులు, ప్రసిద్ధ నాయకులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, మేధావులు, చరిత్ర సృష్టించిన ఉద్యమాలు, కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా నాట్యమండలి, మహిళా సంఘాల పాత్రని ఒక క్రమంలో రాశారు.

భగత్ సింగ్, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు నుంచి పీసీ జోషీ, కంభంపాటి సత్యనారాయణ, దర్శి చెంచయ్య దాకా




వేగుచుక్కలై వెలిగిన వాళ్లందరిని గుర్తు చేసుకున్నారు. రక్తమోడినా రాజీ లేని పోరాటాన్నీ, ఉరికంబం ఎక్కినా చెక్కు చెదరని ధైర్యాన్ని, జైలు గోడల చీకటి మధ్య కన్నీటి తడిలో కరిగిపోయిన జీవితాల దైన్యాన్ని... అంతే ఉద్వేగంతో రికార్డు చేశాడు ఆర్వీ రామారావు. విశ్లేషణ చేసినా, దూకుడుగా రాసినా మంచి తెలుగు వాక్యం వేగంగా చదివిస్తుంది.

ఆర్వీ రామారావుగా అందరికీ తెలిసిన ఆయన పూర్తి పేరు రాయారావు వెంకట రామారావు. మునుపటి మెదక్ జిల్లా నర్సాపూర్ దగ్గరలోని నల్లవల్లి గ్రామంలో 1953లో పుట్టినా, మొదటి నుంచి హైదరాబాద్‌లోనే ఉన్నారు. 'విశాలాంధ్ర'కు గత అయిదేళ్లుగా ఎడిటర్. 1976 నుంచి ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి దినపత్రికల్లో పనిచేసి, 50 ఏళ్లు నిత్యం అక్షరాలతోనే కలిసి బతుకుతున్నారు. నేషనల్ బుక్ ట్రస్ట్ కోసం డజను పుస్తకాలు ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువదించాడు.

గెయిల్ ఆంవెట్ రాసిన అంబేద్కర్ జీవిత చరిత్రను అనువదించారు. వట్టికోట అళ్వారుస్వామి 'ప్రజల మనిషి' నవలను ఇంగ్లీషులోకి తర్జుమా చేశారు. వేలాది సంపాదకీయాలు రాశారు. ప్రస్తుతం తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం గౌరవాధ్యక్షులుగా ఉన్నారు.

1917 రష్యా విప్లవ విజయం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. తిరుగుబాటు ఒక ఆదర్శంగా నిలిచి వెలిగింది. సోషలిస్టు భావాలు జనంలో ఉత్సాహం నింపాయి. ఇండియాపై పెత్తనం చేస్తున్న బ్రిటీష్ వాళ్లు 1912లో పెషావర్ కుట్ర కేసు, 1924 లో కాన్పూర్ బోల్షివిక్ కుట్ర కేసు, 1925లో కకోరి కుట్ర కేసులు పెట్టారు. వాటి విచారణ మార్క్సిస్టు భావాల వ్యాప్తికి ఉపయోగపడింది. తాష్కెంట్లో 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందన్న విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. 1920 అక్టోబర్ 17న ఎం.ఎన్.రాయ్ ఆయన భార్య ఎలెన్‌రాయ్, అబనీ ముఖర్జీ ఆయన భార్య రోజో ఫిలింగోవ్, మహమ్మద్ అలీ, ప్రతివాద భయంకర తిరుమలాచార్య తాష్కెంట్‌లో సమావేశమయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటును ప్రకటించారు.

ఎలెన్‌రాయ్ అమెరికా వనిత, రోజో ఫిలింగోవ్ సోవియట్ మహిళ. పైగా అది భారత గడ్డ మీద పుట్టినపార్టీ కాదు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ దాన్ని సీపీఐగా గుర్తించలేదు. అప్పటికి బొంబాయిలో ఎస్.ఎ.డాంగే, కలకత్తాలో ముజఫర్ అహ్మద్, మద్రాసులో సింగారవేలు చెట్టియార్, లాహోర్‌లో గులాం హుస్సేన్ నాయకత్వంలో కమ్యూనిస్టు బృందాలు పని చేస్తున్నాయి. సత్యభక్త అనే కామ్రేడ్ చొరవతో 1925 డిసెంబర్ 25, 26 తేదీల్లో కాన్పూరులో కీలకమైన సమావేశం జరిగింది. ఈ సభలోనే సింగారవేలు చెట్టియార్‌ను అధ్యక్షుడిగా, ఎస్.వి. ఘాటేని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. బొంబాయి కార్యక్షేత్రంగా సీపీఐని ఏర్పాటు చేయాలనుకున్నారు. వ్యక్తులూ, కమ్యూనిస్టు బృందాల స్థాయి నుంచి కమ్యూనిస్టు పార్టీగా ఆవిర్భవించింది. వీళ్లందరికీ ఎం.ఎన్.రాయ్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి.

పది సంవత్సరాల తర్వాత, గాంధీజీ స్వాతంత్ర్య పోరాటం దేశాన్ని కుదిపివేస్తున్న కాలం, 1936లో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం మొగ్గ తొడిగింది. సజ్జాద్ జహీర్, ముల్క్ రాజ్ ఆనంద్, కె.ఎ.అబ్బాస్, అలీ సర్దార్ జాఫ్రీ, కైఫీ అజ్మీ, రాజేందర్ సింగ్ బేడీ లాంటి పేరున్న రచయితలూ, కవులూ ముందడుగు వేశారు. ఆ రోజుల్లోనే బెంగళూరుకు చెందిన కుమారి అనిల్ డి సిల్వాకు ప్రజా నాట్యమండలి ఏర్పాటు చేయాలన్న ఆలోచన తట్టింది. పాట, నాటకం, నృత్య రూపకం జనశ్రేణుల్ని కదిలించాయి. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అనే ప్రజా నాట్యమండలి 1943లో ఏర్పడింది. ఒకరా ఇద్దరా.. పృథ్వీరాజ్ కపూర్, కిషన్ చందర్, ఇస్మత్ చుగ్తాయ్, కర్తార్‌సింగ్ దుగ్గల్, బలరాజ్ సహానీ, సలీల్ చౌదరి, ఎస్.డి.బర్మన్, పండిట్ రవిశంకర్.. మరెందరో మహానుభావులతో 'ఇప్టా' సాంస్కృతిక ఉద్యమం నడిచింది. గొంతెత్తి పాటలు పాడి సోషలిస్టు సమాజం అనే కలని రారమ్మని పిలిచింది. 'భూ ఖా హై బెంగాల్' లాంటి పాటలు జనాన్ని ఆకర్షించాయి. ప్రజానాట్య మండలి చొరవతో తీసిన 'ధర్తీకే లాల్' సినిమా నాటి సమాజాన్ని పూగించింది. ఆ కాలంలోనే వేములపల్లి శ్రీకృష్ణ, కళాకారుడు నాజర్‌ను ప్రజానాట్య మండలిలో చేర్చారు. ఇక నాజర్ బుర్రకథ దళం విజృంభించింది. అనేక బుర్రకథ బృందాలు రంగంలోకి దిగాయి. దళిత డప్పుని మండలి అప్పుడే సొంతం చేసుకుంది. అమృతయ్య, ఏసుదాసులు ఉత్తమ డప్పు కళాకారులుగా పేరు పొందారు. ఆంధ్రప్రదేశ్ అంతటా ఒక వంద దళాలు 'మా భూమి' నాటకం ప్రదర్శించాయి. ఒగ్గు కథ, గొల్లసుద్దులు తెలంగాణను పులకింపజేశాయి. పేద కళాకారులకు పెద్ద అండగా నిలబడింది. ప్రజానాట్య మండలి.

అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా

పదేపదే రణానికై నగారా మోగుతోందిరా..

అని రాంభట్ల కృష్ణమూర్తి పాటరాసి

60 సంవత్సరాలు అవుతోంది..

రాయల్ నేవీ తిరుగుబాటు :

**అది 1946 ఫిబ్రవరి 19 :** మద్రాసులోని నౌకా స్థావరంలో బ్రిటీషర్ల ఆధీనంలో వున్న 150 మంది భారత నౌకాదళ సిబ్బంది తిరుగుబాటు చేశారు. బ్రిటీష్ అధికారుల మీద దాడులు చేశారు. సైనికులు, పోలీసులు, పౌరులు వీళ్లతో కలిశారు. కరాచీ నుంచి కలకత్తా దాకా.. కనీసం పది వేల మంది, 546 నౌకల మీద ఉన్న వారంతా తిరుగుబాటు చేశారు. దారుణమైన పరిస్థితులు, పాచిపోయిన ఆహారం వీళ్ల ప్రధాన సమస్య. అరెస్టులు జరిగాయి. 476 మందిని బర్తరఫ్ చేశారు. సైన్యం తిరుగుబాటు బ్రిటీష్ వాళ్లని గడగడలాడించింది.

**1948వ సంవత్సరం, జులై 4 :** తెలంగాణ రైతుల పోరాటం మొదలయ్యింది.. హైదరాబాద్ సంస్థానంలో నిజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్ర ప్రసిద్ధి పొందింది. రాజు నిజాం అయినా పన్నులు వసూలు చేసి, వేధించి అసలు పెత్తనం చలాయించిన దేశ పాండ్యా, దేశ్ ముఖ్, జాగిర్దార్, ముక్తేదార్, పరగణాదార్లపై ఆగ్రహ ప్రదర్శనే తెలంగాణ రైతాంగ పోరాటం. ఆ కాలంలో స్త్రీలు, గ్రామీణ పేదలూ నరకయాతన అనుభవించారు. కమ్యూనిస్టులు తుపాకులు పట్టుకుని చెలరేగిపోయారు. దొరల అంతు చూశారు. గ్రామాలను విముక్తి చేశారు. ఈ సాయుధ ఘర్షణల్లో నాలుగు వేల మంది కామ్రేడ్స్ నేలకొరిగారని చరిత్ర

చెబుతోంది.

అప్పుడే సునీల్ జానా అనే గొప్ప ఫోటోగ్రాఫర్ తెలంగాణ వచ్చారు. 1918 ఏప్రిల్ 17న అస్సాంలోని దిబ్రూగఢ్‌లో సునీల్ జానా జన్మించినా కలకత్తాలోనే పెరిగారు. కమ్యూనిస్టు నాయకుడు పి.సి.జోషి సునీల్ ప్రతిభని గుర్తించారు. బెంగాల్ కరువును రికార్డు చేయమని కోరారు. సునీల్ జానా తీసిన ఫోటోలతో, బెంగాల్ కరువుపై పి.సి.జోషి రాసిన వ్యాసాలు, కమ్యూనిస్టు పత్రిక పీపుల్స్ వార్‌లో పబ్లిష్ అయ్యేవి. ప్రజల మనిషి చిత్రప్రసాద్ బొమ్మలు కూడా ప్రచురించింది అప్పుడే.

**1940, అక్టోబరు 24 :** కేరళలో దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్న జాలర్లు, రైతులు, కొబ్బరిపీచు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు పోరాటం ప్రారంభించారు. పున్నప్ర అనేచోట మొదలైన తిరుగుబాటు వాయిలార్‌లో ముగియడంతో ఇది పున్నప్ర వాయిలార్ మహోద్యమంగా చరిత్రకెక్కింది. ట్రావెన్‌కోర్ దివాన్ సి.పి.రామస్వామి అయ్యర్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఇది. పోలీసులు పైశాచికంగా లాఠీచార్జీ చేశారు. అనేక మంది ఘర్షణల్లో మరణించారు. ఉద్యమాన్ని కేరళ కమ్యూనిస్టు పార్టీ ముందుండి నడిపించింది.

ఇలా సాటి మనుషులను హీనులుగా, బానిసలుగా చూడడం మానకపోతే సామాన్య జనం వూరుకోరని, తిరగబడతారని కమ్యూనిస్టు చేసిన ఈ హెచ్చరికలు, కార్యాచరణ, సాయుధ పోరాటం నాటి భారతీయ సమాజాన్ని ప్రభావితం చేశాయి. కార్మికులు, రైతులు చేసిన త్యాగాలు వృథా కాలేదు. ఈ మహత్తర పోరాటాలను, ప్రాణాన్ని బలి ఇచ్చిన సామాన్యుడి సాహసాన్ని, కన్నీళ్లూ నెత్తుటితో తడిచిన చరిత్రను ఆర్వీ రామారావు, అతిశయోక్తులు లేకుండా, ఉపన్యాసాలు దంచకుండా, సిన్సియర్‌గా రికార్డు చేశారు. వందేళ్ల ఉద్యమాన్ని వంద డాక్యుమెంటరీ చిత్రాలుగా మన కళ్లముందు పరిచారు.

ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ నుంచి ఇంద్రజిత్ గుప్తా దాకా. హిరేన్ ముఖర్జీ నుంచి భూపేష్‌గుప్తా దాకా, సుందరయ్య, రాజేశ్వరరావుల నుంచి రావి నారాయణరెడ్డి దాకా కమ్యూనిస్టు ఉద్యమం ఎగ్రమందారాలై వికసించడానికి కృషి చేసిన, సుఖమయమైన జీవితాన్ని పార్టీ కోసం త్యాగం చేసిన ధన్యజీవులందరిని రామారావు ఎంతో ప్రేమతో కృతజ్ఞతతో తలుచుకున్నారు.

వామపక్షాల అనైక్యత, కమ్యూనిస్టు ఉద్యమం చీలిక, పాలకులకు దగ్గరై పేదలకు దూరమైన కమ్యూనిస్టుల దయనీయ స్థితి గురించి కూడా రామారావు ఆవేదనతోనే అయినా స్పష్టంగా రాశారు. సంవత్సరాలు, తారీకులు, రుజువులతో ఉద్యమ సమాచారాన్ని నిజాయితీగా రాశారు. కమ్యూనిస్టు కార్యకర్తలతో, సానుభూతిపరులతో కాకుండా, గత సూరేళ్ల చరిత్ర తెలుసుకోదగిన వాళ్లకి అందరికీ ఇది ఉపయోగపడే పుస్తకం. ఈజీగా ప్రతి ఒక్కరి 'సూటిగా, సరళంగా రాయడానికి ఆర్వీ రామారావు తీసుకున్న శ్రద్ధ మెచ్చుకోతగినది. ఈ రకంగా ఆయన ఒక పెద్ద బాధ్యతని నెరవేర్చారు.

పార్టీతో, అభ్యుదయ రచయిత సంఘంతో ఉన్న అనుబంధానికి ఆర్వీయార్ రుణం తీర్చుకున్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన ఈ అరుణపథానికి, జర్నలిస్టు. రచయిత మందలపర్తి కిషోర్ ముందు మాట రాస్తూ, 'ఇక్కడ ఎవరికీ ఏదీ సొంతం కాదు. ప్రతి ఒక్కరూ ధనవంతులే. అవును, ఆనందం కన్నా, చిత్తశాంతి కన్నా మానసిక ఆందోళనల నుంచి విముక్తి విముక్తి పొందడంకన్నా మహనీయమైన సంపదలు ఏముంటాయి మరి?" అని అన్న 'ఉటోపియా స్వాప్నికుడు థామస్ మోర్ మాటల్ని గుర్తు చేశారు.

ఒక సుదూరపు మహా స్వప్నం– సోషలిజం.

ఒక బహుదూరపు బాటసారి– విప్లవోద్యమం. ❑

## ప్రజా రిపబ్లిక్ ఉద్యమం కార్యక్రమాల కేలండర్

- జనవరి 26 – రిపబ్లిక్ దినోత్సవం (జనవరి 22 నుండి 26 తేదీలలో మీ వీలును బట్టి నిర్వహించాలి)
- ఫిబ్రవరి 20 – సామాజిక న్యాయ దినోత్సవం
- మార్చి 8 – మహిళా దినోత్సవం
- ఏప్రిల్ 11– జ్యోతిబా పూలే జయంతి
- ఏప్రిల్ 14 – బీఆర్ అంబేద్కర్ జయంతి
- మే 5 – కార్ల్ మార్క్స్ జయంతి
- ఆగస్టు 15 – స్వాతంత్ర్య దినోత్సవం
- అక్టోబరు 2 – గాంధీజీ జయంతి
- అక్టోబరు 17 – పేదరిక నిర్మూలన దినోత్సవం
- నవంబరు 11 – మౌలానా అజాద్ జయంతి
- నవంబరు 26 – రాజ్యాంగ దినోత్సవం
- డిసెంబరు 10 – మానవహక్కుల దినోత్సవం (10 నుంచి 18 వరకు హక్కుల దినోత్సవం ఏదో ఒక రోజు నిర్వహించాలి.)
- డిసెంబరు 18 – మైనారిటీల హక్కుల దినోత్సవం

**ఇది మన ఉద్యమ కార్యకలాపాల కేలండర్**
**(అవకాశం వున్న వారు ప్రముఖుల వర్ధంతులను నిర్వహించుకోవాలి)**

# ప్రజా రిపబ్లిక్ ఉద్యమ సభలు






**2026 జనవరి 4వ తేదీ**

**తణుకు సమావేశం**




సభలో మాట్లాడుతున్న విశ్రాంత ఆచార్యులు అబ్దుల్ నూర్‌బాషా

## 'సంపద పంపిణీతోనే సంక్షేమ సమాజం'

తణుకు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంపద పంపిణీతోనే సంక్షేమ సమాజం సాధ్యపడుతుందని నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు అబ్దుల్ నూర్ బాషా అన్నారు. ఆదివారం తణుకు సురాజ్య భవన్‌లో ప్రజా రిపబ్లిక్ ఉద్యమ పరిచయ సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. కుల,మత,లింగ పరమైన వివక్ష ఉన్నందు వల్లే ఆయా తరగతుల సమూహాలు పేదరికంలో ఉన్నాయన్నారు. సంపదను సృష్టించే శ్రమజీవులకీ, సామాన్యులకీ కార్పొరేట్ల దగ్గర పోగుబడ్డ సంపదపై వివిధ పన్నుల ద్వారా ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి పలు పద్ధతులు ద్వారా పేదరికం లేని సమాజాన్ని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ప్రజా రిపబ్లిక్ ఉద్యమంలో శ్రమజీవుల సంఘాలు, మైనార్టీల సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలన్నారు. విశ్రాంత ఐఎఎస్



విశాలాంధ్ర

## సంపద పంపిణితోనే సంక్షేమ సమాజం

### ప్రజా రిపబ్లిక్ ఉద్దమ సభలో అబ్దుల్ నూర్‌బాషా



## సంపద పంపిణీతో సంక్షేమ సమాజం

**అత్తిలి గ్రామీణం, తణుకు, న్యూస్‌టుడే:** సంపద పంపిణీతో సంక్షేమ సమాజం సాధ్యపడుతుందని నాగార్జున యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యులు అబ్దుల్ నూర్ బాషా అన్నారు. ఆదివారం తణుకు సురాజ్య భవనంలో నిర్వహించిన ప్రజా రిపబ్లిక్ ఉద్యమ పరిచయ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో ముఖ్య అతి... ధిగా విశ్రాంత ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ హిందుత్వ విభ... జన రాజకీయం, కార్పొరేట్ల దోపిడీపైన పోరాడుతున్న వామపక్ష పార్టీలు రాజకీయ శక్తిగా ప్రజల ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మాజీ... కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, మున్సిపల్ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అబ్దుల్ నూర్ బాషా

**జనవరి 7వ తేదీ తాడేపల్లిగూడెం**





జంగారెడ్డిగూడెంలో ప్రజా రిపబ్లిక్ ఉద్యమం పుస్తకాన్ని ఆవిష్కరించిన మొగళ్లపు వెంకటేశ్వరరావు

**జనవరి 19వ తేదీ జంగారెడ్డిగూడెం**



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

## సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం ఉద్యమం

జంగారెడ్డిగూడెం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక సమాన...



ఆంధ్ర సింహం

## పేదరిక నిర్మూలనకు జాతీయ బోనస్ చట్టం తేవాలి!

డీబీవీఎస్ వర్మ డిమాండ్!





పేదరిక నిర్మూలనకు జాతీయ బోనస్ చట్టం తేవాలి!





జనవరి 1వ తేదీ  తణుకు అక్కమాంబ , సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్లుల కార్మికులతో డివివియస్ వర్మ, కోనాల భీమారావు ముఖాముఖి



ఆంధ్రప్రభ

## ప్రజా రిపబ్లిక్ ఉద్యమాన్ని బలపరచండి

• డీవీవీఎస్ వర్మ పిలుపు

తణుకు, డిసెంబర్ 22 (ఆంధ్రప్రభ): వివక్ష, దోపిడీ లేని రాజ్యం కోసం తలపెట్టిన ప్రజా రిపబ్లిక్ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని దారి దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం తణుకు మండలం దువ్వ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వర్మ మాట్లాడుతూ మన దేశం ప్రజలందరిదీ అని మతపరమైన, కులపరమైన, స్త్రీ పరమైన వివక్షకు తావులేకుండా అందరూ సమాన హక్కుదారులుగా ప్రకటించిన రాజ్యాంగంలోని లౌకిక వాదాన్ని ఆచరణలో అమలు కోసం సాగించే ప్రజా ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.





2025 డిసెంబరు 22వ తేదీ తణుకు మండలం దువ్వలో సమావేశం














ఆయనకే దిక్కులేదు..!

న్యాయానికి దిక్కెవరు ?








ఇచ్చే వరకు వదలడు

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 4 - Issue No : 4 Online Edition January 2026




కొత్త పుస్తకాల స్వీకారం

